www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 16-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 331 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 9.40 తదుపరి అష్టమి; నక్షత్రం: రోహిణి సా. 4.06 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ. 8.07-9.42, రా. 9.51-11.30; దుర్ముహూర్తం: ఉ. 6.26-8.02; అమృతఘడియలు: మ. 12.54-2.30; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.26; సూర్యాస్తమయం: 6.22 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అంతా మా ఇష్టం!

సెలెక్షన్స్‌లో ఒక సామాజిక వర్గానికే ప్రాధాన్యం

పైరవీదారులకు జట్టులో చోటు!



అస్మదీయులు లేని జిల్లాల్లో అడ్‌హాక్ కమిటీలు

ప్రతిభకు పాతర, సిఫారసులకు అందలం

మసకబారుతున్న ఏసీఏ ప్రతిష్ఠ

10



"ప్రజాశ్రేయస్సు అనే మాటకు అర్థం తెలియని నాయకులను చూస్తున్నాం. తండ్రి చనిపోయిన దుఃఖంలో, న్యాయం కోసం పోరాడే ఆడకూతురు ఒకవైపు ఉంది. చంపిన వాళ్లను, చంపించినవాళ్లను రక్షిస్తున్న ప్రభుత్వం మరోవైపు ఉంది. మీరు ఎటువైపు ఉంటారు? మన గుండెల్లో అణిగి ఉన్న ఆక్రోశాన్ని, ఆవేశాన్ని మౌనంగా అయినా వెల్లడించే అవకాశం వచ్చింది. మీరు నిశ్చయించుకోవాలి. ఒక భవనాన్ని కట్టించేటప్పుడు పునాది చాలా ముఖ్యం. వైసీపీ పునాదులు రక్తంలో మునిగి ఉన్నాయి. అది వివేకానందరెడ్డి రక్తం, కోడి కత్తి శ్రీను రక్తం".

\- సునీత

రక్తంలో మునిగిన వైసీపీ పునాదులు

న్యాయం కోసం నిలబడిన ఆడకూతురు ఒకవైపు

హంతకులను రక్షిస్తున్న ప్రభుత్వం మరోవైపు

జనం ఏవైపో తేల్చుకోవాల్సిన తరుణమిదే: సునీత

మేమే చంపించామని 'సాక్షి'లో రాయించేవారు

అదే విషయం సీబీఐకి చెప్పండి.. 5లక్షల రివార్డు ఇస్తారు

చనిపోయేముందుదాకా మీకోసమే వివేకా పనిచేశారు

అయినా జయంతికిగానీ, వర్ధంతికిగానీ వచ్చారా?

అంతఃకరణ శుద్ధి అనే మాటకు అర్థం తెలుసా మీకు?

అన్న జగన్‌ను సూటిగా నిలదీసిన వివేకా కుమార్తె

వివేకా ఐదో వర్ధంతి సందర్భంగా కడపలో ఆత్మీయ సభ

కడప, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా అంతఃకరణ శుద్ధితో పని చేస్తానని ప్రమాణం చేసిన జగన్‌కు, ఆ మాటకు అర్థం తెలుసా అని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ పునాదులు వివేకానంద రెడ్డి రక్తం, కోడికత్తి శ్రీను రక్తంతో మునిగి ఉన్నాయన్నారు. శుక్రవారం కడపలోని జయరాజ్ గార్డెన్స్‌లో వైఎస్ వివేకానందరెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా జరిగిన ఆత్మీయ సభలో సునీత ఉద్వేగ భరితంగా మాట్లాడారు. "వివేకా హత్య గురించి

మిగతా 14వ పేజీలో...



5

అన్నా అని పిలిపించుకున్నవాడే...

హంతకులను రక్షిస్తున్నాడు

పైగా బాధితురాలు సునీతపైనే అభాండాలు

'సాక్షి'లో వివేకా వ్యక్తిత్వ హననానికి ప్రయత్నం

మీరు మనుషులేనా? మనస్సాక్షి లేదా మీకు?

అద్దం ఎదుట నిలబడి మిమ్మల్ని ప్రశ్నించుకోండి

అన్న జగన్‌ను ఉద్దేశించి షర్మిల తీవ్ర స్వరం

న్యాయం, నిజం పక్కన రాష్ట్ర ప్రజలు నిలబడాలి

కోడ్ కూసే ముందు డీఏ డ్రామా

2023లో ఇవ్వాల్సిన రెండు డీఏలు విడుదల

అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

బకాయిలు 3 విడతల్లో చెల్లిస్తామని ప్రకటన

ఉద్యోగులపై జగన్ సర్కారు కపట ప్రేమ

2024 జనవరి డీఏ ఇంకా పెండింగ్‌లోనే..

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మరికొన్ని గంటల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా జగన్ సర్కారు డీఏల డ్రామాకు తెరతీసింది. 2023 జనవరి, జూలై నెలలకు సంబంధించిన రెండు పెండింగ్ డీఏల విడుదలపై శుక్రవారం అర్ధరాత్రి హడావుడిగా జీవోలు జారీ చేసింది. 2023 జనవరి డీఏను ఈ ఏడాది ఏప్రిల్ జీతంతో కలిపి మే నెలలోనూ, 2023 జూలై నెలకు సంబంధించిన డీఏను ఈ జూలై వేతనంతో కలిపి ఆగస్టులో ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీని ప్రకారం ఉద్యోగులు కోడ్ అమలులో ఉన్న సమయంలో ఒక డీఏ తీసుకోవాల్సిన పరిస్థితి ఉండగా, మరోదాన్ని ఎన్నికల తర్వాత వచ్చే కొత్త ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఈ రెండు డీఏల బకాయిలను మూడు విడతల్లో అంటే 2024 సెప్టెంబరు, డిసెంబరు, 2025 మార్చిలో చెల్లిస్తామని జీవోలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి 6నెలలకు ఒకసారి చొప్పున ఏటా రెండుసార్లు డీఏలు ఇవ్వాల్సి ఉండగా జగన్ ప్రభుత్వం సంవత్సరాల తరబడి విడుదల చేయనేలేదు. గతంలో విడుదల చేసిన డీఏ బకాయిల చెల్లింపునకు ఇప్పటికీ దిక్కు లేదు. కొత్త డీఏలు ఇవ్వాలని, పాత డీఏల బకాయిలు చెల్లించాలని మంత్రుల కమిటీ సమావేశంలో, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ఉద్యోగ సంఘాల

మిగతా 13వ పేజీలో...

నేడే ఎన్నికల నగారా



లోక్‌సభతోపాటు ఆంధ్ర, ఒడిసా, అరుణాచల్, సిక్కిం అసెంబ్లీలకూ ఎన్నికలు

4-5 దశల్లో పార్లమెంట్ పోలింగ్?

ఏపీ, అరుణాచల్, సిక్కింలకు ఒకేసారి

ఒడిసాకు 4 విడతల్లో జరిగే అవకాశం

దేశవ్యాప్తంగా ఈసీ పర్యటనలు

షెడ్యూల్ ప్రకటించగానే కోడ్ అమల్లోకి

కొత్త కమిషనర్ల నియామకంపై స్టేకు సుప్రీం నో

మధ్యాహ్నం 3 గంటలకు షెడ్యూల్ ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నగారా శనివారం మోగనుంది. కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) లోక్‌సభతో పాటు, ఆంధ్రప్రదేశ్, ఒడిసా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనుంది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలో ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్, కొత్త కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సంధూలతో కూడిన పూర్తిస్థాయి ఎన్నికల కమిషన్ విలేకరుల సమావేశం నిర్వహించనుంది. ఆ సందర్భంగా ఎన్నికల

మిగతా 13వ పేజీలో...



శుక్రవారం రాత్రి కవితను అరెస్ట్‌చేసి తీసుకెళుతున్న ఈడీ అధికారులు

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో.. కేసీఆర్ కుమార్తె

కవిత అరెస్టు

పీఎంఎల్ఏ చట్టం కింద అదుపులోకి..

ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఈడీ

ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం.. కవిత ఇంటిలో తనిఖీలు

సాయంత్రం అరెస్టు చేస్తున్నట్లు వెల్లడి

ఈడీ అధికారులతో కేటీఆర్, హరీశ్ వాగ్వాదం

విమానంలో ఢిల్లీకి కవిత తరలింపు

అరెస్టును సవాల్ చేస్తూ నేడు సుప్రీంలో పిటిషన్

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కాం కేసులో నిందితురాలిగా ఉన్న తెలంగాణ మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ కోణంలో పీఎంఎల్ఏ యాక్టు ప్రకారం అరెస్టు చేసినట్లు వారు శుక్రవారం ప్రకటించారు. ఆమెను ఢిల్లీ తరలించారు. వాస్తవానికి సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉన్నందున ఆమెను అరెస్టు చేసే అవకాశం లేదని

మిగతా 13వ పేజీలో...


'సేవ్ విశాఖ-సేవ్ స్టీల్‌ప్లాంట్'

నేడు విశాఖలో కాంగ్రెస్ బహిరంగ సభ

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విశాఖపట్నం రాక

13

నంబర్లను వెల్లడించలేదేం?



ఎలక్టోరల్ బాండ్ల పూర్తి వివరాల్ని ఎందుకు తెలియజేయలేదు?

బాండ్ తేదీ, విలువ, కొనుగోలుదారు వివరాలతోపాటు నంబరూ చెప్పాలి

ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు నోటీసులు

18వ తేదీకి విచారణ వాయిదా

కోర్టుకు సమర్పించిన బాండ్ల పత్రాలను ఈసీకి ఇవ్వాలని రిజిస్ట్రార్‌కు ఆదేశం

12

ఏపీపీఎస్సీ భ్రష్టు

జగన్‌దే ఈ పాపం

కమిషన్‌ను పైరవీలకు కేంద్రంగా మార్చారు

గ్రూప్-1 ఉద్యోగాలను కూడా అమ్ముకున్నారు

ఇంకా ఏ మొహం పెట్టుకొని సీట్లో కూర్చున్నారు?

పేపర్లు రెండుసార్లు దిద్దాల్సిన అవసరమేంటి?

మూల్యాంకనంపై హైకోర్టు ముందు అబద్ధాలు

అభ్యర్థుల భవిష్యత్తును నాశనం చేసినవారిని వదిలేది లేదు: టీడీపీ అధినేత చంద్రబాబు



ఏపీపీఎస్సీలో జరుగుతున్న అక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న చంద్రబాబు

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను సీఎం జగన్ తన కక్కుర్తితో భ్రష్టుపట్టించారని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. 2018 గ్రూప్-1 మెయిన్స్ పేపర్ల మూల్యాంకనంలో ఏపీపీఎస్సీ తీరును తప్పుబట్టిన హైకోర్టు ఏకంగా పరీక్షలను రద్దు చేయడంపై ఆయన శుక్రవారం స్పందించారు. 'ఎన్నో కలలతో ఆశలతో ఏళ్ల తరబడి చదివి పరీక్షలు రాసిన అభ్యర్థులను దారుణంగా మోసం చేశారు. అభ్యర్థులు, వారి కుటుంబాల ఆశలను ఛిద్రం చేశారు. క్రూరమృగాల కంటే హీనంగా ప్రవర్తిస్తున్నారు. మొత్తం

మిగతా 11వ పేజీలో...

అడ్డంగా దొరికిన ఏపీపీఎస్సీ!

గ్రూప్-1 పేపర్లు రెండుసార్లు మూల్యాంకనం

రిసార్ట్స్‌కు చెల్లింపులు.. హైదరాబాద్ కంపెనీలకు ఆర్డర్లు

ప్రతిదానికీ బిల్లులు.. అన్ని ఆధారాలూ న్యాయస్థానానికి

11



సభ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

రేపే కూటమి 'ప్రజాగళం'

బొప్పూడిలో బహిరంగ సభ

300 ఎకరాల ప్రాంగణంలో భారీగా ఏర్పాట్లు

ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ

చంద్రబాబు, పవన్.. ఇతర ముఖ్యనేతలూ..

అసాధారణ భద్రత.. ఆరు హెలిప్యాడ్‌ల ఏర్పాటు

ఎస్‌పీజీ నిఘాలో పనులు

13

విజిలెన్స్‌కు అపరిమిత అధికారాలా?

అధికారులకు విస్తృత అధికారాల కల్పన ఎలా సాధ్యం?

చట్టాలకు లోబడి ఆయా శాఖలు పనిచేస్తున్నాయి

వాటిపై అధికారాలు కావాలని విజిలెన్స్ ఐజీ ఎలా కోరతారు?

చట్టబద్ధంగా కల్పించాల్సిన అధికారాలను కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా దఖలుపర్చలేరు

ఐజీ రఘురామిరెడ్డి లేఖపై వివరాలు సమర్పించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. విచారణ 19కి వాయిదా

సర్కారుకు హైకోర్టు సూటి ప్రశ్న



అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏ కార్యాలయాన్నైనా, సంస్థనైనా సందర్శించేందుకు, తనిఖీ చేసి రికార్డులు జప్తు చేసేందుకు వీలుగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలోని గజిటెడ్ అధికారులను అధీకృత అధికారులుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆ శాఖ ఐజీ రఘురామిరెడ్డి రాసిన లేఖ పై పూర్తి వివరాలు సమర్పించాలని ఏపీ సర్కార్‌ను హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. ఆయా చట్టాలకు లోబడి సంబంధిత శాఖలు పని చేస్తున్నాయని, అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే శాఖలను, ఆయా చట్టాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోకి తీసుకురావాలని ఐజీ ఎలా కోరతారని ప్రశ్నించింది. చట్టబద్ధంగా కల్పించాల్సిన అధికారాలను కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా దఖలుపర్చలేరని

మిగతా 3వ పేజీలో...



అడ్డగోలుగా పదోన్నతులు!

మున్సిపల్‌లో నిబంధనలు బేఖాతరు

సర్వీస్ రూల్స్ మార్చి ఏడీలుగా పదోన్నతులు

ఎన్నికల ముందు హడావుడిగా సన్నాహాలు

మున్సిపాలిటీల్లో పనిచేసే అధికారులకే చాన్స్

ఒక్కొక్కరి నుంచి 5-10 లక్షలు వసూలు

పురపాలక శాఖ ఉన్నతాధికారికి ముడుపులు

ప్రధాన, రీజనల్ ఆఫీసుల్లో పనిచేసే వారికి అన్యాయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కోడ్ కూయకముందే వీలైనంతగా సొమ్ము చేసేసుకుంటున్నారు. ఏకంగా మునిసిపల్ శాఖ ఉన్నతాధికారే అక్రమ పదోన్నతులతో కాసుల పండగ చేసుకున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ డైరెక్టర్ టౌన్‌ప్లానింగ్ అధికారుల పదోన్నతుల్లో నిబంధనలకు పాతరేసిన మున్సిపల్ శాఖ.. తాజాగా అసిస్టెంట్ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ అధికారుల పదోన్నతుల్లోనూ అక్రమాల జాతరకు తెరలేపింది. ఎన్నికల కోడ్ వస్తుందన్న హడావుడిలో సర్వీస్ రూల్స్‌ను అడ్డగోలుగా మార్చి 19 మంది టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లకు అసిస్టెంట్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఒక్కో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ నుంచి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా వసూలు చేసి మున్సిపల్ శాఖ ఉన్నతాధికారికి ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రధాన కార్యాలయం, రీజనల్ ఆఫీసుల్లో పని చేసేవారికి పదోన్నతుల్లో అవకాశమివ్వకుండా... కేవలం మున్సిపాలిటీల్లో పనిచేసే టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లకు అసిస్టెంట్ డైరెక్టర్లుగా పదోన్నతులు ఇస్తున్నట్లు తెలిసింది. శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని

మిగతా 2వ పేజీలో...


Sleep Cooler.
Sleep Better.™
Q-GEL™ MATTRESS
Powered by
CuSense™ Technology
Centuary®
MATTRESSES
INDIA KA SLEEP SPECIALIST
CuSense Technology
Centrik Pro Responsive Cushioning
Ergo-form Transition Foam
Euro top
ANTI SLIP
Grip+ Fabric
CertiPUR-US
Certification of Quality
NEW LAUNCH OFFER
FREE
Antimicrobial Bedsheet
CuSense™ Pillow Set
10% off
*T&C Apply
VIJAYAWADA: PAVAN ENTERPRISES 99480 15402 | JYOTHI FURNITURE CENTRE 98481 33713 | CENTRAL FURNITURE 94402 49385 | NARAYANASWAMY FURNITURE 9246493265 | NEELIMA FURNITURE HOUSE 93921 01858 | SRI SAI PADMA MARKETINGS 98481 17944 | RAMACHANDRA BROTHERS-6 80087 44687 | GUDIVIDA: SRI BHARAGAVI FURNITURES 94904 73565 | NANDIGAMA: PAVAN SAI FURNITURE SHOW ROOM 98491 00237 | NUZIVID: SAI SRINIVASA FURNITURE-NZ 99851 44365
FOR TRADE & BULK ENQUIRY: 7702838112

ఓట్ల కోసం రజిని తాయిలాలు

▸▸ గుంటూరు పశ్చిమలో చర్చి ఫాదర్స్‌కు వస్త్రాలంటూ ప్రచారం



మంత్రి విడదల రజినీ, సీఎం జగన్ ఫోటోలతో తెల్ల ప్యాంట్, చీర

గుంటూరు, మార్చి 15: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికలకు ముందే పోరు ఉధృతంగా మారుతోంది. మంత్రి విడదల రజినీ వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఈ నియోజకర్గంలో ఇప్పటికే అనేక తాయిలాలతో ప్రజలకు దగ్గరయ్యే పనిలో పడ్డారు. మొన్నటికి మొన్న మహా శివరాత్రికి ఆలయాల ఎదుట పులిహోర, ప్రసాదం డబ్బాలు పంపిణీ చేశారు. తాజాగా నియోజకవర్గంలోని చర్చిల్లో పాస్టర్‌లకు వైట్ ప్యాంట్లు, మహిళా సిబ్బందికి చీరలతో పాటు మరో రూ.4 వేలు నగదు అందజేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. పంపిణీకి సిద్ధంగా ఉన్న ప్యాంట్లు, చీరలంటూ శుక్రవారం నగరంలో సామాజిక మాధ్యమాల్లో ఈ ఫోటో వైరల్ అయింది.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా వెంకటలక్ష్మి

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గజ్జల వెంకటలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ఇప్పటికే మహిళా కమిషన్ సభ్యురాలిగా ఉన్నారు. ఇప్పటి వరకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఉన్న వాసిరెడ్డిపద్మ ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఖాళీగా ఉన్న చైర్‌పర్సన్ పదవికి వెంకట లక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి సబ్ కమిటీ

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సబ్ కమిటీని నియమించింది. మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌ను చైర్మన్‌గా, పలువురు అధికారులు, అంగన్వాడీ వర్కరు, హెల్పర్లను సభ్యులుగా నియమిస్తూ మహిళా శిశు సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్వాడీల 42 రోజుల సమ్మె కాలం సానుభూతిగా పరిగణించి వేతనాలు ఇస్తామని పేర్కొంటూ మరో ఉత్తర్వును జారీ చేసింది.

197 మంది జేఎల్స్‌కు పదోన్నతి

▸▸ ఎన్నికల కోడ్ నేపథ్యంలో హడావుడిగా ఉత్తర్వులు

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రిన్సిపాల్ పోస్టులను ఇంటర్ విద్యాశాఖ భర్తీ చేసింది. నాలుగు జోన్లలో 197 మంది జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించింది. జోన్-1లో 54 మందికి, జోన్-2లో 51 మందికి, జోన్-3లో 38 మంది, జోన్-4లో 54 మందికి పదోన్నతులు ఇచ్చారు. అయితే ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ జాబితాను పక్కనపెట్టి, కేవలం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా, నాన్ టీచింగ్ కోటా వారికి మాత్రమే ఈ పదోన్నతులు కల్పించారు. డీఆర్ కోటా వారికి మేలు చేయడం కోసం ఇలా అడ్డదారిలో పదోన్నతులు ఇచ్చేందుకు నెల రోజుల కిందటే ఇంటర్ విద్యాశాఖ ప్రయత్నాలు మొదలుపెట్టింది. శనివారం ఎన్నికల షెడ్యూలు విడుదలవుతుందని ఈసీ ప్రకటించడంతో హడావుడిగా శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు.

రెండో రోజూ పారిశుద్ధ్య కార్మికుల విధుల బహిష్కరణ

▸▸ వ్యర్థాలతో నిండిన రాష్ట్ర సచివాలయ పరిసరాలు

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సచివాలయంలోని పారిశుద్ధ్య కార్మికులు రెండో రోజు శుక్రవారం కూడా విధులు బహిష్కరించారు. దీంతో సచివాలయ పరిసరాలు, బ్లాకులు.. చెత్తా, చెదారం, వ్యర్థాలతో అపరిశుభ్రంగా మారాయి. మరుగుదొడ్ల క్లీనింగ్ లేకపోవడంతో కంపుకొడుతున్నాయి. దీంతో సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కాగా, తమకు సీఆర్డీఏ ఇచ్చే భూమిలేని పేదల పెన్షన్ కూడా ప్రభుత్వం ఎత్తేసిందని సచివాలయ పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. రేషన్ కార్డు సహా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కోరుతూ రెండు రోజులుగా వారు సచివాలయం వెలుపల మల్కాపురం సమీపంలో నిరసన తెలుపుతున్నారు.

ఏపీపీఎస్సీ అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలి: సీపీఐ

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ ఉద్యోగాల నియామకాల్లో కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినా.. ఏమాత్రం ఖాతారు చేయకుండా జగన్ ప్రభుత్వం మూర్ఖంగా ఫలితాలను ప్రకటించిందని విమర్శించారు. చివరికి గ్రూప్-1 పరీక్షలను రద్దు చేస్తూ మళ్లీ పరీక్షలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ చైర్మన్, సభ్యులు, అధికారులు, రాజకీయ పార్టీల నేతలతో సహా ఇందులో ఎవరెవరున్నారో, ఎంతమొత్తం చేతులు మారిందో నిగ్గుతేల్చి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐటీ, ఎలక్ట్రానిక్స్ పాలసీల గడువు పొడిగింపు

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ఎలక్ట్రానిక్స్ పాలసీ (2021-24)ల కాలవ్యవధిని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. 2021, ఏప్రిల్ 1న అమలులోకి వచ్చిన ఈ రెండు పాలసీల గడువు ఈ నెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో ప్రస్తుత పాలసీలనే ఈ ఏడాది సెప్టెంబరు 30 వరకు లేదా కొత్త పాలసీలను జారీ చేసేవరకు కొనసాగించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

యువతి ఆత్మహత్యాయత్నం

▸▸ వలంటీర్ కుటుంబ సభ్యుల వేధింపులే కారణం!



ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న యువతి

వినుకొండ టౌన్, మార్చి 15: వలంటీర్ కుటుంబ సభ్యుల వేధింపులు తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పల్నాడు జిల్లా వినుకొండ మండలంలోని జాలలపాలెంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా వున్నాయి. జాలలపాలెం గ్రామ వలంటీర్ గుడిపాటి బాజీతో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో వలంటీర్ భార్య నాగజ్యోతి, ఆమె తల్లి పున్నమ్మ గత నాలుగు సంవత్సరాలుగా వేధించడంతోపాటు, తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ గోళ్ల జ్యోతి శుక్రవారం ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాధితురాలు.. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లడుతూ వలంటీర్ బాజీతో అక్రమ సంబంధాన్ని అంటకట్టి భార్య నాగజ్యోతి, ఆమె తల్లి పున్నమ్మ ఇప్పటికే ఐదు సార్లు తనపై దాడిచేశారని ఆరోపించింది. ఇప్పటికైనా వలంటీర్ కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించి, తన ప్రాణాలను కాపాడాలంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

విజిలెన్స్‌కు అపరిమిత అధికారాలా?

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించింది. ఐజీ అభ్యర్థన మేరకు విస్తృత అధికారాలు కల్పించడం ఎలా సాధ్యమని ప్రశ్నించింది. ఐజీ అభ్యర్థన కేవలం ప్రతిపాదన దశలోనే ఉందని గుర్తు చేసింది. పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు శుక్రవారం ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలోని ఏ కార్యాలయాన్నైనా, సంస్థనైనా సందర్శించేందుకు, తనిఖీ చేసి రికార్డులు జప్తు చేసేందుకు, వారెంట్ లేకుండా అరెస్ట్ చేసేందుకు వీలుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో పనిచేసే గెజిటెడ్ అధికారులను అధీకృత అధికారులుగా నియమించి, అపరిమిత అధికారాలు కల్పించాలని కోరుతూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రఘురామిరెడ్డి రాసిన లేఖను సవాల్ చేస్తూ టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లేఖకు అనుగుణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి తీసుకున్న చర్యలను చట్ట, రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరారు. లేఖకు ఆధారంగా చర్యలు చేపట్టకుండా ముఖ్యమంత్రితో సహా సంబంధిత అధికారులు ఎలాంటి ఉత్తర్వులు, నోటీసులు, సర్క్యులర్లు, ఆర్డినెన్స్ తదితరాలు జారీ చేయకుండా నిషేధం విధించాలని కోరారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ... రాష్ట్ర ప్రభుత్వంలోని 13 శాఖలు, చట్టాల పై అపరిమిత అధికారాలు కల్పించాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీ లేఖ రాశారన్నారు. సోదాలు చేస్తాను అధికారాలు కల్పించండి అని దిగువస్థాయి అధికారి ప్రభుత్వాన్ని కోరడానికి వీల్లేదన్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్‌లు, శాఖలో జరిగే ఆర్థిక అవకతవకలపై విచారణ జరిపి ఆయా శాఖలకు నివేదిక మాత్రమే సమర్పించగలదన్నారు. అంతిమ నిర్ణయాధికారం ఆయా శాఖాధిపతులదేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే శాఖలు, ఆయా చట్టాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోకి తీసుకురావాలని, క్వాసీ జ్యుడీషియల్ అధికారాలు కల్పించాలని విజిలెన్స్ ఐజీ తన లేఖలో కోరారన్నారు. ఇదే జరిగితే ప్రైవేటు వ్యాపారసంస్థలలో కూడా సోదాలు నిర్వహించి, జప్తు చేసే అధికారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఉంటుందన్నారు. ఇలా చేయడం చట్టవిరుద్ధమన్నారు. టీడీపీ నాయకులు, మద్దతుదారులను తప్పుడు కేసులలో ఇరికించాలనే ఉద్దేశంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అక్రమంగా అధికారాలు కట్టబెట్టబోతున్నారన్నారు. ఆ ప్రక్రియ సాగుతోందని, ఎప్పుడైనా ఉత్తర్వులు రావచ్చునని అన్నారు. ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.... విస్తృత అధికారాలు కల్పించాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీ లేఖ మాత్రమే రాశారన్నారు. ఈ వ్యవహారం పై విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని న్యాయ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించిందన్నారు. మొత్తం 13శాఖలకు సంబంధించిన శాఖాధిపతుల సమ్మతి తీసుకోవాల్సి ఉందన్నారు. ఐజీ ప్రతిపాదనలో వ్యాపారసంస్థలకు నష్టం అని భావిస్తే వారే కోర్టును ఆశ్రయించాలన్నారు. వారి తరపున రాజకీయపార్టీ పిటిషన్ వేయడమేంటని ప్రశ్నించారు. ఇరువైపుల వాదనలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి ఈ వ్యవహారం పై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

అడ్డగోలుగా పదోన్నతులు!

(మొదటి పేజీ తరువాయి)

తెలిసి శుక్రవారం ఆదరాబాదరాగా సన్నాహాలు చేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులకు పదోన్నతి పొందాలంటే.. టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్లు, మున్సిపాలిటీల్లో పనిచేసే టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లతో పాటు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా సమానంగా 1:1:1 నిష్పత్తిలో భర్తీ చేస్తారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు సుమారు 19 దాకా ఖాళీలు ఏర్పడ్డాయి. వాటిని భర్తీ చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లను ఎంపిక చేశారు. టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్లు పదోన్నతికి అర్హత సాధించాలంటే మరో 10 నెలలు పడుతుంది. అందుకే ప్రస్తుతం టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్లలో అర్హులు లేరని, ఏపీపీఎస్సీ ద్వారా డైరెక్ట్ నియామకాలు కూడా లేవంటూ మున్సిపల్ శాఖ.. ఈ పోస్టులన్నీ మున్సిపాలిటీల్లో పనిచేసే టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లతో భర్తీ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం భారీగా సొమ్ములు వసూలు చేసి ఎన్నికల ముందు హడావుడిగా శనివారం ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. సుమారు రూ.కోటి నుంచి రూ.2 కోట్లు దాకా చేతులు మారాయని చెబుతున్నారు.

గతంలోనూ నిబంధనలు బేఖాతరు

2013లో కాంగ్రెస్ సర్కార్ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇలాగే సర్వీస్ రూల్స్‌ను సవరించి జీఓ నెం.500 ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అప్పట్లో కూడా టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లు, టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్లు, డైరెక్ట్ నియామకాలకు సమానంగా పదోన్నతులు కల్పించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా సర్వీస్ రూల్స్ సవరించారు. కేవలం టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లకు ఏడీలుగా పదోన్నతి కల్పిస్తూ ఆదేశాలిచ్చారు. అయితే ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత 2015లో ఆ ఉత్తర్వులను సరిదిద్దింది. సర్వీస్ రూల్స్‌ను ఎప్పటిలాగా 1:1:1 నిష్పత్తిలో ఇచ్చేలా ఆదేశాలిచ్చారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల ముందు ఉన్నతాధికారులు సొమ్ము చేసుకునేందుకు జీఓ నెం.42 తీసుకొచ్చి టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్లకు అన్యాయం చేశారని చెబుతున్నారు. పైగా టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లలో ఎక్కువ మంది డిప్లమో హోల్డర్‌లు ఉన్నారని, వారు ఎక్కువ కాలం అసిస్టెంట్ డైరెక్టర్లుగా కొనసాగుతారని అంటున్నారు. దీంతో తదుపరి పదోన్నతి అవకాశాలు కోల్పోతామని చెబుతున్నారు.

ఏపీఎస్‌ఆర్టీసీకి ఐదు జాతీయ అవార్డులు

ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ(ఏపీఎస్‌ఆర్టీసీ)కు జాతీయస్థాయిలో ఐదు అవార్డులు లభించాయని ఆర్టీసీ చీఫ్ ఇంజనీర్(ఐటీ) సుధాకర్ వాసా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏఎస్ఆర్టీయూ ప్రతిష్టాత్మక నేషనల్ బస్సు ట్రాన్స్‌పోర్ట్ ఎక్సలెన్స్ అవార్డును ఏటా అందిస్తుంది. శుక్రవారం న్యూఢిల్లీలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డులను ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఈడీ(ఏ అండ్ ఐటీ) కేఎస్ బ్రహ్మానందరెడ్డి, ఈడీ(ఈ) జి.రవివర్మ, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్(ఐటీ) వై.శ్రీనివాసరావు తదితరులు అందుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బాండు బంధాలు

ఎలక్టోరల్ బాండ్ల విషయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చివరి దోబూచులాటకు కూడా తెరపడింది. బాండ్లు ఖరీదు చేసినవారి జాబితా, బాండ్లు పొందిన పార్టీల జాబితా వేర్వేరుగా ఇచ్చి చేతులు దులుపుకుందామని చూసిన ఎస్‌బిఐకి, ఏ బాండ్లు ఏ పార్టీలు సొమ్ము చేసుకున్నాయో తెలిపే లింకు వివరాలను కూడా ఇవ్వాలని సుప్రీంకోర్టు శుక్రవారం నాడు స్పష్టం చేసింది. 2018లో ప్రవేశపెట్టిన బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు ఎన్నికల విరాళాలు అందించే పద్ధతిని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గత నెల 15వ తేదీన కొట్టివేసింది. ఇప్పటి దాకా వివిధ పార్టీలకు అందిన బాండ్ల వివరాలన్నిటిని మార్చి 6 నాటికి భారత ఎన్నికల కమిషన్‌కు అందించాలని ఆదేశించింది. సుమారు ఇరవైరోజుల పాటు కాలయాపన చేసి, రెండు రోజుల ముందు మూడు నెలల గడువు కావాలని స్టేట్ బ్యాంకు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మార్చి పదకొండో తేదీన సుప్రీంకోర్టు ఈ అభ్యర్థనను తోసిపుచ్చి, మరునాడే వివరాలను సమర్పించాలని, ఎన్నికల కమిషన్ 15వ తేదీలోగా వాటిని బహిరంగ పరచాలని ఆదేశించింది. పన్నెండునాడు వివరాలను అందుకున్న ఎన్నికల సంఘం గడువుకు ఒకరోజు ముందుగానే వెబ్‌సైట్‌లో ప్రచురించింది కానీ, అందులో కీలకమయిన లింకు వివరాలు లేవు.

ఈ మొత్తం వ్యవహారంలో స్టేట్ బ్యాంకు వ్యవహారసరళి ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎటువంటి ఒత్తిడులూ లేకుండా తనంతట తనే అత్యున్నత న్యాయస్థానంతో బ్యాంకు చెలగాటమాడుతుందని అనుకోలేము. చివరి దాకా, ప్రజలకు చేరవలసిన సమాచారాన్ని నిరోధించడానికే ప్రయత్నం జరిగింది. మొత్తంగా బాండ్ల రూపంలో ఎంత సొమ్ము సమీకృతమయింది స్పష్టంగానే ఉంది. ఏ యే పార్టీలు ఎంతెంత సొమ్ముచేసుకున్నాయి, స్థూలంగా ఒక అంచనాకు రావడం కష్టమేమీ కాదు. బాండ్ల వివరాలు రాక ముందే, కొన్ని వార్తాసంస్థలు డేటాను ఎట్లా అర్థం చేసుకోవచ్చో సూచనలు చేశాయి. ఎంతగా మభ్యపెడదామనుకున్నా, దాచిపెడదామనుకున్నా, కార్పొరేట్ రంగానికి రాజకీయ రంగానికి మధ్య ఉన్న ధనానుబంధం బట్ట బయలయింది, లింకు వివరాలు కూడా తెలిసిపోయాక, మరెన్నో రహస్యానుబంధాలు, తెరవెనుక వాస్తవాలు బయటకు వస్తాయి. దురదృష్టవశాత్తూ, జాతీయ మీడియా ఒకవైపు పూర్తిగా ఒరిగి ఉంది కాబట్టి, ఈ అంశాన్ని అప్రధానంగా పరిగణిస్తున్నది. మరోవైపు ప్రజల దృష్టి మళ్లించడానికి ఇతర సంచలనాత్మక పరిణామాలను కూడా కల్పిస్తున్నారు.

ఇంతకూ బాండ్లలో అంతటి తప్పు ఏమున్నది? అసలు ఆ పద్ధతే రాజ్యాంగబద్ధం కాదు అని సుప్రీంకోర్టు అన్నదంటే, అందుకు ప్రధాన కారణం అందులోని దాపరికమే. రహస్యంగా రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే అవకాశం ఇవ్వడం అంటే రాజ్యాంగంలోని 19(1)(ఎ)ని ఉల్లంఘించడమేనని, తెలుసుకునే హక్కును ప్రజలకు నిరాకరించడమేనని రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. ఏ విలువను కాపాడడానికి ఎన్నికల బాండ్ల పద్ధతిని తప్పని కోర్టు అన్నదో, ఆ విలువను బేఖాతరు చేయడానికి స్టేట్ బ్యాంక్ ద్వారా ప్రయత్నం జరిగింది. ప్రజలకు సమాచార హక్కు నెరవేరకుండా చూడడానికి చివరి నిమిషం దాకా అక్రమార్కులు పట్టువిడువలేదు.

రాజకీయ పార్టీలకు ప్రజల నుంచి, సంస్థల నుంచి, కంపెనీల నుంచి విరాళాలు అందడంలో తప్పేమీ లేదు. కానీ, రాజకీయ పార్టీలు కానీ, ఆయా వ్యక్తులూ సంస్థలూ కానీ సమాజానికి జవాబుదారీగా ఉండాలి. పరస్పర వాయనాలు ఏమీ ఉండకూడదు. ప్రలోభాలు, అధికార ప్రదర్శనలూ ఉండకూడదు. అధికార పార్టీకి బాండ్ల రూపంలో విరాళం ఇవ్వడానికి ముందుకు రాని కంపెనీల మీద ఆదాయపు పన్ను సంస్థలనో, ఈడీ సీబీఐ వంటి వ్యవస్థలనో ఉసిగొల్పడం ఎటువంటి ధోరణి? కొన్ని కంపెనీల మీద ఐటీదాడులు, ఆ వెనువెంటనే ఆ కంపెనీల ద్వారా బాండ్ల కొనుగోలు జరిగిన ఉదాహరణలను స్వతంత్ర పరిశోధక సంస్థలు చెబుతున్నాయి. అట్లాగే, ఎన్నికల బాండ్లు పెద్దమొత్తంలో కొనుగోలు చేసిన సంస్థలకు ఆ తరువాత కొద్దిరోజులకే లాభదాయకమైన విధాన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకున్న ఉదంతాలు కూడా వారు పేర్కొంటున్నారు. బెదిరింపు, లాలింపు ఈ రెండు పద్ధతుల ద్వారా ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేసి రాజకీయ ధనాన్ని పొందడం ఏమి నైతికత? అధికారంలో ఉన్న పార్టీలు తప్ప ఇటువంటి అవినీతికి ఎవరు పాల్పడగలరు? కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు, ఆ అధికార పార్టీ ఎంత బాధ్యతగా ఉండాలి? ధర్మం పేరుతో రాజకీయాలు చేసేవారు, రాజకీయాలలో ధర్మంగా ఉండాలి కదా?

భారత రాజకీయ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి అవమానకరమైన ఈ బాండ్ల వ్యవహారం లోగుట్టు అంతా ప్రజలకు తెలిసిపోవాలి. తెలిసిన తరువాత కూడా ఇది పెద్ద విషయం కాదని భారత సమాజం భావిస్తే, అది సామాజిక విలువల పతనంగా నిర్ధారించుకోవాలి. ఎంత కడిగినా తొలగని మురికిలో కూరుకుపోయామని గ్రహించాలి.

మరోసారి మోదీ ఎందుకో తెలుసా?

లోక్‌సభ ఎన్నికల సమరం వేగం పుంజుకుంటున్న వేళ కేంద్రంలో రెండు దఫాలుగా అధికారాన్ని చలాయిస్తూ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ 'ఔర్ ఏక్ బార్ మోదీ సర్కార్' నినాదంతో ముందుకు వెళ్తోంది. దేశ విదేశ సర్వే సంస్థలెన్నో కూడా కేంద్రంలో మోదీ సర్కారే తిరిగి అధికారంలోకి వస్తుందని ఘంటాపథంగా చెబుతున్నాయి. అయినా సరే మళ్ళీ బీజేపీ సర్కారే ఎందుకు రావాలి అని ప్రశ్నించుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిలో ఉంది. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ పాలనతో– బీజేపీ ఏలుబడిలో వాజపేయి ప్రభుత్వ పాలనను, 2014 నుంచి పాలిస్తున్న మోదీ ప్రభుత్వ పాలనను పోల్చుకొని తగిన నిర్ణయం తీసుకోవాలి.

కాంగ్రెస్ పాలనలో మన దేశం ఏ విషయంలోనూ స్వయం సమృద్ధి సాధించలేక పోయింది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్'ల పేరుతో చేపట్టిన ఉద్యమం సత్ఫలితాలు ఇస్తోందని చెప్పవచ్చు. ఇటీవల ప్రపంచాన్నే కుదుపేసిన కరోనా వైరస్ వ్యాప్తి సందర్భంగా దశాబ్దాల స్వాతంత్ర్య భారతంలో కనీసం పీపీఈ కిట్ కూడా సొంతంగా తయారు చేసుకోలేకపోయిన దుస్థితి. రాబోయే విపత్తును సరిగ్గా అంచనా వేసిన మోదీ ప్రభుత్వం వెంటనే దేశ వైద్య రంగాన్ని ముఖ్యంగా శాస్త్రవేత్తలను అప్రమత్తం చేసి సొంతంగా కరోనా నివారణ వ్యాక్సిన్‌ల తయారీకి చర్యలు చేపట్టింది. వైరస్ వ్యాప్తి చెందకుండా మోదీ స్వయంగా ప్రజలను జాగరూకులను చేసి, స్వల్పకాలంలో 140 కోట్ల మంది దేశ ప్రజలకి ఉచితంగా వ్యాక్సిన్ అందించి ప్రజల ప్రాణాలు కాపాడగలిగారు. ఈ కష్ట కాలంలో కూడా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదేశాలకు చెందిన ఫైజర్ లేదా చైనా వాక్సిన్లు వాడాలని ఒత్తిడి చేసి రాజకీయం చేసే ప్రయత్నం చేయడం శోచనీయం.



స్వాతంత్ర్య అనంతరం దేశాన్ని ఇంత ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రధానిని, ఇంత పారదర్శక పాలనను అందిస్తున్న ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడూ చూసిన దాఖలాలు లేవు. ఈ పరిస్థితుల్లో గతంలో దేశాన్ని భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా అలయన్స్ కావాలో, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి రావాలో తేల్చుకోవలసిన అవసరం మాత్రం ప్రతి ఒక్క ఓటరుపై ఉంది.

ప్రజల వైద్య అవసరాలు తీర్చేందుకు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని మోదీ ప్రభుత్వం అమలు చేస్తోంది. దీంతో వైద్య ఖర్చుల కోసం రూ.5లక్షల దాకా ఆర్థిక సాయం అందిస్తోంది. కానీ దురదృష్టవశాత్తు దీనిని రాజకీయ స్వార్థంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేయకపోవడంతో నిరుపేదలు ఎందరో తీవ్రంగా నష్టపోయారు.

రైతుల విషయాన్నే తీసుకుంటే ఒక బస్తా యూరియా తదితర ఎరువుల కోసం రోజుల తరబడి లైన్లో ఎదురు చూస్తూ రైతులు అక్కడే చనిపోయిన సందర్భాలు కాంగ్రెస్ హయాంలో కోకొల్లలు. సమయానికి రుణాలు అందక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కి బయట పడలేక; పండిన పంటకు గిట్టుబాటు ధరలేక; అతివృష్టి, అనావృష్టిలతో నష్టపోయిన పంటకు పరిహారం అందక ఏటా వేలాదిమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడేవారు. మోదీ ప్రభుత్వం సబ్సిడీ ఎరువులను బ్లాక్ మార్కెట్లోకి పోనీయకుండా నీమ్ కోటెడ్ యూరియా తోపాటు ఇతర ఎరువుల ఉత్పత్తి కూడా పెంచి రైతుల కష్టాలు తీర్చింది. బ్యాంకుల ద్వారా సులభంగా రుణాలు అందుతున్నాయి. ఫసల్ బీమా యోజన ద్వారా నష్టపోయిన పంటకు పరిహారం కూడా అందుతుంది. అంతేకాకుండా పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పేరుతో ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ.2 వేల చొప్పున ఏడాదికి రూ.6వేలు రైతులకు పంట సాయం కూడా అందిస్తోంది. దీని ద్వారా 2023–24లో ఏప్రిల్ – జూలై నెలలకుగాను 9,60,05,019 మందికి, ఆగస్ట్–నవంబర్ నెలలకు గాను 9,07,50,086 మంది రైతులకు నగదు రూపంలో పంట సాయం అందింది.

దేశానికి ప్రధానమైన రక్షణ రంగాన్ని తీసుకుంటే గతంలోని కాంగ్రెస్ హయాంలో అప్పటి రక్షణ మంత్రి పార్లమెంట్ సాక్షిగా ఆయుధాల కొనుగోలుకు నిధులులేవని దేశ భద్రతను గాలికొదిలేశారు. దీంతో పాకిస్థాన్ చైనా అండ చూసుకొని భారత్‌లో తీవ్రవాదాన్ని పెంచిపోషించేది. ఇందిరాగాంధీ హయాంలో జరిగిన యుద్ధంలో భారత్‌కు పట్టుబడిన వేలాది మంది పాకిస్థాన్ సైనికులను ప్రాణాలతో విడిచిపెట్టినా ఆ దేశానికి యుద్ధ ఖైదీలుగా పట్టుబడిన కొద్దిపాటి భారతీయ సైనికుల్లో కనీసం ఒక్కరిని కూడా భారత ప్రభుత్వం కాపాడలేకపోవడంతో వారంతా పాకిస్థాన్ జైళ్ళలో చిత్రవధలకు గురై ప్రాణాలు కోల్పోయారు. అదే మోదీ హయాంలో పొరపాటున పాకిస్థాన్‌కు చిక్కిన అభినందన్‌ను గంటల వ్యవధిలో పాకిస్థాన్ బేషరతుగా భారత్‌కు అప్పజెప్పడం మోదీ ప్రభుత్వ ఘనత కాక మరేమిటి? యెమెన్, సౌదీ అరేబియా మధ్య, రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాల్ని సైతం ఆపించి ఆ దేశాల్లోని భారతీయులను సురక్షితంగా తీసుకురాగలిగిన సత్తా నేటి భారత ప్రభుత్వానిది. ఆయుధాలపరంగా చూసినా ఇప్పుడు అత్యాధునిక ఆయుధ సంపత్తితో తులతూగుతుంది.

గతంలో భారత్‌ను లెక్క చేయని, మోదీకి వీసా ఇవ్వబోమని ప్రకటించిన అమెరికా సైతం అదే మోదీని ఘనంగా ఆహ్వానిస్తోంది. ఆ దేశ అధ్యక్షుడు సైతం మోదీ కోసం అప్పటికప్పుడు తన షెడ్యూల్ మార్చుకుంటున్నారంటే అది భారత్ సాధించిన ఘనత కాక మరేమిటి? మోదీ లాంటి నాయకుడు తమ దేశాలకు కూడా కావాలని పాకిస్థాన్ ప్రజలతోపాటు అమెరికన్లు సైతం కోరుకోవడం, ఆస్ట్రేలియా అధ్యక్షుడు బహిరంగ సభలో 'మోదీ ఈజ్ ఎ బాస్' అని ప్రశంసించడం భారతీయులందరికీ గర్వకారణమే.

స్వాతంత్ర్య అనంతరం దేశాన్ని ఇంత ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రధానిని, ఇంత పారదర్శక పాలనను అందిస్తున్న ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడూ చూసిన దాఖలాలు లేవు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రాజీ పడకుండా చెప్పింది చేసి చూపిస్తుందని అయోధ్యలో రామాలయ నిర్మాణం, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ముస్లిం మహిళల క్షేమం కోసం ట్రిపుల్ తలాక్ రద్దు, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేయడం వంటి నిర్ణయాలు నిరూపించాయి. ఈ పరిస్థితుల్లో గతంలో దేశాన్ని భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా అలయన్స్ కావాలో, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి రావాలో తేల్చుకోవలసిన అవసరం మాత్రం ప్రతి ఒక్క ఓటరుపై ఉంది.

■ శ్యామ్‌సుందర్ వరయోగి
సీనియర్ జర్నలిస్ట్

లోకమంతా గమనిస్తున్న ఎన్నికలు!

ఒక జాతీయ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి జరిగే ఎన్నికలు ఆదర్శప్రాయంగా ఉండాలి. ఒక ఉమ్మడి జాతీయ లక్ష్యం వెనుక దేశ ప్రజలు అందరినీ సంఘటిత పరిచేలా ఆ ఎన్నికలు ఉండాలి. ప్రజలు తమ ఓట్లను పార్టీ 'ఏ' లేదా పార్టీ 'బి' కి (కొన్నిసార్లు రెండు లేదా అంతకంటే ఎక్కువ పార్టీలకు) వేయవచ్చుగానీ ఆ ప్రజాస్వామిక పోరులో పాల్గొనడంలో వారందరి లక్ష్యం ఒకటే అయివుండాలి. ఓటింగ్ విషయంలో ప్రజల మధ్య అటువంటి విభజన స్వతస్సిద్ధమైనదీ, ఆరోగ్యకరమైనది అనడంలో సందేహం లేదు. ఆ విభజన, దాని పర్యవసానాలు కలిగించే మనస్తాపాలు శాశ్వతంగా ఉండవు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం (రిపబ్లిక్ ఆఫ్ ఇండియా) తొలి దశకాలలో కొన్ని ఎన్నికల పోటీల్లో సమతూకం స్పష్టంగా లోపించింది. ప్రజాభిప్రాయం పూర్తిగా ఒకే పక్షం వైపు మొగ్గిన ఎన్నికలవి. కోటానుకోట్ల ఓటర్ల మద్దతును అలా కూడట్టుకున్న పార్టీ భారత జాతీయ కాంగ్రెస్. అవును, కాంగ్రెస్ పార్టీ ఒక మహా సంస్థ. అదొక సుసంఘటిత రాజకీయ పక్షం. ఆ పార్టీకి నేతృత్వం వహించిన జవహర్‌లాల్ నెహ్రూ (1889–1964) మహా నాయకుడు మాత్రమే కాదు, మహా మనీషి కూడ. మహోన్నత జాతి నిర్మాత. తిరుగులేని ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ ఒక తిరుగులేని మహాశక్తిగా వెలుగొందింది. దానిని ప్రతిఘటించగల రాజకీయ దీక్షాదక్షతలు ఆనాడు మరే పార్టీకి లేవు. కనుకనే నెహ్రూ సారథ్యంలో మొదటి మూడు సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ జైత్రయాత్ర అప్రతిహతంగా సాగింది.

రెండు సమస్థాయి ప్రత్యర్థి పక్షాల మధ్య మొట్టమొదటి నిజమైన ఎన్నికలు 1977లో జరిగాయి. నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితి దురాగతాలను యావత్ ప్రజలు ముక్తకంఠంతో నిరసిస్తున్న తరుణంలో జరిగిన ఎన్నికలవి. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా భావజాలాలకు అతీతంగా ప్రతిపక్షాలు అన్నిటినీ జనతా పార్టీగా సమైక్య పరిచారు. జనతా పార్టీ ఘన విజయం సాధించింది. అది నిర్ణయాత్మక విజయం. అయితే అది భారతీయులను విడదీసింది. ఉత్తరాది రాష్ట్రాల ఓటర్లు జనతా పార్టీకి ఓటు వేయగా దక్షిణాది రాష్ట్రాల ఓటర్లు అందుకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీకి బాసటగా నిలబడ్డారు. ఉత్తర భారతావని, దక్షిణ భారతం మధ్య ఈ రాజకీయ విభజన 1977 సార్వత్రిక ఎన్నికలకే పరిమితం కాలేదు. అది ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నది. దరిమిలా అన్ని సార్వత్రిక ఎన్నికలలోను (కొన్ని మినహాయింపులతో) ఉత్తరాది రాష్ట్రాల వారు ఓటు వేస్తున్న తీరుకు విరుద్ధంగా దక్షిణాది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం పరిపాటిగా వస్తోంది. హిందీ భాష మాట్లాడే, హిందీ భాష బాగా తెలిసిన ఉత్తరాది రాష్ట్రాలలో ఈ స్పర్థ చాలావరకు కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉండేది. బీజేపీ నిదానంగా ఆధిక్యత సాధించింది.

భారతదేశ ఎన్నికలకు సంబంధించిన మరో విశేషాన్ని కూడా ప్రస్తావించి తీరాలి. 1977 అనంతరం జరిగిన ఎన్నికలలో ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌ను సవాల్ చేశాయి. తమిళనాడులో డిఎంకె, అన్నా డిఎంకె, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, వైసీపీ, తెలంగాణలో తెలంగాణ రాష్ట్ర సమితి, కర్ణాటకలో జనతాదళ్ (సెక్యులర్), కేరళలో మార్క్సిస్టుల నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ కాంగ్రెస్‌ను సవాల్ చేసి విజయం సాధించాయి. ప్రాంతీయ పార్టీలతో నిండిన ఈ సమరరంగంలోకి బీజేపీ ప్రవేశించలేక పోయింది. కర్ణాటకలో ప్రాంతీయ పార్టీలతో తలపడినప్పటికీ మిశ్రమ ఫలితాలను మాత్రమే సాధించగలిగింది.

ప్రాంతీయ పార్టీల జైత్రయాత్రలు ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ దూరాన్ని మరింతగా పెంచాయి. దక్షిణాది రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలు బీజేపీ పట్ల పలు అంశాలలో తీవ్ర అపనమ్మకంతో ఉండేవి. ఈ కారణంగానే అవి, బీజేపీపై హిందీ, హిందూ, హిందుత్వ పార్టీ అనే ముద్రను కాంగ్రెస్ కంటే ఎక్కువగా వేశాయి. దక్షిణాది భాషల సాంస్కృతిక విలక్షణత, అన్ని మతాల వారిపట్ల సమభావం, సంఘ సంస్కర్తల ప్రభావం దక్షిణాది ప్రజలకు తమదైన ప్రత్యేక రాజకీయ పథాన్ని నిర్దేశించాయి. ఆర్థిక వనరుల పంపకంలో వివక్ష, ప్రాంతీయ భాషలపై హిందీ ఆధిపత్యం ఆహార అలవాట్లు, వస్త్రధారణ, సాంస్కృతిక విషయాలలో ఏకపక్ష నిర్ణయాలను రుద్దడం, మైనారిటీ మత వర్గాల వారి మనోభావాలను ఉపేక్షించడం మొదలైన కారణాలు బీజేపీ పట్ల ప్రాంతీయ పార్టీల అనుమానాలను మరింతగా బలపరిచాయి. అంతేకాకుండా కేంద్ర–రాష్ట్ర సంబంధాలలో అధికార కేంద్రీకరణకు ప్రాధాన్యమివ్వడం, వివిధ కొత్త చట్టాలను తీసుకురావడం ద్వారా రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తిని హరించివేయడానికి చేస్తున్న ప్రయత్నాలు కూడా బీజేపీ పట్ల దక్షిణాది రాష్ట్రాల ప్రజలలోను, ప్రాంతీయ పార్టీలలోను వ్యతిరేకతకు ఎంతైనా దోహదం చేశాయి. ప్రాంతీయ పార్టీలను లొంగదీసుకోవడానికి, అంతేకాకుండా వాటిని పూర్తిగా రూపుమాపేందుకు కూడా వివిధ చట్టాలను కేంద్రంలోని బీజేపీ పాలకులు ఉపయోగించుకోవడం జరుగుతోంది. తత్ఫలితంగా ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ దూరం మరింతగా పెరిగింది. ఈ పరిణామం చాలా శోచనీయమని మరి చెప్పనవసరం లేదు.

కాంగ్రెస్ పట్ల బీజేపీ దృక్పథమేమిటో అందరికీ తెలుసు: కాంగ్రెస్–ముక్త్ భారత్‌ను బీజేపీ కోరుకొంటోంది. ఒక రాజకీయ పార్టీగా కాంగ్రెస్‌కు మనుగడ ఉండని భారత దేశాన్ని నిర్మించాలని బీజేపీ ప్రగాఢంగా ఆకాంక్షిస్తోంది. సరే, కాంగ్రెసేతర రాజకీయ పక్షాల పట్ల కూడా బీజేపీ వైఖరి అందుకు భిన్నమైనది కాదు సుమా! ఏదైనా ఒక ప్రాంతీయ పార్టీ కొంతకాలం బీజేపీకి మిత్రపక్షంగా ఉంటుంది. అయితే అంతిమంగా ఆ ప్రాంతీయ పార్టీని పూర్తిగా రూపుమాపడమే బీజేపీ అసలు లక్ష్యం. జనతా పార్టీ, అకాలీళ్, ఐఎన్‌ఎల్‌డి, జనతాదళ్(ఎస్) మొదలైన పార్టీలకు పట్టిన గతే అందుకు నిదర్శనం. ఈశాన్య భారత రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీల ప్రత్యేక అస్తిత్వాలను పూర్తిగా తుడిచిపెట్టిన చరిత్ర బీజేపీకే సొంతం. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, వైసీపీ, టీఆర్‌ఎస్‌లతో బీజేపీ ఒక దశలో చెట్టపట్టాల్ వేసుకుంది. అయితే పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి వరుసగా ఆ పార్టీలను నిర్మూలించడమే బీజేపీ అసలు లక్ష్యం. మహారాష్ట్ర, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, హర్యానాలలో కూడా బీజేపీకి అటువంటి లక్ష్యమే ఉన్నది. కాగా తమిళనాడులో డిఎంకె, అన్నా డిఎంకెలు సకాలంలో మేల్కొన్నాయి. శివసేన, ఎన్‌సిపి, జేజేపీలు మేల్కోవడంలో జాప్యం జరిగింది. కేంద్ర ప్రభుత్వంలో బీజేపీ పాదుకుపోతే తమకు ఎటువంటి గతి పడుతుందో రాష్ట్రీయ లోక్‌దళ్, బిజూ జనతాదళ్, తెలుగుదేశం పార్టీలు కూడా త్వరలోనే తప్పక గ్రహిస్తాయనడంలో సందేహం లేదు.



వ్యక్తులకు స్వాతంత్ర్యాన్ని, సమాజాలకు అభివృద్ధిని తప్పక ఖాయం చేసేది సందర్భానుసారంగా ప్రభుత్వాలను మార్చి వేయడమేనని చరిత్ర ఘంటాపథంగా బోధించింది. ఈ చారిత్రక పాఠాన్ని యూరోపియన్ దేశాలు బాగా అర్థం చేసుకున్నాయి. కనుకనే ఆ దేశాల ప్రజలు తరచు తమ ప్రభుత్వాలను ఓటు హక్కు ద్వారా మార్చివేస్తుంటారు. భారత్‌లో మనం ఆ పాఠాన్ని నేర్చుకున్నాం కానీ దానిని మరచిపోయినట్టుగా కనిపిస్తోంది.

త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలలో తమకు 370 సీట్లు ఇవ్వాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోంది. తన ప్రధాన ఎజెండా లక్ష్యాలను మరింత త్వరితంగా సాధించుకునేందుకే లోక్‌సభలో ఆ సంఖ్యా బలానికి బీజేపీ ఆరాటపడుతోంది. అయోధ్య, కాశీలతో దాని వివాదగ్రస్త హిందూత్వ ఉద్యమం నిలిచిపోదు. హిందూ ఆలయాలకు సమీపంలో ఉన్న మరిన్ని మసీదుల విషయంలో కూడా వివాదాలను సృష్టించడం ఖాయం. మరిన్ని నగరాలకు, రోడ్లకు పునః నామకరణం తప్పక జరుగుతుంది. పౌరసత్వ సవరణ చట్టం–2019ని అమలు పరచడానికి మోదీ సర్కార్ ఇప్పటికే పూనుకున్నది. ఇటీవల ఆ చట్ట నిబంధనలను నోటిఫై చేయడంతో పాటు వివిధ చర్యలను చురుగ్గా చేపడుతోంది. ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతిని ప్రయోగాత్మకంగా అమలుపరుస్తున్నారు. పార్లమెంటు ఆమోదించిన ఆ చట్టాన్ని ఇతర రాష్ట్రాలలో కూడ ఆ అమలు పరచడానికి మోదీ ప్రభుత్వం వెనుకాడదు. రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' భావనను రాజ్యాంగంలో పొందుపరుస్తారు సమాఖ్య పాలనా విధానం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మరింతగా హరించుకుపోనున్నాయి. అధికారాలు అన్నీ ఒక వ్యక్తి వద్ద కేంద్రీకృతమయ్యే అధ్యక్ష తరహా ప్రభుత్వ వ్యవస్థగా భారత ప్రభుత్వం పరిణమించే అవకాశమున్నది.

దురదృష్టవశాత్తు చాలా మంది ప్రజలు మనఃస్ఫూర్తిగా అధికార కేంద్రీకరణను స్వాగతిస్తున్నారు. ఇదొక కఠోర వాస్తవం. కారణమేమిటి? మన కుటుంబ వ్యవహారాలలోను, సామాజిక వ్యవస్థల్లోను, రాజకీయ కార్యకలాపాలలోను నిజమైన ప్రజాస్వామిక విలువలు అంతర్భాగం కాకపోవడమేనని చెప్పి తీరాలి. అభివృద్ధి పేరుతో సంపన్నులు అపరిమితంగా సంపద్వంతులు కావడాన్ని అంగీకరిస్తాము; అయితే ఆర్థిక అంతస్తులో కింది భాగంలో ఉన్న 50 శాతం మంది జాతి మొత్తం సంపదలో కేవలం 3 శాతం వాటాతో, జాతీయ ఆదాయంలో 13 శాతం వాటాతో సంతృప్తి చెందాలని చెప్పుతున్నాము. సామాజిక, సాంస్కృతిక అధీనత, అణచివేత కొనసాగుతున్నాయి. ఆర్థిక అసమానతలు మరింతగా పెచ్చరిల్లనున్నాయి.

పైన ప్రస్తావితమైన అంశాలు భీతి గొలుపుతున్నాయి కదూ. అయితే వ్యక్తులకు, సమాజాలకు స్వాతంత్ర్యం (పేదరికం నిర్మూలనకు, సంఘ నిర్మాణంతో పాటు చర్చించే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ, ఇంకా మత, వాక్, పత్రికా స్వాతంత్ర్యాలు), అభివృద్ధిని తప్పక ఖాయం చేసేది సందర్భానుసారంగా ప్రభుత్వాలను మార్చివేయడమే. అదే జాతి వికాసానికి ఏకైక మార్గమని చరిత్ర మనకు ఘంటాపథంగా బోధించింది. ఈ చరిత్ర పాఠాన్ని యూరోపియన్ దేశాలు బాగా గ్రహించాయి. కనుకనే ఆ దేశాల ప్రజలు తరచు తమ ప్రభుత్వాలను ఓటు హక్కు ద్వారా మార్చి వేస్తుంటారు. అమెరికా తన అత్యున్నత కార్యనిర్వాహక అధినేత పదవీ కాలానికి పరిమితులు (టెర్మ్ లిమిట్స్) విధించింది, దక్షిణ అమెరికా ఖండ దేశాలు, ఆఫ్రికా దేశాలు ఆ విలువైన చరిత్ర పాఠాన్ని అర్థం చేసుకోలేదు, నేర్చుకోలేదు. కనుకనే అవి నిరంకుశ ప్రభుత్వాల పాలనలో కునారిల్లుతూ అనేకానేక కష్టాలు, యాతనలు పడుతున్నాయి.. భారత్‌లో మనం చరిత్ర చెప్పిన పాఠాలను నేర్చుకున్నాం కానీ వాటిని మరచిపోయినట్టుగా కనిపిస్తోంది. ఈ చరిత్ర విస్మరణ పర్యవసానాలు ఎలా ఉంటాయి? చైనా, రష్యా, తుర్కియె, ఇరాన్ ఉదాహరణలు మన ముందున్నాయి. చెప్పవచ్చిన దేమిటంటే భారతదేశ 18వ లోక్‌సభ ఎన్నికల కోసం సమస్త ప్రపంచమూ ఎదురు చూస్తోంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ప్రజాభిప్రాయం ప్రతిబింబించాలి

'ఒకే' దేశం ఒకే ఎన్నికల విధానంపై మాజీ రాష్ట్రపతి కోవింద్ కమిటీ తన నివేదికను సమర్పించి, స్థూలంగా ఈ విధానాన్ని సమర్థించింది. దీంతో జరిగే మేళ్లేమిటన్నవి కేంద్రంలోని అధికార పార్టీ చెప్తూ వస్తున్నవే. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. దేశమంతా ఎన్నికలు జరపడం పెద్ద క్రతువు. అదే అన్ని అంచెల ఎన్నికలు ఒకేసారి జరపడం మరీ కష్టం. ముఖ్యంగా శాసనసభలకు, స్థానిక సంస్థలకు కూడా ఏక కాలంలో జరపడం వల్ల రాష్ట్ర, స్థానిక అంశాలు... జాతీయ అంశాల ముందు ప్రాముఖ్యం కోల్పోతాయి. జాతీయ అంశాలే కీలకమై, ప్రాంతీయ పార్టీలు నష్టపోతాయి. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. ఏక కాలంలో ఎన్నికల వల్ల ప్రభుత్వానికి ఖర్చు తగ్గుతుందని, పాలనలో అవాంతరాలు తగ్గుతాయంటున్నారు. ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యమైనప్పుడు, అది నాణ్యంగా ఎలా ప్రతిబింబిస్తుందో చూడాలి గానీ ఏది సౌలభ్యమో, ఏది ఖర్చు తక్కువో చూడకూడదు. ఒకే దేశం, ఒకే ఎన్నికలు విధానం తీసుకురావడానికి 15 రాజ్యాంగ సవరణలు అవసరం అని తేల్చారు. ఆ విధానం ద్వారా ఎన్నికైన ప్రభుత్వానికి ఎలాంటి స్థితిలోనైనా ఐదేళ్ల వారంటీ చేకూరడం మంచిది కాదు. అలా అయితే అవిశ్వాస తీర్మానానికి విలువ పోతుంది. ఈ విషయాలపై లోతైన చర్చ జరగాలి. డబ్బు లేని పార్టీలు కూడా ఎన్నికల రంగంలో నిలవలేక పోతున్నాయి. అధికారంలోకి రాగల పార్టీలకే ఫండ్స్ దండిగా అందుతున్నాయి. వీటన్నింటికీ విరుగుడు చూస్తేనే ప్రజాస్వామ్యానికి పట్టం గట్టగలం. ఆ దిశగా సంస్కరణలు రావాలి.

– డి.వి.జి. శంకరరావు

సీమ ప్రాజెక్టులపై మేనిఫెస్టో ప్రకటించాలి!

కరువు కారణంగా రాయలసీమలో రైతులు, కూలీల వలసలు పెరుగుతున్నాయి. ఆత్మహత్యలతో బతుకులు ఛిన్నాభిన్నమవుతున్నాయి. ఈ కరువుల నుండి రాయలసీమ బయటపడాలంటే, సాగునీటి సౌకర్యం కల్పించి మూలపడిన వ్యవసాయాన్ని బతికించాలి. అందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి. కాని వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులను మూలపడేశారు.


తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత, రాయలసీమ కరువు పరిస్థితులను చూసి, రాయలసీమకు కృష్ణా జలాలను తరలించి సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సస్యశ్యామలం చేయటానికి పూనుకున్నారు. 1983 తెలుగుగంగ, 1988 హంద్రీనీవా, గాలేరు–నగరి ప్రాజెక్టుల ద్వారా రాయలసీమలో 12 లక్షల ఎకరాలకు సాగునీరందించడానికి ఎన్టీఆర్ శ్రీకారంచుట్టారు. 2004లో అధికారంలోకి వచ్చిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులతో పాటు రాయలసీమలో జలయజ్ఞంలో 11 ప్రాజెక్టులతో 17,60,500 ఎకరాలకు సాగునీరు అందించడానికి పథకాలు రూపొందించి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయటానికి పూనుకున్నారు. విభజనానంతరం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఐదేళ్ల కాలంలో సాగునీటి రంగానికి రూ.68వేల కోట్లు ఖర్చు చేశారు. 'తెలుగుదేశం ప్రభుత్వం రాయలసీమ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తున్నది, తాను అధికారంలోకి వస్తే రెండేళ్లలో రాయలసీమ ప్రాజెక్టులు పూర్తి చేస్తా' అని మాట్లాడిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో 365 జీఓ ద్వారా రాయలసీమ హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగుగంగ, తదితర ప్రాజెక్టు పనులు, కాలువలు ప్యాకేజీలు వందకు పైగా పనులు రద్దు చేశారు. ఒక్క అనంతపురం జిల్లాలోనే హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి 31 హెచ్‌ఎల్‌సికి చెందిన 7 పనులు రద్దు చేశారు. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులను రద్దు చేసి సీమకు తీరని అన్యాయం చేశారు. రాయలసీమ అభివృద్ధిని పదేళ్ళు వెనక్కి నెట్టివేశారు.

వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2019లో అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు హంద్రీనీవా కాలువ వెడల్పు చేస్తానని, హంద్రీనీవాకు సమాంతర కాలువ నిర్మిస్తామని ప్రకటించారు. హంద్రీనీవా కాలువ 6300 క్యూసెక్కులకు అభివృద్ధి చేసే పనులకు రూ.6182కోట్లతో 2021లో పరిపాలనా అనుమతులు ఇచ్చారు. ఇదికాక ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా కాలువపై తోపుదుర్తి ముట్టాల, దేవరకొండ ప్రాంతాలలో రిజర్వాయర్లు నిర్మాణానికి రూ.803 కోట్లతో పరిపాలనా అనుమతులు ఇస్తూ 2020 డిసెంబర్‌లో వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులకు హంద్రీనీవా ప్రాజెక్టుకు అనుసంధానం చేయటానికి రూ.737కోట్లు, జీడిపల్లె బండ ప్రాజెక్టుకు రూ.680కోట్లు, మడకశిర బైపాస్ కెనాల్‌కు రూ.214 కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చారు. ఇందులో ఒక్క ప్రాజెక్టు పనులు కూడా ప్రారంభం కాలేదు. తెలుగుదేశం పార్టీ హయాంలో చంద్రబాబునాయుడు ప్రారంభించిన రూ.968కోట్ల ప్రాజెక్టు బైరవాని తిప్ప, రూ.850కోట్ల పేరూరు ప్రాజెక్టు, రూ.590కోట్లతో నిర్మించతలపెట్టిన సోమరవాండ్లపల్లి ప్రాజెక్టులను రద్దు చేశారు. తెలుగుదేశం హయాంలో హెచ్.యల్.సి కాలువకు

నవ్యాంధ్ర ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు సాగునీటి రంగానికి ఐదేళ్ళల్లో రూ.68,293 కోట్లు ఖర్చు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి బడ్జెట్‌లో సాగునీటి రంగానికి రూ.61,573.15కోట్లు కేటాయింపులు జరిపి అందులో కేవలం రూ.37,228 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. నిర్దేశించిన ప్రణాళికలో కేటాయించిన బడ్జెట్‌లో రూ.24,345 కోట్ల కోత విధించారు.

ఉంతకల్లు వద్ద 10 టిఎంసీలతో రూపొందించిన ప్రాజెక్టు ఊసేలేదు. హెచ్.యల్.సి ఆధునికీకరణ ఆగిపోయింది. ఇంకా ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనేక రిజర్వాయర్లు నిర్మించాల్సిన అవసరం వున్నది. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా కేవలం 200 చెరువులకు మాత్రమే నీటిని నింపుతున్నారు. ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సిన పిల్ల కాలువ పనులు ఇంకా ప్రారంభమే కాలేదు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా ప్రాజెక్టు పనులకు దాదాపు రూ.11వేల కోట్లు అవసరముండగా 2023–24 బడ్జెట్‌లో జగన్ ప్రభుత్వం కేవలం రూ.122.69కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారు. కడప జిల్లాలో గాలేరు నగరి ప్రాజెక్టుల పనులన్నింటికి రూ. 15,147 కోట్లు అవసరం వుండగా, ఐదేళ్ళల్లో వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.500కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి, పోతిరెడ్డిపాడు కాలువ సామర్థ్యాన్ని 44వేల క్యూసెక్కుల నుండి 80వేల క్యూసెక్కుల పెంచటానికి, మరికొన్ని పథకాలకు కలిపి రూ.6,829.15 కోట్లకు 2020 మే 5న పరిపాలన అనుమతులు ఇచ్చారు. కర్నూలు జిల్లాలో 20 టిఎంసీల సామర్థ్యంతో రూ.4,330 కోట్ల అంచనా వ్యయంతో పాలనామోదం పొందిన గుండ్రేవుల ప్రాజెక్టు, 8 టిఎంసీల సామర్థ్యంతో రూ.1,990 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన వేదవతి ప్రాజెక్టు, కుందూనదిపై రాజోలు వద్ద 2.95 టిఎంసీల సామర్థ్యంతో రూ.1,357 కోట్ల అంచనాతో నిర్మించతలపెట్టిన ప్రాజెక్టు, కుందూనదిపై 264 కోట్ల రూపాయలతో నిర్మించవలసిన జోలదరాశి ప్రాజెక్టు, కుందూనది ఎత్తిపోతల పథకానికి రూ.564కోట్లు, ఆర్‌డీయస్ ప్రాజెక్టుకు రూ.1,986 కోట్లు... ఈ ప్రాజెక్టు పనులన్నీ ఆగిపోయాయి. ఇక చిత్తూరు జిల్లాలో హంద్రీనీవా, గాలేరునగరి, ప్రాజెక్టులకు సంబంధించి అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయటానికి రూ.50వేల కోట్లు అవసరం ఉండగా




జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్ళల్లో రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులకు కేవలం రూ.2,637కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే రాయలసీమ ప్రాజెక్టులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సగటున సంవత్సరానికి పెట్టిన ఖర్చు రూ.528కోట్లు మాత్రమే.

నవ్యాంధ్ర ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు సాగునీటి రంగానికి ఐదేళ్ళల్లో రూ.68,293 కోట్లు ఖర్చు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి బడ్జెట్‌లో సాగునీటి రంగానికి రూ.61,573.15కోట్లు కేటాయింపులు జరిపి అందులో కేవలం రూ.37,228 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. నిర్దేశించిన ప్రణాళికలో కేటాయించిన బడ్జెట్‌లో రూ.24,345కోట్ల కోత విధించారు. తన తండ్రి వై.యస్.రాజశేఖరరెడ్డి బడ్జెట్‌లో సాగునీటి రంగానికి కేటాయించిన నిధులకు అదనంగా 50 శాతం ఖర్చుపెడితే జగన్మోహన్‌రెడ్డి బడ్జెట్ నిధుల్లో సగభాగం కోత విధించారు. వై.యస్.రాజశేఖరరెడ్డి బడ్జెట్‌లో సాగునీటి రంగానికి 15 నుండి 21 శాతం వరకు ఖర్చు పెడితే, జగన్‌రెడ్డి కేవలం 3 శాతం మాత్రమే ఖర్చు చేశారు. అందులో రాయలసీమ ప్రాజెక్టులకు పెట్టిన ఖర్చు 0.20 శాతం మాత్రమే. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 35 మార్లు, నీటి పారుదల శాఖమంత్రిగా ఉన్న ఉమామహేశ్వరరావు 40 సార్లు అనంతపురం జిల్లాలో పర్యటించారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడా రిజర్వాయర్లు, కాలువలను పరిశీలించిన దాఖలాలు లేవు.

రాష్ట్ర విభజనానంతరం బడ్జెట్‌లో సాగునీటిరంగానికి చంద్రబాబు పాలనలో రూ.68,293 కోట్లు, జగన్మోహన్‌రెడ్డి పాలనలో రూ.37,228 కోట్లు... ఇలా మొత్తం పదేళ్ళల్లో సాగునీటి రంగానికి పెట్టిన ఖర్చు రూ.1,05,521కోట్లు. ఇందులో రాయలసీమ ప్రాజెక్టులకు పెట్టిన ఖర్చు రూ.15,078 కోట్లు. ఇక మిగిలిన రూ.90,443 కోట్లు కోస్తాంధ్రా ప్రాంతానికి ఖర్చు పెట్టారు. ఆంధ్రప్రదేశ్ మొత్తం సాగు భూమి 2,14,69,117 ఎకరాలు. ఇందులో 1,15,73,891 ఎకరాలు (54 శాతం) ఉన్న కోస్తాంధ్ర ప్రాంతానికి 70,24,587 ఎకరాలకు సాగునీరు అందుతున్నది (60.7 శాతానికి). రాయలసీమలో 98,95,226 ఎకరాలు (46శాతం) సాగుభూమికి గాను 16,96,404 ఎకరాలకు అంటే 17.1 శాతం భూమికి మాత్రమే సాగునీరు అందుతున్నది. అత్యధికంగా 60శాతం భూమికి సాగునీరు అందుతున్న కోస్తాంధ్రా ప్రాంతానికి సాగునీటి బడ్జెట్‌లో 85 శాతం నిధులు, 17 శాతానికి మాత్రమే సాగునీరు అందుతున్న, అతితక్కువ వర్షపాతం కలిగి వున్న రాయలసీమకి 15శాతం నిధులు కేటాయించటంలో న్యాయం ఎక్కడున్నది? 'వ్యవసాయకంగా, ఆర్థికంగా కోస్తా జిల్లాల స్థాయికి రాయలసీమ ఎదిగే విధంగా, నీటి పారుదల పథకాలు ప్రాధాన్యత ఇచ్చి అమలు జరపాలని' 1937 'శ్రీబాగ్' ఒప్పందంలో పేర్కొన్నారు. ఒప్పందం జరిగి 87 ఏళ్ళు గడిచినా నేటికి అమలుకు నోచుకోలేదు.

పైన పేర్కొన్న ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేయటానికి అవసరమైన రూ.50వేల కోట్లను వచ్చే ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి రెండేళ్ళ లోపల పూర్తి చేయాలి. దుమ్మెగూడెం–సాగర్ టేల్‌పాండ్ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలి. గోదావరి జలాలను కోస్తా ప్రాంతానికి తరలించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాటాగా వచ్చే కృష్ణానదీ జలాలను రాష్ట్ర ప్రభుత్వం పునః పంపిణీ చేసి రాయలసీమ ప్రాజెక్టులకు నికర జలాలుగా కేటాయించాలి. రాయలసీమ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో సగభాగం కేటాయించాలి. ఈ విషయాలన్నిటిపై అన్ని రాజకీయ పార్టీలూ వచ్చే ఎన్నికల సందర్భంలో తమ విధి విధానాలు తెలియజేస్తూ 'సీమ'పై ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేయాలి.

• మాయకుంట్ల శ్రీనివాసులు
జలసాధన సమితి



నేడే నగారా



వచ్చే సార్వత్రిక ఎన్నికలకు మొదటి అడుగు పడనుంది. కీలక ఘట్టమైన ఎలక్షన్ షెడ్యూల్ శనివారం విడుదలకానుంది. దీంతో రెండు జిల్లాల్లో రాజకీయ వేడి రాజుకుంది. ఓవైపు మొత్తం 14 అసెంబ్లీ స్థానాల్లో పదింటికి టీడీపీ అభ్యర్థులు ఖరారు కాగా, వైసీపీ 8 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇక రెండు పార్లమెంట్ స్థానాలకూ అభ్యర్థులు దాదాపు ఖరారైనట్టే. ఎన్నికల సంఘం శనివారం షెడ్యూల్ విడుదల చేయడం మొదలు ఎవరి ప్రయత్నాలు వారు చేయడానికి రాజకీయ నాయకులు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు.

రెండు జిల్లాల్లో రాజుకున్న ఎన్నికల వేడి

- నేటి షెడ్యూల్ కోసం ఎదురుచూపులు
- ఇప్పటికే 10 స్థానాలకు టీడీపీ అభ్యర్థుల ఖరారు
- పెండింగ్‌లో 2 స్థానాలు.. మిత్రపక్షాలకు మరో 2
- విజయవాడ పశ్చిమ బీజేపీకే.. అవనిగడ్డ జనసేనకు..
- మైలవరం, పెనమలూరులో ఇంకా వీడని సస్పెన్స్
- నేడు వైసీపీ అభ్యర్థుల ప్రకటన
- రెండు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులు దాదాపు ఖరారు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. టీడీపీ-జనసేన-బీజేపీ కలిసి అభ్యర్థులను బరిలో దింపుతుండగా, వైసీపీ ఒంటరిగా పోటీ చేస్తోంది. అభ్యర్థులను ఖరారు చేసే విషయంలో టీడీపీ ముందంజలో ఉంది. రెండు జిల్లాల్లో 12 స్థానాల నుంచి టీడీపీ పోటీ చేస్తుండగా, రెండు స్థానాలను మిత్రపక్షాలకు కేటాయించింది. విజయవాడ పశ్చిమలో బీజేపీ, అవనిగడ్డలో జనసేన పోటీ చేయనున్నాయి. టీడీపీ పోటీ చేయనున్న పెనమలూరు, మైలవరం స్థానాలు మినహా మిగిలిన అన్ని స్థానాలకు అభ్యర్థులు ఖరారయ్యారు. బీజేపీ, జనసేన అభ్యర్థులను ఇంకా ఖరారు చేయాల్సి ఉంది. మచిలీపట్నం పార్లమెంట్ స్థానం నుంచి జనసేన, విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ బరిలో నిలవనున్నాయి. మచిలీపట్నం ఎంపీగా వల్లభనేని బాలశౌరి, విజయవాడ ఎంపీగా కేశినేని చిన్ని దాదాపు ఖరారైనట్టే. ఇక వైసీపీ విషయానికొస్తే.. మచిలీపట్నం ఎంపీగా సింహాద్రి చంద్రశేఖర్, విజయవాడ ఎంపీగా కేశినేని నాని పేర్లు ఖరారయ్యాయి. అసెంబ్లీ స్థానాలకు వస్తే.. మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పెనమలూరు, మైలవరం, విజయవాడ సెంట్రల్, పశ్చిమ, తిరువూరు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయగా, గుడివాడ, గన్నవరం, పామర్రు, విజయవాడ తూర్పు, జగ్గయ్యపేట, నందిగామ స్థానాలకు ఖరారు చేయాల్సి ఉంది.

అన్నదమ్ముల సవాల్

విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా కేశినాని నాని వరుసగా మూడోసారి బరిలోకి దిగుతున్నారు. గత రెండు సార్లు టీడీపీ టికెట్‌పై పోటీ చేసిన నాని ఈసారి వైసీపీ తరఫున బరిలో దిగుతున్నారు. నానికి ప్రత్యర్థిగా ఆయన సొంత సోదరుడు కేశినేని చిన్ని బరిలో నిలవడంతో విజయవాడ స్థానం రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఏడాదిగా సేవా కార్యక్రమాలతో విజయవాడ పార్లమెంట్ ప్రజలకు చేరువైన చిన్ని నెల రోజులుగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి రెండోసారి బరిలో నిలుస్తున్నారు. ఈయన కూడా గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచి గెలుపు సాధించగా, ఈసారి జనసేన తరఫున పోటీ చేస్తున్నారు. ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ పోటీలో ఉన్నారు.

ఊపిరి పోసుకుంటున్న కాంగ్రెస్

ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి, వైసీపీకి నడుమ ఉండనుంది. గత రెండు ఎన్నికల్లో కోలుకోలేని విధంగా దెబ్బతిన్న కాంగ్రెస్ ఈసారి కాస్త ఊపిరిపోసుకుంటోంది. వైసీపీ అధినేత జగన్ సోదరి వైఎస్ షర్మిల ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించడంతో ఆ పార్టీ కాస్త కోలుకుంది. విజయవాడ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు వల్లూరు అశోక్, సుంకర పద్మశ్రీ, నరహరిశెట్టి నరసింహారావు, బొర్రా కిరణ్ దరఖాస్తు చేసుకున్నారు. మచిలీపట్నం పార్లమెంట్ నుంచి పోటీ చేసేందుకు చలమలశెట్టి ఆదికిరణ్, బొల్లి కృష్ణ దరఖాస్తు చేసుకున్నారు.

పశ్చిమలో కమలమే..!

విజయవాడ పశ్చిమ సీటుపై దాదాపు సస్పెన్స్ వీడింది. పొత్తులో భాగంగా ఈ సీటును జనసేన వదులుకుని బీజేపీకి ఇచ్చింది. కాగా, కమలం పార్టీ తరఫున బరిలోకి దిగడానికి ముగ్గురు ప్రముఖుల పేర్లు వినిపిస్తున్నాయి.

పొత్తులో భాగంగా పశ్చిమను వదులుకున్న జనసేన

- బీజేపీ అభ్యర్థి కోసం మొదలైన వెతుకులాట
- ప్రముఖంగా వినిపిస్తున్న ముగ్గురి పేర్లు
- జాతీయ కమిటీకి చేరనున్న ఇద్దరి పేర్లు


అడ్డూరి శ్రీరామ్


బబ్బూరి శ్రీరామ్


గొలగాని రవికృష్ణ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో రెండు స్థానాల్లో పోటీ చేయాలని భావించిన జనసేన ఒక స్థానాన్ని వదులుకుంది. పోటీ చేయాలనుకున్న స్థానాన్ని బీజేపీకి ఇచ్చింది. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో జనసేన పోటీ చేయడం ఖాయమని కొద్దిరోజుల క్రితం వరకు భావించారు. జనసేన, టీడీపీ పొత్తు కుదుర్చుకున్నాక కేటాయించిన సీట్లలో 24 చోట్ల జనసేన పోటీ చేస్తుందని ప్రకటించారు. ఇందులో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం జనసేన ఖాతాలోకి వెళ్లింది. పార్టీ ఆవిర్భావం నుంచి పోతిన మహేశ్ పశ్చిమ నియోజకవర్గంలో పనిచేస్తున్నారు. ఇక్కడి నుంచి ఈయనే పోటీ చేస్తారని సంకేతాలు వచ్చాయి. జనసేన, టీడీపీ పొత్తులోకి బీజేపీ రావడంతో కొన్ని సీట్లను జనసేన వదులుకోవాల్సి వచ్చింది. ఇందులో భాగంగా పశ్చిమ నియోజకవర్గం బీజేపీకి వెళ్లింది. ఏయే నియోజకవర్గాల్లో పోటీ చేయాలన్న దానిపై జనసేన, బీజేపీ నేతల మధ్య విజయవాడ కేంద్రంగా పలు దఫాలుగా చర్చలు జరిగాయి. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం కావాలని బీజేపీ అడిగినప్పటికీ అప్పటికే టీడీపీ అభ్యర్థిగా బొండా ఉమామహేశ్వరరావును ప్రకటించింది. దీంతో బీజేపీ నేతలు పశ్చిమ నియోజకవర్గం కావాలని పట్టుబట్టారు. ఇక్కడ పోతిన మహేశ్ మొదటి నుంచి పని చేస్తున్నారని, కాబట్టి తమ అభ్యర్థి పోటీ చేస్తారని జనసేన నేతలు బీజేపీకి స్పష్టం చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో రెండు సీట్లలో జనసేన పోటీచేసే అవకాశాలు ఉన్నందున అందులో పశ్చిమ సీటును తమకే ఇవ్వాలని బీజేపీ నేతలు పట్టుబట్టారు. ఎవరో ఒకరు తగ్గాలన్న సూత్రంతో పశ్చిమ సీటును జనసేన... బీజేపీకి వదిలేసింది.

అభ్యర్థి ఎవరు?

పశ్చిమ నియోజకవర్గం నుంచి బీజేపీ పోటీ చేయడం ఖాయమైన నేపథ్యంలో రాష్ట్ర కమిటీ నేతలు అభ్యర్థి ఎంపికలో నిమగ్నమయ్యారు. బీజేపీ పోటీచేసే స్థానాల్లో ఒక్కో దాని నుంచి ఇద్దరేసి పేర్లను జాతీయ కమిటీకి రాష్ట్ర కమిటీ పంపుతుంది. వాటిలో ఒక పేరును జాతీయ కమిటీ ఖరారు చేస్తుంది. పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి ముగ్గురు నేతలు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ముగ్గురు కొద్దిరోజుల క్రితమే అధిష్ఠానానికి దరఖాస్తు చేసుకున్నారు. బీజేపీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ మాజీ అధ్యక్షుడు బబ్బూరి శ్రీరామ్, ప్రస్తుత అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న అడ్డూరి శ్రీరామ్, ఇటీవలే పార్టీలో చేరిన ఎన్ఆర్ఐ గొలగాని రవికృష్ణ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. బబ్బూరి శ్రీరామ్ ప్రస్తుతం రాష్ట్ర కమిటీలో ఉన్నారు. రవికృష్ణ పశ్చిమ నియోజకవర్గంలో గొలగాని ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొన్నాళ్లపాటు అమెరికాలో ఉన్న ఆయన కొద్దిరోజుల క్రితమే పార్టీలో చేరారు. అడ్డూరి శ్రీరామ్ ఇంతకుముందు నగర కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. కొన్నాళ్లపాటు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఈ ముగ్గురు పశ్చిమ సీటును ఆశిస్తున్నారు. వారిలో అడ్డూరి శ్రీరామ్, గొలగాని రవికృష్ణ బీసీ సామాజిక వర్గానికి చెందినవారు. బబ్బూరి శ్రీరామ్ కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేత. అధిష్ఠానం ఈ ముగ్గురిలో ఒకరికి అవకాశం ఇస్తుందా, కొత్త అభ్యర్థిని రంగంలోకి దింపుతుందా వేచి చూడాలి.

ఈసారికి సీటు లేనట్టే..!

బోడె ప్రసాద్‌కు చంద్రబాబు స్పష్టీకరణ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఈసారి పెనమలూరు సీటు ఇచ్చేది లేదని టీడీపీ అధినేత చంద్రబాబు మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు స్పష్టం చేశారు. ఉండవల్లిలోని నివాసంలో శుక్రవారం బోడె ప్రసాద్.. చంద్రబాబును కలిశారు. ఈ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడిన బోడె.. తనకు టికెట్ ఇవ్వాలని చంద్రబాబును ఒప్పించేందుకు చాలా ప్రయత్నం చేశానన్నారు. చివరి క్షణంలోనైనా తనకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నానన్నారు. తనకు న్యాయం జరగకపోతే ఏం చేయాలనేది కార్యకర్తలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానన్నారు. బీఫాం ఇస్తే పార్టీ జెండా పట్టుకుని ముందుకు వెళ్తానని, ఇవ్వకపోతే చంద్రబాబు ఫొటో పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేస్తానన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తే తనకు సహకరించాలని నియోజకవర్గ ప్రజలకు బోడె విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలకు సంసిద్ధం

స్ట్రాంగ్‌రూమ్‌గా నోవా కాలేజీ ఎంపిక

కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్లు

ఎన్నికల అధికారి దిల్లీరావు వెల్లడి

- 6లో..

పశ్చిమలో జనసేన బలంగా ఉంది

నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోతిన మహేశ్

అధికార పార్టీకి అధికారి..!



విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఆయన ఓ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ). అయితేనేం.. సిటీప్లానర్ (సీపీ)ని మించిన అధికారాలు ఆయన చేతిలో ఉంటాయి. సదరు ఏసీపీ ఏదైనా ఫైలు ఓకే చేస్తే.. అందులో ఇంకెవరూ జోక్యం చేసుకోరు. అధికార పార్టీ నాయకులకు ఇష్టుడిగా, ఉన్నతాధికారులకు ప్రియ శిష్యుడిగా చక్రం తిప్పుతున్న సదరు ఏసీపీ సార్.. మా సర్కిల్‌కు కావాలంటే మా సర్కిల్‌కు కావాలంటూ ప్రజాప్రతినిధులే పోటీ పడుతున్నారంటే తెరవెనుక ఎంత తతంగం నడుస్తుందో అర్థమవుతుంది.

విజయవాడ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్‌లో అన్నీ ఆయనే..

- ఇటీవల బదిలీపై సీఆర్డీయేకు.. పది రోజుల్లోనే వీఎంసీకి..
- మాకు కావాలంటే మాకు కావాలంటూ వైసీపీ నేతల పోటీ
- సర్కిల్-1కు రావాలంటున్న మేయర్ భాగ్యలక్ష్మి
- కాదు.. సర్కిల్-3కు రావాలంటున్న తూర్పు నేతలు

పేరుకే అసిస్టెంట్ సిటీ ప్లానర్.. సిటీ ప్లానర్ కంటే మిన్న

అవినీతిలో అందలమెక్కుతున్న అధికారి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి అభివృద్ధి కోసం గత టీడీపీ ప్రభుత్వం సీఆర్డీయేని ఏర్పాటు చేసింది. ఆ సమయంలో ఉన్న అవసరాలను బట్టి పలువురు సివిల్ ఇంజనీర్లను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసింది. 2019లో వైసీపీ సర్కార్ అధికారంలోకి రావడంతో అమరావతి అటకెక్కడం, సీఆర్డీయే నిర్వీర్యం కావడం జరిగింది. దీంతో అక్కడ ఉన్న ఇంజనీర్లను వేర్వేరు మున్సిపల్ కార్పొరేషన్లకు బదిలీ చేశారు. అలా బదిలీపై వీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఏసీపీగా వచ్చిన వ్యక్తి అక్కడే పాతుకుపోయి ఏకంగా టౌన్‌ప్లానింగ్ విభాగాన్నే శాసించే స్థాయికి చేరుకున్నారు. 2022లో వీఎంసీకి వచ్చిన ఆయన ఇటీవల జాయింట్ డైరెక్టర్ పదోన్నతిపై సీఆర్డీయేకు వెళ్లారు. కానీ, పట్టుమని పది రోజుల్లో మళ్లీ వీఎంసీకి వచ్చేశారు.

'తూర్పు'పైనే మక్కువ

గతంలో వీఎంసీలో పనిచేసిన సమయంలో కీలకమైన సర్కిల్-3 ఏసీపీగా విధులు నిర్వహించారు. ఈ సర్కిల్ పరిధిలోకి తూర్పు నియోజకవర్గంలోని అధికభాగం వస్తుంది. ఇదంతా విలువైన ప్రాంతం కావడంతో కాసులు కూడా పెద్ద ఎత్తునే ముట్టేవి. దీంతో ఇక్కడ విధులు నిర్వహించిన సదరు ఏసీపీ అధికార పార్టీ నేతలకు ఇష్టుడిగా మారిపోయాడు. వారితో కలిసి వసూళ్ల దందా నడిపించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే ఇటీవల ఆయన పదోన్నతి బదిలీపై సీఆర్డీఏకు వెళ్లినా పట్టుబట్టి పది రోజుల్లోనే డిప్యుటేషన్‌పై వీఎంసీకి తీసుకొచ్చారని సమాచారం. ఆయన తిరిగి వచ్చే సమయానికి గతంలో విధులు నిర్వహించిన సర్కిల్-3కి ఏసీపీగా జగదీశ్‌ను నియమించారు. దీంతో సదరు ఏసీపీకి పోస్టింగ్ ఎక్కడ ఇవ్వాలన్న దానిపై వీఎంసీ పెద్దలు తర్జనభర్జన పడుతున్నారు. వసూళ్ల విషయంలో ఆరితేరిన సదరు ఏసీపీని తన పరిధిలోని సర్కిల్-1కు తీసుకురావాలని మేయర్ ప్రయత్నాలు చేస్తుంటే, తిరిగి సర్కిల్-3కే తీసుకురావాలని తూర్పు వైసీపీ నేతలు పట్టుబడుతున్నారు. దీంతో ఆయనకు ఎక్కడ పోస్టింగ్ అనే అంశం ప్రస్తుతానికి సందిగ్ధంలో పడింది.

అధికార పార్టీ నేతలు ఎంత చెప్తే అంతే..

సదరు ఏసీపీ సర్కిల్-3లో విధులు నిర్వహించే సమయంలో అధికార పార్టీ నేతలు ఎంత చెబితే అంత అనే చందంగా ఉండేవారు. అనధికార ఫ్లోర్లు, అక్రమ కట్టడాలు ఏవైనా సరే.. అధికార పార్టీ నేతలకు మామూళ్లు ముట్టజెప్పిన వారి జోలికి వెళ్లకుండా టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని కట్టడి చేయడంలో ఈయన చురుగ్గా పనిచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు వీఎంసీ బాస్‌ను సైతం ఈ ఏసీపీ తన బుట్టలో వేసుకున్నారన్న ప్రచారం ఉంది. అటు అధికార పార్టీ నేతలు, ఇటు వీఎంసీ బాస్ ఆశీసులు ఉండటంతో ఈయన టౌన్‌ప్లానింగ్ విభాగానికి అధిపతి అయిన సిటీప్లానర్‌ను డమ్మీ చేసి అంతా తానై నడిపిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. సిటీప్లానర్ పరిశీలించాల్సిన ఫైళ్లు, సీపీ ఇవ్వాల్సిన నోటీసులు సైతం ఈ ఏసీపీ ద్వారానే వెళ్తాయంటే ఆయన పలుకుబడి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.



పరీక్షలకు బాయ్‌బాయ్.. ఇక ఎంజాయ్

ఇంటర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులు శుక్రవారం సందడిగా గడిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు గురువారం ముగియగా, రెండో సంవత్సరం పరీక్షలు శుక్రవారం ముగిశాయి. పేపర్లు చింపుతూ విద్యార్థులు ఇళ్లకు సాగారు. పరీక్షలు పూర్తవడంతో సొంతూర్లకు పయనమైన వారితో పండిట్ నెహ్రూ బస్టాండ్ కిటకిటలాడింది.

ప్రశ్నిస్తే కేసులా..?

గంపలగూడెం మండలంలో రెవెన్యూ అధికారుల స్వామిభక్తి

- ప్రశ్నించిన వైసీపీ నాయకుడిపై కేసు పెట్టే కుట్ర

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గంపలగూడెం మండలంలో రెవెన్యూ యంత్రాంగం అధికార పార్టీకి ఊడిగం చేస్తోంది. వైసీపీ నేతలు సాగిస్తున్న అక్రమాలను ప్రశ్నించిన వారిపై అధికారులే కేసులు పెడుతున్నారు. ప్రశ్నిస్తున్నది వైసీపీ నాయకులే అయినా కూడా వదలట్లేదు. వైసీపీ గంపలగూడెం నాయకుల అక్రమాలపై అదే పార్టీకి చెందిన మండలస్థాయి నాయకుడు నాగరాజు కొంతకాలంగా పోరాడుతున్నారు. ఎమ్మెల్యే రక్షణనిధి అనుచరులు సాగిస్తున్న అక్రమాలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకొస్తున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలోని స్పందనలో కూడా ఫిర్యాదు చేశారు. పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పెదకొమెరలో వైసీపీ ఎమ్మెల్యే అనుచరులు సాగించిన నకిలీ పట్టాల ఉదంతంపై కూడా పోరాడారు. అనర్హులకు ఇళ్ల పట్టాల అంశంపైనా, స్థానికంగా మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలపైనా తరచూ అధికారులను అప్రమత్తం చేయటంతో పాటు వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోమని కోరారు. ఇటీవల కాలంలో కట్టలేరులో అక్రమంగా ఇసుకను తవ్వేస్తున్నారు. ఇందుకు రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు అనుమతులు ఇచ్చేస్తున్నారు. వీటిపై నాగరాజు ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో గంపలగూడెం రెవెన్యూ అధికారులు శుక్రవారం స్థానిక పోలీసులను కార్యాలయానికి పిలిచి నాగరాజుపై కేసు నమోదు చేయాల్సిందిగా కోరినట్టుగా తెలిసింది. అక్రమాలను ప్రశ్నిస్తున్న వైసీపీ నాయకుడిపై కేసు ఎలా పెట్టాలో తెలియక.. తన విధులకు ఆటంకం కలిగిస్తున్నాడన్న నెపంతో కేసు నమోదు చేయాల్సిందిగా ఎస్ఐ దగ్గర తహసీల్దార్ కోరినట్టు సమాచారం. అయితే, ఇదంతా నాగరాజును బెదిరించడానికేనని, లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదని తెలిసింది.

కోర్టు ఆవరణలో వృద్ధ రైతు ఆత్మహత్య

- స్థలం కబ్జా చేసి వేధిస్తున్నారని లేఖ

- 6లో..

ములకలమ్మను విఎంగేస్తున్నారు..!


ములకలమ్మ చెరువులో రాత్రివేళ జరుగుతున్న అక్రమ తవ్వకాలు

- ములకలమ్మ చెరువులో రాత్రిపూట అక్రమ తవ్వకాలు
- అధికార పార్టీ అండతో చెరువు గర్భంలో దోపిడీ
- ఇటుక బట్టీలకు మట్టి భారీగా తరలింపు
- చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు

గన్నవరం, మార్చి 15 : మండలంలోని వీరపనేని గూడెం ములకలమ్మ చెరువు అక్రమ తవ్వకాలకు అడ్డాగా మారింది. గ్రామంలోని ఇటుక బట్టీల నిర్వాహకులు ఈ తవ్వకాలకు తెరలేపారు. వీరికి అధికార ప్రజాప్రతినిధుల అండదండలు మెండుగా ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. అంతా ఒక్కటై ములకలమ్మ చెరువు మట్టిని మింగేస్తున్నారు. రాత్రయితే చాలు మూడు ఎక్స్‌కవేటర్లతో వందలాది ట్రాక్టర్లు లోడ్ చేస్తున్నారు. తమ పొలాలు మెరక చేసుకుంటున్నామని చెబుతూ మట్టి తవ్వి, ఆ తరువాత ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. గత ఏడాది ఇరిగేషన్ అధికారులను తప్పుదారి పట్టించి పొలాల మెరక పేరుతో అనుమతులు తెచ్చి, అక్రమ మట్టి తవ్వకాలు చేసి సొమ్ము చేసుకున్నారు. ఈసారి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రివేళ అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. అధికార వైసీపీలో డబ్బు రుచి మరిగిన నాయకులు మేమున్నామంటూ వీరికి అండగా నిలుస్తున్నారు. అధికారులు దాడులకు వెళ్తే.. వైసీపీ ఎక్స్‌కవేటర్లయితే వదిలేయటం, వేరే వారివైతే కేసులు పెట్టించటం చేస్తున్నారు. సర్పంచ్ భర్త వెంకటేశ్వరరావు, వార్డు సభ్యురాలి భర్త కృష్ణారెడ్డి, వెంకటరెడ్డికి చెందిన మూడు జేసీబీలు చెరువులో మట్టిని యథేచ్ఛగా తవ్వేస్తున్నాయి. ఈ తవ్వకాలపై ఇప్పటికే పలుమార్లు గ్రామంలో బహిరంగంగానే వైసీపీ నాయకులు, తవ్వకందారుల మధ్య పంచాయితీలు జరిగాయి. ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుని అప్పట్లో మట్టిని ఇటుక బట్టీలకు తరలించకుండా ఆపారు. తిరిగి ఒప్పందాలు కుదరడంతో చెరువు గర్భాన్ని కొల్లగొట్టి జేబులు నింపుకొంటున్నారు. అక్రమ తవ్వకందారులకు కొందరు అధికారులు కొమ్ముకాస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అక్రమ తవ్వకాలు ఆపాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు. అధికారులు కళ్లు తెరిచి ములకలమ్మ చెరువు గర్భాన్ని కొల్లగొడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవటంతో పాటు అక్రమ మట్టి తరలింపును నిలుపుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇటుక బట్టీల కోసమే..

ఇటుక బట్టీల కోసమే ములకలమ్మ చెరువులో తవ్వకాలు చేస్తున్నారు. రాత్రివేళ యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారులకు సమాచారం ఇచ్చినా కన్నెత్తి చూడట్లేదు. అధికారం ముసుగులో చెరువును ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. వైసీపీకి చెందిన తాడేపల్లి వెంకటేశ్వరరావు, గుడిసె కృష్ణారెడ్డి, తియ్యగూర వెంకటరెడ్డికి చెందిన ఎక్స్‌కవేటర్లు గురువారం రాత్రి ములకలమ్మ చెరువులో తవ్వకాలు జరిపాయి.

- కొండేటి వెంకటేశ్వరరావు, గ్రామస్తుడు



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-19 (శని)

సహర్ (ఉదయం) : 5-02 (ఆది)



కల్యాణం జరిపిస్తున్న పండితులు

కల్యాణం..కమనీయం

వైభవంగా వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

వన్‌టౌన్, మార్చి 15: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం షష్ఠి సందర్భంగా(ప్రతినెలా షష్ఠి రోజున జరుపు) వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని మహామండపం ఏడో అంతస్థులో అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో కేఎస్ రామారావు, పాలకమండలి సభ్యులు, అర్చక సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి కల్యాణోత్సవాలను తిలకించారు. కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి శుక్రవారం విశేషంగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అన్ని క్యూలలో భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థాన ఈవో కేఎస్ రామారావు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసి అమ్మవారి దర్శనం కల్పించారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. దేవస్థానంలో నిర్వహించిన నిత్యార్జిత సేవలైన స్వామికి అభిషేకం, అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవవారణార్చన, చండీహోమం, శాంతి కల్యాణం, ఇతర సేవల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దేవస్థాన ఈవో కేఎస్ రామారావు, ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు, అర్చకులు మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఈవో, ఛైర్మన్ మంత్రికి అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



కాసులపేరును అందజేస్తున్న దాత కుటుంబసభ్యులు



దుర్గమ్మకు బంగారు కాసులపేరు విరాళం

విజయవాడకు చెందిన గంధం రాజేష్, అతని కుటుంబ సభ్యులు కనకదుర్గమ్మ అలంకార నిమిత్తం 43 గ్రాముల బంగారు కాసుల పేరును ఆలయ ఈవో కేఎస్ రామారావు, ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు ద్వారా ఆలయానికి విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాత కుటుంబసభ్యులను అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



చిట్టినగర్ వద్ద ధర్నా చేస్తున్న నగరాల ఐక్యవేదిక నాయకులు

విజయవాడ పశ్చిమలో జనసేన బలంగా ఉంది

నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోతిన మహేశ్



వన్‌టౌన్, మార్చి 15 : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో జనసేన పార్టీ బలంగా ఉండబట్టే వైసీపీ నాయకులు అభ్యర్థిని మార్చారని జనసేన అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోతిన మహేశ్ అన్నారు. శుక్రవారం వన్‌టౌన్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశ్చిమ నియోజకవర్గంలో జనసేన క్యాడర్ బలంగా ఉందని, ప్రతి పోరాటం విజయవాడ వేదికగా జరిగిందని తెలిపారు. అందుకే వైసీపీ అభ్యర్థిని మరోచోటికి మార్చడం జరిగిందన్నారు. పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌ను గెలిపించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి తీరుతామన్నారు.

పశ్చిమ సీటు మహేశ్‌కు ఇవ్వాలి : నగరాల ఐక్యవేదిక నేతలు

విజయవాడ పశ్చిమ సీటు పోతిన మహేశ్‌కు ఇవ్వాలని నగరాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చిట్టినగర్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. కొత్తపేట పార్టీ కార్యాలయం నుంచి చిట్టినగర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సర్దార్ మరుపిళ్ల చిట్టి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు రాంపిళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజాసమస్యల పరిష్కారానికి అహర్నిశలు పోరాడిన పోతిన మహేశ్‌కు పశ్చిమ సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, రాష్ట్ర ఐక్యవేదిక నాయకులు రాయన ఆదిబాబు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గ సీటు పొత్తుల్లో భాగంగా బీజేపీకి కేటాయిస్తున్నారని విస్తృత ప్రచారంతో జనసేన సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందారు. ఈ క్రమంలో శుక్రవారం మహిళా నేతలు పెద్ద ఎత్తున పార్టీ కార్యాలయానికి చేరుకుని కంటతడి పెట్టారు. పోతిన మహేశ్‌కు పశ్చిమ సీటు ఇవ్వకపోవడం బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పునరాలోచన చేయాలని కోరారు.



బ్రోచర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు

20, 21 తేదీల్లో పీబీ సిద్ధార్థలో వర్క్‌షాప్

మొగల్రాజపురం : ఈ నెల 20, 21 తేదీలలో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సహకారంతో పీబీ సిద్ధార్థ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్సెలలో రాష్ట్రస్థాయి వర్కుషాపు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మేకా రమేష్ చెప్పారు. కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ వేమూరి బాబూరావు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాస కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయండి : కొల్లి

ధర్నాచౌక్, మార్చి 15 : దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరిగిన నిత్యావసరాల ధరలు, నిరుద్యోగంతో దివ్యాంగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో దివ్యాంగుల సమస్యలను అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలన్నారు. తమకు గుర్తింపునివ్వని పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

హాజరుకానున్న 33007 మంది

178 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



పదో తరగతి పరీక్షల ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

విజయవాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్టు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. మాల్ ప్రాక్టీసింగ్, మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీకి ఆస్కారం లేకుండా సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఢిల్లీరావు మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా బాలురు (17414), బాలికలు (15593) మొత్తం 33007మంది పరీక్షలు రాయనున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా 178 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, ఉదయం 9.30 నుంచి 12.45 వరకు పరీక్ష సమయం ఉంటుందన్నారు. ఫిజికల్ సైన్స్, బయాలజీ సైన్స్ పరీక్షలకు సమయాలు మారతాయని చెప్పారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఉదయం 9 గంటలకు విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. 9.15 గంటలకు మెయిన్ గేట్ మూసేస్తారని తెలిపారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లను వెంట తీసుకుని రావాల్సి ఉంటుందని, ఎస్ఎస్‌సీ బోర్డు వెబ్‌సైట్‌లో విద్యార్థి పుట్టిన తేదీ ఎంటర్ చేసి హాల్ టిక్కెట్‌ను తిరిగి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్స్‌కు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ ఆధారంగా పనిచేసే ఎలాంటి డివైజెస్‌ను అనుమతించటం జరగదన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. మాల్ ప్రాక్టీసింగ్, మాస్ కాపీయింగ్ పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రశ్నాపత్రంపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, లీకైతే సెంటర్‌లో లీకైందో కూడా తెలిసిపోతుందని, వెంటనే బాధ్యులైన వారిని అరెస్టు చేయటం జరుగుతుందన్నారు. ఇన్విజిలేటర్లకు ఫోన్లను అనుమతించటం లేదని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 12 మంది రూట్ ఆఫీసర్లు పర్యవేక్షణ జరుపుతారని చెప్పారు. జిల్లావ్యాప్తంగా మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఎస్ఎస్‌సీ ఓపెన్ విద్యార్థుల కోసం 10 పరీక్షా కేంద్రాలు, ఇంటర్మీడియట్ ఓపెన్ రాసేవారికి 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎస్ఎస్‌సీ ఓపెన్ పరీక్షలకు 1785మంది, ఇంటర్ ఓపెన్ పరీక్షలకు 3710 మంది మొత్తంగా 5495 మంది పరీక్షలు రాస్తారని చెప్పారు. పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రులు కంట్రోల్ రూమ్ నెంబర్ 9154473676కు ఫోన్‌చేసి సహాయాన్ని పొందవచ్చునని చెప్పారు. సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు, ఏడీ కేఎస్‌వీ కుమార్‌లు పాల్గొన్నారు.

రాజధానిని విచ్ఛిన్నం చేసే చర్యలు మానుకోవాలి



కౌలు జమచేయాలని నిరసన తెలుపుతున్న రాజధాని మహిళలు, రైతులు

తుళ్ళూరు, మార్చి 15: రాజధాని అమరావతిని విచ్ఛిన్నం చేసే చర్యలను వైసీపీ ప్రభుత్వం, సీఆర్‌డీఏ అధికారులు మానుకోవాలని రాజధాని రైతులు కోరారు. మార్చి నెలలో చెల్లించాల్సిన వార్షిక కౌలు మళ్లీ మార్చి వచ్చినా చెల్లించడం లేదని, వెంటనే చెల్లించాలంటూ శుక్రవారం నిరసన చేపట్టారు. "అమరావతి అందరికీ అందుబాటులో ఉన్న నిధి.. అన్నదాత కౌలు చెల్లించాలి.. అమరావతిని కాపాడండి అది రాష్ట్రాన్ని కాపాడుతుంది.. అన్నదాతల ఆకలి కేకలు జగన్‌రెడ్డికి వినపడవా.. గెలిచేవరకు పోరాటం చేయటమే మన లక్ష్యం సేవ్ ఆంధ్రప్రదేశ్".. అనే ప్లకార్డులు చేతపట్టుకొని తుళ్లూరు రైతు ధర్నా శిబిరం నుంచి సీఆర్‌డీఏ కార్యాలయం వరకు రైతులు, రైతు కూలీలు, మహిళలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడికి వినతిపత్రం ఇచ్చారు. ఆర్-5 జోన్ ఏర్పాటుచేసి మాస్టర్ ప్లాన్‌ను నాశనం చేయాలని గతేడాది ప్రభుత్వం ప్రయత్నించిందని, న్యాయపోరాటం చేసి దానిని అడ్డుకున్నామని తెలిపారు. ఇప్పుడు 625 ఎకరాలను ల్యాండు ఎక్విజేషన్ నుంచి తప్పించి అమరావతిని విచ్ఛినం చేసేందుకు సీఆర్‌డీఏ అధికారులు, ప్రభుత్వం కుట్ర పన్నిందని డిప్యూటీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రాజధానిని విచ్ఛినం చేసే జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉన్నత న్యాయస్థానం పరిధిలో ఉన్న రాజధాని అంశం జోలికి వెళ్లినందుకు అధికారులు కోర్టు ధిక్కారం కింద కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టంచేశారు.

ఎన్నికలకు సంసిద్ధం

ప్రశాంతంగా, పారదర్శకంగా, నిస్పక్షపాతంగా నిర్వహిస్తాం

స్ట్రాంగ్ రూమ్‌గా నోవా కాలేజీ ఎంపిక

కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్లు

ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు

విజయవాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నోటిఫికేషన్ ఎప్పుడు విడుదలైనా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సర్వసన్నద్ధంగా ఉన్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా, నిస్పక్షపాతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై విలేకరుల సమావేశంలో కలెక్టర్ ఢిల్లీరావు తమ సన్నద్ధతను వివరించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పకడ్బందీగా నిర్వహించటానికి తాము సర్వసన్నద్ధంగా ఉన్నామన్నారు. జనవరి 22వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రకటించిన తర్వాత ఫామ్-6లకు సంబంధించి 22 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఫామ్-7లకు సంబంధించి 20 వేలు, ఫామ్-8లకు సంబంధించి 29వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంకా 6వేల దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నోటిఫికేషన్ వచ్చినా ఓటర్ల జాబితాలలో మార్పులు, తొలగింపులను కొనసాగిస్తామన్నారు. తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన సందర్భంలో రోజుకు 600-1000 వరకు ఫామ్‌లు వచ్చేవని, ప్రస్తుతం వందలోపే వస్తున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లను దాదాపుగా పూర్తిచేసినట్టు చెప్పారు. జిల్లాలో స్ట్రాంగ్ రూమ్‌గా జూపూడిలోని నోవా ఇంజనీరింగ్ కాలేజీని ఎంపిక చేసినట్టు చెప్పారు. రాజకీయ పార్టీలన్నింటితో చర్చించిన మీదట అందరి అంగీకారంతోనే ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం ఏడు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని ఇక్కడి నుంచి ఈవీఎంలు, పోలింగ్ సిబ్బందిని ఎన్నికల విధులకు పంపించటం జరుగుతుందన్నారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించటం జరుగుతుందన్నారు. ఇంబ్రహీపట్నంలోని నిమ్రా ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలతో పాటు, జూపూడిలోని నోవా ఇంజనీరింగ్ కాలేజీలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

రాష్ట్ర పురావస్తు శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్



విజేతలను అభినందిస్తున్న వాణీమోహన్

కృష్ణలంక, మార్చి 15 : వివిధ రంగాల్లో సమాజంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు ఆత్మస్థైర్యంతో జీవించడం శుభపరిణామమని రాష్ట్ర పురావస్తు, మ్యూజియం శాఖ ముఖ్యకార్యదర్శి జి.వాణీమోహన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మహిళా విభాగం రాష్ట్రశాఖ, ఎన్టీఆర్ జిల్లా మహిళా విభాగం సంయుక్తంగా నిర్వహించిన సాంస్కృతిక, క్రీడాంశాలలో 13, 14 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు శుక్రవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేడు పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో సమవుజ్జీలుగా నిలుస్తున్నారన్నారు. ఈ తరం మహిళలు వంటింటికి పరిమితం కాకుండా విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్నత స్థానం పొందేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. జీవిత భాగస్వామి ఎంపికలో కూడా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నుకొనే పరిస్థితి వచ్చిందన్నారు. నేడు మహిళా సాధికారతకు ప్రతిబింబంగా వారు కనిపిస్తున్నారన్నారు. ఒకప్పుడు మహిళకు వివాహం చేయడం ఎంతో కష్టతరమైన ప్రక్రియ అని, ఇప్పుడు ఈ పరిస్థితి పురుషులకు వచ్చిందని చమత్కరించారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మహిళా విభాగం ఛైర్‌పర్సన్ వి.నిర్మలకుమారి మాట్లాడుతూ, మహిళా ఉద్యోగులు జీవితంలో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేలా జీవనశైలిలో మార్పు చేసుకోవాలన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మానసిక విశ్రాంతి కోసం ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగ బాధ్యతల్లో మహిళల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. అనంతరం విజేతలకు వాణీమోహన్ బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి చౌదరి పురుషోత్తమ నాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, కార్యదర్శి ఎండీ ఇక్బాల్, క్యాపిటల్ సిటీ అధ్యక్షుడు నాగభూషణం, కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ పి.మాధవి, కో కన్వీనర్స్ ఎం.గౌరి, వివి లలితాంబ, జాయింట్ కన్వీనర్ నాగమల్లేశ్వరి, మహిళా విభాగం ఛైర్‌పర్సన్ రాధారాణి, కోశాధికారి శివలీల తదితరులు పాల్గొన్నారు.

ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, మార్చి 15 : కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం-11 కింద పారిశుధ్య కార్మికుల పిల్లలు (1 నుంచి పదో తరగతి వరకు) స్కాలర్ షిప్ కోసం దరఖాస్తులు కోరుతున్నట్టు ఎన్టీఆర్ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ&సాధికారిత అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీమెట్రిక్ స్కాలర్ షిప్ కోసం గ్రామ/వార్డు సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ ఏప్రిల్ 10 అని పేర్కొన్నారు.

అర్హతలు :

మాన్యువల్ స్కావెంజర్స్, చర్మకారులు, ప్లేయర్స్, వ్యర్థాలను సేకరించేవారు (శుభ్రం చేయువారు) ప్రమాదకర శుభ్రతలో నిమగ్నమైన వృత్తిలో వున్న వారు (కుల, మతంతో సబంధం లేదు). 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పూర్తిస్థాయిలో చదువుతున్న విద్యార్థి/విద్యార్థినులు, కుటుంబ ఆదాయ పరిమితి లేదు. పూర్తి వివరాలకోసం గ్రామ/వార్డు సచివాలయాలలో సంప్రదించాలని కోరారు.

సీఐఐ ఐడబ్ల్యూఎన్ కార్యవర్గం ఎన్నిక

విజయవాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సీఐఐలోని ఇండియన్ ఉమన్ నెట్‌వర్క్(ఐడబ్ల్యూఎన్) ఏపీ చాప్టర్ ఛైర్‌ఉమన్‌గా అమరా హాస్పిటల్ ఎండీ గొరిసేని రమాదేవి, వైస్‌ఛైర్మన్‌గా అవెరా కో ఫౌండర్ చాందిని చందన ఎన్నికయ్యారు. దక్షిణాది ఛైర్‌పర్సన్‌గా ముక్కవిల్లి లక్ష్మిని ఎన్నుకున్నారు. విజయవాడలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.

ఏఐతో వినియోగదారులకు రక్షణ

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

కృష్ణలంక, మార్చి 15 : కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను ఉపయోగించడంలో నైతిక ప్రమాణాలు, నియంత్రణలు పాటించడం ద్వారా వినియోగదారులకు రక్షణ సాధ్యమవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని వినియోగదారుల కోసం కృత్రిమ మేధస్సు ఇతివృత్తంతో జరుపుకొంటున్నట్టు తెలిపారు. వినియోగదారుల విశ్వాసాన్ని పొందేందుకు, ఎదురయ్యే సమస్యలను నివారించేందుకు కృత్రిమ మేధస్సును ఉపయోగించడం చాలా ముఖ్యమన్నారు. వినియోగదారుల వివాదాల పరిష్కార వ్యవస్థలు క్రియాశీలకంగా పనిచేస్తూ త్వరితగతిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. జాతీయ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ 1800-11-4000 లేదా 1915, రాష్ట్ర వినియోగదారుల సహాయ కేంద్రం 18004250082 లేదా 1967 అందుబాటులో వున్నట్టు తెలిపారు. జిల్లా వినియోగదారుల ఫోరం-2 అధ్యక్షుడు నేలపూడి చిరంజీవి మాట్లాడుతూ, ఏవస్తువు కొన్నప్పటికీ బిల్లులు, వారెంటీ, గ్యారెంటీ కార్డులను భద్రపరుచుకోవాలని, విధివిధానాలు షరతులను చదవాలని సూచించారు. డాక్యుమెంట్లు సరిగా వుంటే వినియోగదారు వివాదాల కేసుల్లో సత్వరం పరిహారం అందేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు అక్కపెద్ది వెంకటరమణ, డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి జి.మోహన్ బాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఎన్సీఆర్సీ పీఆర్‌వోగా రాయిరత్న సతీష్

కృష్ణలంక: న్యూఢిల్లీలో జరుగుతున్న వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా శుక్రవారం విజయవాడ కృష్ణలంకకు చెందిన రాయిరత్న సతీష్ జాతీయ కన్స్యూమర్ రైట్స్ ఏపీ పీఆర్వోగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ ఎన్సీఆర్సీ ఫౌండర్ ఎం.బి.ఎల్.నాగేశ్వరరావు, కమిషన్ ఛైర్మన్ రాజ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్లు రవి నుంచి సతీష్ నియామకపత్రాన్ని అందుకున్నారు.

రేపు గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షకు

పటిష్ట ఏర్పాట్లు

హాజరుకానున్న 10525 మంది అభ్యర్థులు

కృష్ణలంక, మార్చి 15 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈనెల 17వ తేదీ ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేసి కేంద్రాలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు తీసుకోనున్న ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలులో



లైజనింగ్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 17వ తేదీ ఆదివారం నగరంలోని 24 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు 10525 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్షల నిర్వహణకు 24 మంది లైజన్ అధికారులను నియమించామని, వీరంతా ఆయా కేంద్రాలను తనిఖీ చేసి పరీక్ష నిర్వహణకు అవసరమయ్యే వసతులు, సౌకర్యాలను పరిశీలించాలన్నారు. 24 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. పరీక్ష మెటీరియల్‌ను కేంద్రాలకు తరలించేందుకు లైజన్ అధికారులకు ఇద్దరు ఆర్మ్‌డ్ పోలీసులను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఫొటోతో వున్న ఏదైనా ఒరిజినల్ ఆధార్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్సు, ఓటర్‌కార్డు, పాస్‌పోర్టు, రేషన్‌కార్డు, ఐడీ గుర్తింపు కార్డులను తమతో తీసుకురావాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలని, ఉదయం 9.45 తర్వాత, మధ్యాహ్నం పరీక్షకు 1.45 తరువాత అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, కేంద్రాల పరిసరాలలో ఇంటర్నెట్, జిరాక్సు సెంటర్లు, మూసివేసేలా ఆదేశించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ సిబ్బంది, అత్యవసర మందులతో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, ఆర్డీఓ బీహెచ్.భవానీశంకర్ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో

వృద్ధ రైతు ఆత్మహత్య

స్థలం కబ్జా చేసి వేధిస్తున్నారని లేఖ




నందిగామ, మార్చి 15 : తన కుటుంబానికి న్యాయం జరగాలని వృద్ధ రైతు కోర్టు ఆవరణలో ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా సంచలనం కలిగించింది. సేకరించిన సమాచారం ప్రకారం.. కంచికచర్ల మండలం మోగులూరు గ్రామానికి చెందిన కూచు వెంకటేశ్వరరావు(80)కి గ్రామంలో సుమారు ఎకరం భూమి ఉంది. ఆ భూమిని తన సోదరుడి కుమారుడు ఫోర్జరీ సంతకంతో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపిస్తూ ఆరేళ్ల క్రితం కోర్టును ఆశ్రయించాడు. అప్పటి నుంచి కేసు విచారణ జరుగుతున్న క్రమంలో శుక్రవారం ఉదయం కోర్టుకు వచ్చిన వెంకటేశ్వరవు పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందుగానే లేఖను ఇతరులతో రాయించి జేబులో పెట్టుకున్నాడు. తన తమ్ముడి కుమారుడు తన భూమిని అక్రమంగా పొందాడని, దీనిపై నిలదీస్తే కుమార్తెలపై కేసులు పెట్టిస్తున్నాడని ఆరోపించాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కష్టాన్ని తట్టుకోలేకపోతున్నట్టు లేఖలో రాసి ఉన్నట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు

గ్రామ సచివాలయంలో

రైతు ఆత్మహత్యాయత్నం

రీ సర్వేలో భారీ తప్పులే కారణం

64 సెంట్లలో 25 సెంట్లే ఉన్నట్టు రికార్డు



ఆత్మహత్యకు ప్రయత్నించిన రైతు ఆశీర్వాదం

ప్రత్తిపాడు, మార్చి 15: ప్రభుత్వ నిర్వాకం.. అధికారుల తప్పులు వెరసి ఓ రైతు నిండు ప్రాణాన్ని బలి తీసుకోబోయింది. గ్రామ సచివాలయంలో అధికారుల సాక్షిగా తనకు జరిగిన అన్యాయంపై గుండెలవిసేలా విలపించాడు. మరణమే శరణ్యమని తన భుజంపై ఉన్న పైపంచెనే ఉరితాడుగా చేసి గొంతుకు బిగించుకున్నాడు. పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆ ఆలోచన విరమించుకున్నాడు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలేనికి చెందిన దున్నా ఆశీర్వాదానికి 64 సెంట్ల భూమి ఉంది. ఆ భూమిపై సొసైటీలో లోన్ ఉండటంతో రీ షెడ్యూల్ చేసుకునేందుకు వెళ్లాడు. అక్కడ ఆన్‌లైన్‌లో చెక్ చేస్తే కేవలం 25 సెంట్లు మాత్రమే భూమి కనిపించింది. దీంతో దిక్కుతోచని స్థితిలో ప్రత్తిపాడు-1 సచివాలయానికి వచ్చాడు. రీసర్వే సరిగా జరగలేదని తనకు నష్టం వాటిల్లిందని అధికారులను ప్రశ్నించినా ఫలితం లేకపోవడంతో ఆ రైతు తన పైపంచెతో ఉరివేసుకుని ఆత్మహత్యాప్రయత్నం చేశాడు. వెంటనే అక్కడ సిబ్బంది అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి న్యాయంచేస్తామని హామీ ఇవ్వడంతో ఆశీర్వాదం శాంతించాడు. కాగా.. ప్రత్తిపాడు మండలంలో రీసర్వే ఇష్టమొచ్చినట్టుగా సాగిందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. డబ్బులు ఇచ్చిన రైతులకు మేలుచేసేలా సర్వే మొత్తం సాగినట్టు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వేపై ఇప్పటికే కొంతమంది ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. రాళ్ల పాతే సమయంలో కూడా రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారి ఇష్టమొచ్చినట్టుగా చేశారని చెబుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.18

దళవాయి సుబ్బరామయ్య విద్యార్థులకు బహుమతులు

విద్యాధరపురం, మార్చి 15: అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పటమటలో వివిధ అంశాలపై రాష్ట్ర జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో దళవాయి సుబ్బరామయ్య మునిసిపల్ పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. విజేతలకు పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ హెచ్. అరుణ్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు మాతంగి కోటయ్య, ఉపాధ్యాయులు, అభినందించారు.



ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టిన ఘనుడు జగన్

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, మార్చి 15: రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో విధ్వంసం పరాకాష్టకు చేరిందని తూర్పు ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 4వ డివిజన్ వెంకటేశ్వర నగర్ కాలనీ, పార్కు ఏరియాలో శుక్రవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని శివనాథ్‌ను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిందిగా ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం రాష్ట్ర చరిత్రలో ఎక్కడా లేదని, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మన ఆస్తులకు భద్రత లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా సరఫరా జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, లేకపోతే రాష్ట్రానికి, యువతకు తీరని నష్టం జరుగుతుందని అన్నారు. కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ప్రసాద్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

12వ డివిజన్‌లో గద్దె అనురాధ

పటమట : ఎన్నికల సమయంలో ఎంతోమంది వచ్చి మేము మీ కోసం ఎంతో కష్టపడ్డామని మాయమాటలు చెబుతుంటారని వారి మాటలు నమ్మిమోసపోవద్దని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. 12వ డివిజన్ కాకతీయ బజార్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ-జనసేన-బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతామన్నారు. పొట్లూరి సాయిబాబు, శాయన బుజ్జి, మోటూరి బుచ్చిబాబు, కోగంటి రాంబాబు, మాదల చిన్నతల్లి, జనసేన నాయకురాలు మాకినేని నీరజలు పాల్గొన్నారు. ● 11వ డివిజన్ ఎన్టీఆర్ సర్కిల్ అచ్చమ్మ వీధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గద్దె రాజేష్ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులుగా ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని చిన్నిలను గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా రాజేష్ ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేసే పథకాలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కోనేరు రాజేష్, నల్లూరి ఉషారాణి, పామర్తి కిషోర్, దేవరపల్లి ఆంజనేయులు, పాలడుగు దుర్గాప్రసాద్, గరికపాటి బద్రిలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను స్థానికులకు వివరిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



గద్దె అనురాధకు కుంకుమ పెడుతున్న స్థానిక మహిళ

మహిళా పక్షపాతి చంద్రబాబు

ఉపకరణాల పంపిణీలో కేశినేని చిన్ని

పాతరాజరాజేశ్వరిపేట, మార్చి 15 : 56వ డివిజన్‌లో కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న కేశినేని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కేశినేని చిన్ని మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టు మిషన్లు, ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అధినేత చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతి అని అందుకే టీడీపీ మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపీట వేశారని పేర్కొన్నారు. బుద్దా వెంకన్న, నాగూల్‌మీరాలు పాల్గొన్నారు.

భవానీపురం : 45వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ ఆధ్వర్యంలో పేదల కుటుంబ పోషణకు కుట్టుమిషన్లు, ఇస్త్రీ పెట్టెల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, మైనార్టీ రాష్ట్ర నాయకులు కె.నాగూల్ మీరాలతో కలిసి టీడీపీ సీనియర్ నేత శివనాథ్ ఉపకరణాల పంపిణీలో పాల్గొన్నారు. బుద్దా వెంకన్న మాట్లాడుతూ ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్న కేశినేని చిన్నిని పార్లమెంట్‌కు పంపాలని కోరారు. కార్యక్రమంలో 38, 44 డివిజన్ టీడీపీ అధ్యక్షులు పితాని పద్మ, బొడ్డుపల్లి శ్రీనివాస్, నాయకులు తుపాకుల రమణమ్మ, సుకాసి సరిత, గంగవరపు మురళి,ఈది పార్వతి, మధులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు, ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేస్తున్న కేశినేని చిన్ని

చిలకలూరిపేట సభను జయప్రదం చేయండి

● బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 15 : చిలకలూరిపేటలో ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. అజిత్‌సింగ్ నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన నేత పవన్‌కల్యాణ్‌లు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సభకు సుమారు 15 లక్షల మంది హాజరుకానున్నారని తెలిపారు.

టీడీపీలో చేరికలు

నియోజకవర్గానికి చెందిన పలువురు శుక్రవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బొండా ఉమా 50 మందికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తోపుడు బండ్లు పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో పేదలకు తోపుడు బండ్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా, కేశినేని చిన్నిలు ఐదు మంది నిరుపేదలకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉమా

టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడిగా పులిబండ్ల

గవర్నర్‌పేట: టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన పులిబండ్ల కృష్ణను నియమిస్తూ సెంట్రల్ ఇన్‌చార్జి బొండా ఉమామహేశ్వరరావు శుక్రవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియామకపు పత్రాలను అందజేశారు. కార్పొరేటర్ బాలస్వామి, చింతా దుర్గారావు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఎన్‌టీటీపీఎస్ ఎస్ఈ పట్టేటి ప్రసాద్

లబ్బీపేట, మార్చి 15: విద్యార్థులు చదువుతో పాటు వివిధ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎన్‌టీటీపీఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పట్టేటి ప్రసాద్ అన్నారు. నలంద కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఎలక్ట్రో 2కే24 ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కొత్త కొత్త ఆలోచనలతో టెక్నాలజీని ఉపయోగించి స్టార్టప్స్ ప్రారంభించాలని, తమకున్న పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ప్రాజెక్టులను తయారు చేసినప్పుడు ప్రాక్టికల్ నాలెడ్జి పెంపొందించుకుంటారని అన్నారు. ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ మాట్లాడుతూ యూనివర్సిటీ సిలబస్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, క్లబ్ యాక్టివిటీస్, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్‌తో పాటు వివిధ నైపుణ్యాలను పెంపొందించేలా వర్క్‌షాపులు, సెమినార్స్, ప్రాజెక్ట్ వర్క్స్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడీ కె.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎన్‌టీటీపీఎస్ ఎస్ఈ పట్టేటి ప్రసాద్

ఉత్తుత్తి బటన్ నొక్కుళ్లతో జగన్ మోసం

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కోగంటి

విద్యాధరపురం, మార్చి15: ఉత్తుత్తి బటన్ నొక్కుళ్లతో జగన్మోహనరెడ్డి లబ్ధిదారులను మోసం చేస్తున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కోగంటి రామారావు ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో సంక్షేమ పథకాల పేరుతో జగన్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రచారం కోసం జగన్‌రెడ్డి ప్రజా సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో బీజేపీ-టీడీపీ-జనసేన కూటమికి ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధమయ్యారని తెలిపారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

వినియోగదారులకు నాగళ్ల విద్యాఖన్నా సూచన



మాట్లాడుతున్న నాగళ్ల విద్యాఖన్నా

మొగల్రాజపురం, మార్చి 15: డబ్బులు చెల్లించి వస్తువులను, వస్తు సేవలను కొనుగోలు చేసే ప్రతి వ్యక్తి ఒక వినియోగదారునిగా తన హక్కులను తెలుసుకోవాలని జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా చెప్పారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మొగల్రాజపురం కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ నష్టపోయిన వినియోగదారుడు జిల్లా ఫోరంలో 25 లక్షల వరకు, రాష్ట్ర ఫోరంలో కోటి రూపాయల వరకు, జాతీయ ఫోరంలో కోటికి పైన నష్టపరిహారం పొందడానికి వీలుంటుందని అన్నారు. ప్రతి దానికి బిల్లు, దాని మీద అమ్మకందారుడి సంతకం, స్టాంప్, తేదీ, వారంటీ, గ్యారంటీ కార్డులు జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. సంస్థ రిసోర్స్ పర్సన్ పి. వరలక్ష్మి మాట్లాడుతూ ప్రజలలో చైతన్యం తీసుకురావాల్సిన ఆవశ్యకత, అవసరం ఇంకా పెరిగిందని అన్నారు. సిబ్బంది, శిక్షకులు, శిక్షణార్థులు, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు గోపయ్య, శివబలరామ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీపార్లర్, మసాజ్ సెంటర్లలో తనిఖీలు



బ్యూటీపార్లర్‌ను తనిఖీ చేస్తున్న వన్‌టౌన్ సీఐ డి.దుర్గాశేఖర్‌రెడ్డి

వన్‌టౌన్, మార్చి 15: బ్యూటీపార్లర్, మసాజ్ సెంటర్లలో అసాంఘిక కార్యకలపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వెస్ట్ ఏసీపీ పగడాల మురళీకృష్ణరెడ్డి అన్నారు. వెస్ట్ ఏసీపీ పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ డి.దుర్గాశేఖర్‌రెడ్డి, కార్పొరేషన్ రెవెన్యూ, లేబర్, సీటీవో అధికారులు, చైల్డ్ అండ్ వెల్ఫేర్ ప్రతినిధి శుక్రవారం వన్‌టౌన్ స్టేషన్ పరిధిలోని బ్యూటీపార్లర్, మసాజ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆ ప్రదేశాలను పరిశీలించి పని విధానాన్ని సంబంధిత నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100, 112కు గాని వన్‌టౌన్ సీఐకు గాని సమాచారం తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

● వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ పర్యవేక్షణలో శుక్రవారం భవానీపురం స్టేషన్ పరిధి, కొత్తపేట స్టేషన్ పరిధిలోని బ్యూటీపార్లర్, మసాజ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవానీపురం సీఐ, కొత్తపేట సీఐ టి.గణేష్, రెవెన్యూ, లేబర్, సీటీవో అధికారులు, చైల్డ్ అండ్ వెల్ఫేర్ ప్రతినిధి, సిబ్బంది తనిఖీలు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కల్యాణం



గవర్నర్‌పేట, మార్చి 15: శుద్ధ షష్ఠిని పురస్కరించుకుని చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో శుక్రవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి 11 రకాల ద్రవ్యాలతో భక్తులు సర్ప సూక్త రుద్రాభిషేకం, స్వామి వారి కల్యాణం నిర్వహించారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో నూతక్కి వెంకట సాంబశివరావు పర్యవేక్షణలో అన్నప్రసాద వితరణ జరిగింది.

కనకదుర్గ ఫ్లైఓవర్‌పై బైక్ అదుపు తప్పి యువకుడు మృతి

విద్యాధరపురం, మార్చి15: కనకదుర్గ ఫ్లైఓవర్‌పై బైక్‌పై ప్రయాణిస్తున్న యువకుడు అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే చనిపోయిన సంఘటన శుక్రవారం జరిగింది. చిట్టినగర్ కేఎల్ రావునగర్ 4వ లైన్‌లో ఆళ్ళ రూపేష్ భార్య భాగ్యలక్ష్మి ఇద్దరు కుమారులతో ఉంటున్నాడు. ఇతను కృష్ణలంకలోని ఓ వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. ఇతను శుక్రవారం ఉదయం 9 గంటలకు వాటర్‌ప్లాంట్‌కు వెళ్లాడు. అక్కడ నుంచి 11 గంటలకు ఓ పని నిమిత్తం కోర్టుకు వెళ్లాడు. అక్కడ నుంచి 3 గంటలకు తన బైక్‌పై భవానీపురం స్వాతి సెంటర్‌వైపు కనకదుర్గా ఫ్లైఓవర్ మీదుగా బయలు దేరాడు. ఫ్లైఓవర్‌పై రూపేష్ బైక్ అదుపుతప్పి రోడ్డు మీద పడ్డాడు. ఈ సంఘటనలో అతని తలకి బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే చనిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

50వ డివిజన్‌లో మొబైల్ అన్న క్యాంటీన్

వన్‌టౌన్, మార్చి 15 : విజయవాడ టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కేశినేని శివనాథ్(చిన్ని) ఆధ్వర్యంలో శుక్రవారం 50వ డివిజన్ పరిధి గొల్లపాలెంగట్టు సెంటర్‌లో మొబైల్ అన్న క్యాంటీన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ్, 50వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొప్పుల గంగాధరరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కేశినేని శివనాథ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఐటీడీపీ కో- ఆర్డినేటర్ జి.మహేష్, పార్టీ నాయకులు కే.ఈశ్వర్, పి.బాలాజీ, కే.సెవన్, కే.శంకర్, కే.అశోక్, బి.నాని, కే.సాయి పాల్గొన్నారు.

మహంతి చారిటబుల్ ట్రస్ట్ వితరణ

గవర్నర్‌పేట, మార్చి 15: రెండు పేద కుటుంబాల జీవనోపాధి కోసం 25వ డివిజన్ సీతారామపురంలోని మహంతి అప్పల నర్సయ్య, మహాలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ (ఎంఏఎం) నాలుగు చక్రాల తోపుడు బండి, కుట్టు మిషన్ అందజేసింది ట్రస్ట్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మహంతి వాసుదేవరావు (వాసు) రామకృష్ణాపురానికి చెందిన జవహర్‌లాల్ కుటుంబానికి తోపుడు బండి, మధురానగర్‌కు చెందిన దుర్గమ్మకు కుట్టుమిషన్ అందజేశారు. వెంకట గౌతమి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలు

విద్యాధరపురం, మార్చి 15: సితార సెంటర్ సమీపంలో శుక్రవారం ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలతోటి మానసాకు ఇబ్రహీంపట్నం మండలం జూపూడికి చెందిన రాజేష్‌తో వివాహం అయింది. వీరికి కుమారుడు, కుమార్తె. మానస పిల్లలతో తేలప్రోలులో ఉన్న తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. శుక్రవారం జూపూడిలో జరిగిన ప్రార్థనకు మానస తన ఇద్దరు పిల్లలతో ద్విచక్ర వాహనంపై తేలప్రోలు నుంచి బయలుదేరింది. సితార సెంటర్ సమీపంలో ఆమె వాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో ఆమెకు, ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వాసుపత్రికి తీసుకుని వెళ్లారు. ఆమె సోదరుడు సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ప్రారంభం

వన్‌టౌన్, మార్చి15: నగరపాలక సంస్థ సర్కిల్-1 కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 47వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సూపర్‌వైజర్ల కార్యాలయాన్ని శుక్రవారం మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రారంభించారు. 46వ డివిజన్ పరిధిలోని దీనదయాళ్‌నగర్‌లో నూతనంగా నిర్మాణం చేయనున్న డ్రెయిన్ పనులను పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. పశ్చిమ వైసీపీ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్, 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ, ఈఈ నారాయణమూర్తి, ఇతర విభాగాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచితంగా మంచినీటి తొట్టెల పంపిణీ

విద్యాధరపురం, మార్చి 15: వేసవి కాలం పురస్కరించుకుని మూగజీవుల దాహార్తిని తీర్చుకునేందుకు ఈ నెల 17న భవానీపురం ఐరన్‌యార్డ్‌లోని జీవకారుణ్య ఆశ్రమం వద్ద ఉచితంగా మంచినీటి తొట్టెలు పంపిణీ చేయనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు మూరాల వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాతలు, జంతు ప్రేమికులు, సంభవ జీవదయ గ్రూపు సహాయ సహకారాలతో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మంచినీటి తొట్టెల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఈ మంచినీటి తొట్టెలు తీసుకునే వారు ముందుగానే వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

మ్యాన్‌హోల్స్ గోతులు పూడ్చేదెప్పుడో?

● ఊర్మిళానగర్ మెయిన్‌రోడ్డులో ప్రమాదాలు

భవానీపురం, మార్చి 15 : 43వ డివిజన్‌లో చర్చి నుంచి ఊర్మిళానగర్ మెయిన్‌రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసినా రోడ్డు మధ్యలో యూజీడీ మ్యాన్‌హోల్స్ గోతులను పూడ్చకపోవడంతో రాకపోకల సందర్భంగా ప్రజలు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఈ రోడ్డుపై సుమారు 15కు పైగా మ్యాన్‌హోల్స్ గోతులున్నాయి. 20 రోజుల నుంచి ఈ గోతుల్లో పడి పదుల సంఖ్యలో వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు గాయాల పాలయ్యారు. రాత్రి వేళల్లో గొయ్యి ఎక్కడో తెలియక అందులో వాహనం పోనివ్వడం వలన వాహనాలు బోల్తా కొడుతున్నాయి. ఈ సమస్యపై ఇంజనీరింగ్ అధికారులు యుద్ధప్రాతిపదికన మ్యాన్‌హోల్స్ గోతుల స్థానంలో మూతలను అమర్చి రోడ్డును సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్స్ గోతులు

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం • 16 మార్చి 2024
cinema@andhrajyothy.com



మధుబాల బయోపిక్



అలనాటి అందాల తార, ప్రేక్షక హృదయాలను దోచిన వెండితెర సామ్రాజ్ఞి, దివంగత బాలీవుడ్ నటి మధుబాల జీవితాన్ని సెల్యులాయిడ్‌పైకి తీసుకురానున్నారు. 'మొఘల్ ఈ ఆజమ్', 'చల్తీ కా నామ్ ఘాడీ', 'మిస్టర్ అండ్ మిస్సెస్ 55' వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో ఆమె మెరిశారు. తన అందంతో, నటనతో బాలీవుడ్ 'మార్లిన్ మన్రో'గా, 'లివింగ్ తాజ్ మహల్'గా కితాబులందుకున్నారు. ఈ చిత్రానికి టైటిల్ 'మధుబాల:ది వీనస్ ఆఫ్ ఇండియన్ సినిమా'. ఈ బయోపిక్‌కు బాలీవుడ్ చిత్రం 'డార్లింగ్స్' ఫేమ్ జస్మీత్ కే రీన్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ , బ్రీవింగ్ థాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కలసి సంయుక్తంగా నిర్మించనున్నాయి. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ ఈ విషయాన్ని శుక్రవారం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించింది. "అందానికీ, అభినయానికీ నిలువెత్తు నిదర్శనమైన మధుబాల జీవితాన్ని వెండితెరపైకి తీసుకురాబోతున్నాం. ఆమె జీవిత ప్రయాణాన్ని, భారతీయ చలన చిత్ర రంగంపై ఆమె వేసిన ముద్రను ఓ దృశ్య కావ్యంగా మలవనున్నాం. ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నందుకు చెప్పలేనంత సంతోషంగా ఉన్నాం. తన సమ్మోహనమైన సౌందర్యంతో ఆనాటి తరాన్ని అలరించిన అందాల దేవతను వెండితెరపై దర్శించి, పులకించి పోవడానికి.. ఆమె నటనాపటిమను చూసి ఆశ్చర్యచకితులవ్వడానికి సిద్ధమవ్వండి" అంటూ పేర్కొంది. ఈ బయోపిక్‌లో మధుబాల పాత్రను ఎవరు పోషిస్తున్నారనే ఆసక్తి అందరిలోనూ ఏర్పడగా.. ఆలియా భట్, కృతి సనన్, త్రిప్తి దిమ్రి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

మంచి హిట్ ఇచ్చారు.. థాంక్స్

గోపీచంద్

గోపీచంద్ హీరోగా కన్నడ దర్శకుడు ఎ హర్ష రూపొందించిన 'భీమ' చిత్రం ఇటీవల విడుదలై ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన థాంక్స్ మీట్‌లో హీరో గోపీచంద్ మాట్లాడుతూ ' ఇంతమంచి విజయం అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. రెండు క్యారెక్టర్స్‌లో చక్కని వేరియేషన్స్ చూపించారని అంటున్నారు. గ్రాఫిక్స్, యాక్షన్ , కామెడీ అద్భుతంగా



కుదిరాయి. ఇంత మంచి కథ తీసుకువచ్చి, కమర్షియల్ ప్యాక్డ్ సినిమా తీసిన దర్శకుడు హర్షకు, ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించిన నిర్మాతలు రాధామోహన్, శ్రీధర్‌కు కృతజ్ఞతలు. పరీక్షలు అయిపోయాయి కాబట్టి ఇంకా సినిమా చూడని వారు థియేటర్‌కు వెళ్లి సినిమా చూడండి' అని కోరారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'కన్నడ దర్శకుడు హర్ష తెలుగు ప్రేక్షకుల నాడిని పట్టుకుని సినిమాను ఆద్యంతం గ్రిప్పింగ్‌గా తీశారు. పతాక సన్నివేశాలు సినిమాకే హైలైట్' అని ప్రశంసించారు. మరో దర్శకుడు సంపత్‌నంది మాట్లాడుతూ 'మైథాలజీ, ఫాంటసీ అంశాలు జోడించి తీసిన మంచి కమర్షియల్ సినిమా 'భీమ'. ఇంటర్వెల్, క్లైమాక్స్ ఫైట్ చూస్తుంటే పరశురాముడు ఇలాగే ఉంటాడమో అనిపించింది' అన్నారు. ముంబైలో సినిమా చూశాననీ, ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారని హీరోయిన్ మాళవిక చెప్పారు. తన తొలి తెలుగు చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు దర్శకుడు హర్ష. రోజురోజుకీ కలెక్షన్లు పెరుగుతున్నాయని చెబుతూ మంచి విజయం అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు నిర్మాత రాధామోహన్.

మరింత సరళంగా సినిమా సర్టిఫికేషన్ రూల్స్

కేంద్ర సమాచార, ప్రసార మంత్విత్వ శాఖ సినిమాటోగ్రఫీ 2024(సినిమా సర్టిఫికేషన్) నిబంధనలను విడుదల చేసింది. ఈ ప్రక్రియలో గణనీయమైన మార్పులు చేసింది. 1983 నుంచి కొనసాగుతున్న విధానాలలో కొన్ని మార్పుల్ని తీసుకువచ్చింది. ఈ మార్పుల వల్ల ఆన్‌లైన్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ప్రక్రియ మరింత సులువవుతుందని ప్రసార శాఖ ప్రకటించింది. కొత్త నిబంధనల వల్ల పారదర్శకత పెరిగి వాణిజ్యపరంగా చిత్ర పరిశ్రమకు మరింత మేలు జరుగుతుంది. పూర్తి స్థాయిలో డిజిటల్ సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా, సర్టిఫికేషన్‌కు పట్టే కాలం చాలావరకూ తగ్గుతుందని పేర్కొంది. ఇకపై వయసును బట్టి ప్రేక్షకులను ఏడేళ్లపైన, 13 ఏళ్లపైన, 16 ఏళ్లపైన మూడు కేటగిరీలుగా విభజించి సర్టిఫికెట్ జారీ చేయనుంది.

భయపెట్టే అనన్య


సుమన్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'అనన్య'. జయరామన్, చందన జంటగా నటించారు. ప్రసాద్‌రాజు బొమ్మిడి దర్శకత్వంలో జంధ్యాల గంగాధర శర్మ నిర్మించారు. ఈ నెల 22న విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. హారర్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రమిది, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా రూపొందించామని దర్శకుడు తెలిపారు. సినిమా ఆద్యంతం ఉత్కంఠ కలిగిస్తుంది, ఈ జానర్‌లో ట్రెండ్ సెట్ చేస్తుంది అని నిర్మాత తెలిపారు.



మలయాళ చిత్రం...
కలెక్షన్ కింగ్



కథను, కథనంలో కొత్తదనాన్ని నమ్ముకొని చేస్తున్న ప్రయత్నం దేశవ్యాప్తంగా మలయాళ చిత్రసీమకు గౌరవాన్ని తెచ్చిపెడుతోంది. కమర్షియల్ హంగులు, రొటీన్ మసాలా అంశాలు లేకున్నా అక్కడి సినిమాలు బాక్సాఫీసును దున్నేస్తున్నాయి. రైటింగ్‌లో లేనిది టేకింగ్‌లో రాదు అనే సూక్తిని మలయాళ చిత్రసీమ మొదటి నుంచి నిక్కచ్చిగా పాటిస్తోంది. కాబట్టే అక్కడ పరిమిత బడ్జెట్‌తో రూపొందిన ఎన్నో చిత్రాలు ఇప్పటివరకూ మంచి విజయాన్ని అందుకొంటూ చిన్న







పరిశ్రమకు ఊపిరి పోస్తున్నాయి. ఇప్పుడు మలయాళ సినిమా మరింత ఎదిగింది. గడచిన రెండేళ్లుగా పరభాషల్లోనూ కమర్షియల్ విజయాలను అందుకుంటూ, భారతీయ చిత్ర పరిశ్రమలో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది. ఇటీవల కాలంలో మాత్రం అక్కడి సినిమాలు రూ. 100 కోట్లు, రూ. 150 కోట్ల వసూళ్లను అలవోకగా సాధిస్తున్నాయి. పలు భాషల్లో మలయాళ సినిమాలు డబ్ అవుతున్నాయి. మంచి విజయం సాధిస్తున్నాయి. ఓటీటీల్లోనూ మలయాళ సినిమాల హవా నడుస్తోంది. భాషలకు అతీతంగా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. వాణిజ్య హంగులకు పెద్ద పీట వేసే పరభాషా చిత్రాల్లోలా అవసరం లేకున్నా భారీగా ఖర్చు పెట్టడం, హీరోయిజాన్ని కీర్తించడానికి బిల్డప్ సీన్లు లాంటి అవలక్షణాలకు మలయాళ చిత్రసీమ ఆమడ దూరం. మొదటి నుంచి అక్కడ సినిమాకు కథే హీరో. ఆ సూత్రాన్నే నమ్ముకొని ముందుకు సాగుతున్న ఈ తరం మలయాళ దర్శకులు తమ మార్కెట్‌ను పాన్ ఇండియా స్థాయికి విస్తరిస్తున్నారు. కొత్త ఏడాదిలో తొలి మూడునెలల్లోనే అరడజను విజయాలు అందుకొని సరికొత్త ఉత్సాహంతో మలయాళ చిత్రసీమ దూసుకుపోతోంది.

పిశాచం పాత్రలో మమ్ముట్టి

ఈ కోవలో ముందుగా ప్రస్తావించాల్సిన చిత్రం 'భ్రమయుగం'. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ఈ చిత్రంలో పోషించింది ఓ పిశాచం పాత్ర. మరే భాషలోనైనా ఆ స్థాయి ఉన్న నటుడు ఇలాంటి పాత్ర పోషించడమనేది ఇప్పుడున్న పరిస్థితుల్లో ఊహకైనా అందదు. ఇక సినిమాలో ఉన్నది మొత్తం మూడు పాత్రలే. కథ అంతా పాడుబడిన ఇంట్లోనే సాగుతుంది. సినిమా మొత్తం బ్లాక్ అండ్ వైట్‌లోనే తీయడం మరో విశేషం. 17వ శతాబ్దం నేపథ్యంలో సాగే కథలో ఓ ఒంటరి బాటసారి అడవిలో దారి తప్పి పాడుబడిన ఇంట్లోకి వెళ్లడం, తను అక్కడే బందీ అవడం, ఆ ఇంట్లో ఎదుర్కొన్న పరిస్థితుల నేపథ్యంలో సాగిన సినిమా ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. విడుదలైన మూడు వారాల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 55 కోట్ల వసూళ్లను సాధించింది.

ఈతరం ప్రేమలు

అగ్ర హీరోల సినిమాలే కాదు, అక్కడి నుంచి వస్తున్న లో బడ్జెట్ చిత్రాలు సైతం దేశవ్యాప్తంగా ట్రెండ్ సెట్ చేస్తున్నాయి. ఆ కోవలో ముందుగా చెప్పాల్సింది 'ప్రేమలు' చిత్రం గురించే. మలయాళ హీరో ఫహాద్ ఫాసిల్ నిర్మించిన ఈ చిత్రం అక్కడ రూ. 100 కోట్ల వసూళ్లను సాధించింది. దర్శకుడు రాజమౌళి తనయుడు ఎస్ఎస్ కార్తికేయ ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేశారు. గిరీష్ ఏడి దర్శకుడు. కాలేజీ నేపథ్యంలో సాగిన ఈ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ తెలుగు ప్రేక్షకులను సైతం అమితంగా ఆకట్టుకుంది. కథానాయిక మమిత బైజు తెలుగునాట పాపులర్ అయ్యారు.

ఆల్‌టైమ్ రికార్డ్ మూవీ

యూత్ ఎంటర్టైనర్ 'మంజుమ్మెల్ బాయ్స్' చిత్రం ఇతర భాషల్లో సైతం వసూళ్ల దుమ్మురేపుతోంది. రూ. 4 కోట్లతో నిర్మించిన ఈ చిత్రం నేటికి (23 రోజుల్లో) రూ. 175 కోట్లు వసూలు చేసింది. ఇప్పటిదాకా అత్యధిక వసూళ్లు సాధించిన మలయాళ చిత్రంగా చరిత్ర సృష్టించింది. ఇంకా బాక్సాఫీసు దగ్గర ఈ చిత్రం హవా నడుస్తోంది. 2006లో కొడైకెనాల్ గుహల్లో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా దర్శకుడు చిదంబరం ఈ చిత్రాన్ని రూపొందించారు. విహార యాత్ర కోసం కొండగుహల్లోకి వెళ్లిన స్నేహితుల బృందంలో ఓ యువకుడు లోయలో పడడం, అతన్ని కాపాడేందుకు మిగిలినవారంతా కలసి చేసిన ప్రయత్నాల నేపథ్యంలో కథ సాగుతుంది. త్వరలోనే ఈ చిత్రం తెలుగు వెర్షన్ ప్రేక్షకుల ముందుకు రానుంది.

మెప్పించిన మర్డర్ మిస్టరీ

ఫిబ్రవరిలో విడులైన 'అన్వేషిప్పిన్ కాండేత్తుమ్' చిత్రం పోలీస్ ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో సాగుతుంది. నటీనటులు అంతా కొత్తవారే. రూ. 10 కోట్ల వ్యయంతో తెరకెక్కి, రూ. 50 కోట్లకు పైబడి వసూళ్లను సాధించింది. కథంతా మర్డర్ మిస్టరీ చుట్టూ తిరుగుతుంది. సినిమా అంతా పోలీస్ ఇన్వెస్టిగేషన్ తప్ప పాటలు, ఫైట్లు, కామెడీ సన్నివేశాలు మచ్చుకూ కనిపించవు. అయినా ప్రేక్షకులు పట్టం కట్టారు. ప్రస్తుతం ఓటీటీ స్ట్రీమింగ్‌లోనూ చక్కని ఆదరణ పొందుతోంది.

కమర్షియల్ సక్సెస్‌తో కొత్త కోణం

మలయాళ చిత్ర పరిశ్రమ సాధిస్తున్న ఈ విజయాల్లో ప్రధాన పాత్ర అక్కడి దర్శకులదే అని చెప్పాలి. వారి సృజనాత్మకతతో సరికొత్త కథలు తెరపైకి వచ్చి, ప్రేక్షకులను మెప్పిస్తున్నాయి. అగ్ర హీరోలు సైతం ప్రయోగశీలురు కావడం, దర్శకులపైన నమ్మకం ఉంచి మేకింగ్‌లో కలుగజేసుకోకుండా ఉండడమూ విజయాలకు కారణం. అందుకే అక్కడి సినిమా ఎల్లలు చెరిపివేసి దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ విజయదుందుభి మోగిస్తోంది. ఈ ఏడాది మూణ్నెల్లలోనే పలు మలయాళ సినిమాలు భారీ కమర్షియల్ విజయాలను అందుకొని సక్సెస్‌కు సరికొత్త భాష్యం చెబుతున్నాయి. మార్కెట్ పరిధి తక్కువ కావడంతో కొద్ది బడ్జెట్‌తో, ముందస్తు ప్రణాళికతో చాలా తక్కువ రోజుల్లోనే సినిమాను నిర్మించడం పరిపాటి.



సినీ నటుడు వెంకటేశ్
రెండో కుమార్తె హవ్యవాహిని వివాహం శుక్రవారం
రాత్రి హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది.
పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై
నూతన దంపతులు
హవ్యవాహిని, డాక్టర్ నిశాంత్‌ను ఆశీర్వదించారు.


మీ నవ్వులకు
థియేటర్లు బద్దలవుతాయ్

శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకొన్న చిత్రం 'ఓం భీమ్ బుష్'. శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో వీ సెల్యులాయిడ్ సంస్థ నిర్మిస్తోంది. శుక్రవారం ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు కామెడీ సన్నివేశాలను డీల్ చెయ్యడంలో దర్శకుడు శ్రీహర్ష మరోసారి తన ప్రతిభను చూపించారు. ట్రెజర్ హంట్, హారర్, థ్రిల్లర్, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలు



కలిగిన ట్రైలర్ సినిమా మీద అంచనాలు పెంచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ 'ఈ నెల 22న థియేటర్స్‌కు రండి. మీరు నవ్విన నవ్వులకు థియేటర్లు బద్దలవుతాయ్. విమ్మల్ని నవ్వించాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా చేశాం. దర్శకుడు శ్రీహర్ష హిలేరియస్‌గా ఈ సినిమా తీశారు' అన్నారు. ట్రైలర్‌లో కంటే సినిమాలో ఎనర్జీ వంద రెట్లు ఎక్కువ ఉంటుంది. ఈ నెల 22న అందరూ మీ గ్యాంగ్స్‌తో రండి. టెన్ టైమ్స్ ఎంటర్‌టైన్ అవుతారు' అని చెప్పారు దర్శకుడు శ్రీహర్ష. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత సునీల్ బలుసు, ప్రియదర్శి వంశీ తదితరులు పాల్గొన్నారు

అమితాబ్‌కు యాంజియోప్లాస్టీ



బాలీవుడ్ అగ్రనటుడు అమితాబ్ బచ్చన్ అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం ముంబైలోని కోకిలా బెన్ హాస్పిటల్‌లో చేరారు. వైద్యులు ఆయన కాలికి యాంజియోప్లాస్టీ చేశారు. సాయంత్రం అమితాబ్ డిశ్చార్జి అయ్యారు. ఆయన త్వరగా కోలుకోవాలంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షించారు. 'ఎప్పటికీ కృతజ్ఞతగా ఉంటాను' అని బిగ్ బి సోషల్ మీడియాలో స్పందించారు. ప్రస్తుతం ఆయన 'కల్కి 2898 ఏడీ' సహా పలు చిత్రాల్లో నటిస్తున్నారు.



ఫిల్మ్ మేకర్ కథగా
'భరతనాట్యం'

సూర్య తేజ ఏలే, మీనాక్షి గోస్వామి నటిస్తున్న చిత్రం 'భరతనాట్యం'. 'దొరసాని' ఫేమ్ కేవీఆర్ మహేంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. వైవా హర్ష, హర్షవర్ధన్, అజయ్ ఘోష్, సలీం ఫేకు, టెంపర్ వంశీ కీలక పాత్రలు పోషించారు. పాయల్ సరాఫ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ మూవీ నుంచి 'చేశావు ఏదో మాయ' అనే సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. అలాగే, ఏప్రిల్ 5న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. ఓ ఔత్సాహిక ఫిల్మ్‌మేకర్ జీవితంలో ఎదుర్కొనే సమస్యలను ఇందులో చూపించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: రవితేజ గిరిజాల, డీఓపీ: వెంకట్ ఆర్ శాకమూరి, సంగీతం: వివేక్ సాగర్, ఆర్ట్: సురేశ్ భీమగాని, పబ్లిసిటీ డిజైనర్: ధని ఏలే

'అర్జునుడి గీతోపదేశం'

వరలక్ష్మి శరత్‌కుమార్ మెయిన్ లీడ్‌గా, అఖిల్ రాజ్, దివిజ ప్రభాకర్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న 'అర్జునుడి గీతోపదేశం' చిత్రం శుక్రవారం ఉదయం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సతీశ్ గోగాడ దర్శకత్వంలో త్రిలోక్‌నాథ్, ప్రదీప్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తపు షాట్‌కు మల్లా సీతారామరాజు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, కనుమెలి అవిస్మరాజు తొలి క్లాప్ ఇచ్చారు. లక్కంశెట్టి వేణుగోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఈ నెల 20 నుంచి అమలాపురంలో తొలి షెడ్యూల్ ప్రారంబిస్తున్నాం. ఆ తర్వాత వైజాగ్, హైదరాబాద్, చెన్నైలో షూటింగ్ చేస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, ఫొటోగ్రఫీ: చైతన్య కందుల, ఎడిటింగ్: అర్జున్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరికృష్ణ



వినూత్నం



అసలు వజ్రం విలువ, వన్నెలు.. శాశ్వతం

డైమండ్స్ ఆర్ విమెన్స్ బెస్ట్ ఫ్రెండ్స్, నిజమే! ప్రాణ స్నేహితుల్లాగే వజ్రాల విలువ కూడా ఎనలేనిదే! అయితే అంతే సమానంగా ధగధగలాడే కృత్రిమ వజ్రాలు కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. కానీ వన్నె, విలువలు ఎన్నటికీ తరగని అసలైన వజ్రాలే శాశ్వతంగా నిలిచి ఉంటాయంటోంది హైదరాబాద్‌కు చెందిన వజ్రాభరణాల డిజైనర్ మన్నె రాధిక. వజ్రాల గురించిన నిగూఢమైన రహస్యాలను, లోగుట్టులను ఆవిడ నవ్యతో ఇలా పంచుకుంది.

"వజ్రాలను ఎంచుకునేటప్పుడు కూడా స్నేహితులను ఎంచుకున్నట్టుగా ఆచితూచి వ్యవహరించాలి. లక్షలు పోసి కొనే వజ్రాల నగ వెల, కాలంతో పాటు పెరుగుతుందే తప్ప తరిగిపోదు. కాబట్టి వజ్రాల ధగధగల్లో ఏది అసలైన మెరుపో, ఏది కృత్రిమ మెరుపో తెలుసుకోవడం అవసరం. ఇప్పుడు కృత్రిమ వజ్రాలెన్నో అందుబాటులోకొచ్చాయి. రూపురేఖలు, లక్షణాలపరంగా అసలుకీ, కృత్రిమానికీ తేడా కనిపెట్టడం కష్టంగా మారింది. అనుభవజ్ఞులు మినహా ఎవరూ రెండిటి మధ్యా తేడాను కనిపెట్టలేరు. అలాగని ప్రయోగ శాలలో తయారైన కృత్రిమ వజ్రాలు కాబట్టి వీటి ధర చాలా తక్కువగా ఉంటుందనుకుంటే పొరపాటు. క్యారట్ అసలు వజ్రాలు 50 వేల ధర పలికితే కృత్రిమ వజ్రాలు 30 వేలు పలుకుతాయి. కాబట్టి పెళ్లి నగలు లాంటి ప్రత్యేకమైన ఆభరణాలు కొనేటప్పుడు కొన్ని వేల రూపాయల వ్యత్యాసాన్ని పరిగణించకుండా, కృత్రిమ వజ్రాలకు బదులుగా అసలైన వజ్రాలను ఎంచుకోవడమే మేలు.

దూరదృష్టితో ఆలోచించి...

అత్యధిక ఉష్ణోగ్రతలూ, ఒత్తిడులతో కూడిన విపరీత పరిస్థితులతో కూడిన భూగర్భంలో వజ్రాలు తయారవుతాయనే విషయం అందరికీ తెలిసిందే! ఎంతో దృఢమైనవి కాబట్టే వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి అనే నానుడి పుట్టుకొచ్చింది. అయితే కృత్రిమ వజ్రాలు కూడా ఇవే లక్షణాలను కలిగి ఉంటున్నాయి. కార్బన్‌ను విపరీతంగా వేడి చేసి, ఒత్తిడికి లోను చేసి, లేజర్ సహాయంతో వాటిలోకి మరకలు చొప్పించి, అసలు వజ్రాన్ని తలపించే కృత్రిమ వజ్రాలను తయారు చేస్తున్నారు. కానీ అసలు వజ్రాల్లా ఇవి ఎల్లకాలం ఉంటాయా అనేది అనుమానమే! పదేళ్ల తర్వాత వాటి రూపురేఖలు ఎలా మారిపోతాయో, వాటికి రీసేల్ వ్యాల్యూ ఏ మేరకు ఉంటుందో ఎవరికీ తెలియదు. అలాంటప్పుడు వజ్రాల ధగధగలకు బదులుగా, నాణ్యతకూ, రీసేల్ వ్యాల్యూకూ, శాశ్వతత్వానికీ ప్రాధాన్యం ఇవ్వాలి.

రీసేల్ వ్యాల్యూ ఉంటుంది

బంగారం మాదిరిగానే వజ్రాలకూ రీసేల్ వ్యాల్యూ ఉంటుంది. అయితే కొనే సమయంలో బ్రాండ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. తక్కువ ధరకు ఆశపడి, నాణ్యత విషయంలో రాజీ పడిపోకూడదు. ధర కాస్త ఎక్కువగానే అనిపించినా, పేరున్న బ్రాండ్‌కు చెందిన నాణ్యమైన వజ్రాలనే ఎంచుకోవాలి. అలాగే వజ్రాల నాణ్యతకు సంబంధించి ఐజీఐ లేదా జీఐఏ సర్టిఫికెట్ తీసుకోవాలి. అలాగే వజ్రాల నగలను కొనే ముందు వేర్వేరు చోట్ల ధరల గురించి వాకబు చేయాలి. ఇలా అన్ని విధాలా నచ్చిన తర్వాతే, వజ్రాల నగలను ఎంచుకోవాలి."



మన్నె రాధిక
వజ్రాభరణాల డిజైనర్

మేకప్

కట్టిపడేసే కళ్ల కోసం...

మేకప్ వేసుకునేటప్పుడు ఐ మేకప్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. కళ్లతో కట్టిపడేయడం కోసం పాటించవలసిన కొన్ని ఐ మేకప్ టిప్స్ గురించి తెలుసుకుందాం!

ఐలైనర్ ఇలా....

- ఐమేకప్ చెక్కుచెదరకుండా ఉండడం కోసం, కనురెప్పల మీద ప్రైమర్ అప్లై చేసి కనురెప్పలకు దగ్గరగా ఐలైనర్ గీసుకోవాలి. అందుకోసం కనురెప్పల చివర్ల నుంచి కనుకొలకుల దగ్గరకు ఐబ్రో పెన్సిల్‌తో డాట్స్ పెట్టి, అదే క్రమంలో లైనర్ బ్రష్‌తో కలపాలి. దీన్నే టైట్ లైనింగ్ అంటారు.
- ఐలైనర్‌గా పెన్సిల్‌ను వాడుతుంటే, దాన్ని బ్లంట్ చేసుకోవడం కోసం చేతి వెనక రుద్దుకోవాలి. బ్రష్ వాడుతుంటే, దాన్ని ఫ్రీజ్ చేసుకుని పదునుగా మార్చి ఉపయోగించాలి. ఈ చిట్కాలు పాటిస్తే ఐలైనర్ సులభంగా అప్లై చేసుకోవచ్చు.
- క్యాట్ ఐ ఆకారం కోసం, లిక్విడ్ లైనర్ వాడుకోవాలి. లైన్ కుదురుగా గీయలేని వాళ్లు, ముందుగా పెన్సిల్‌తో లైన్ గీసుకుని లైనర్‌తో నింపుకోవాలి. స్మోకీ ఐ లుక్ కోసం, పెన్సిల్‌ను ఉపయోగించాలి.
- పైబడే వయసుతో కనురెప్పల మీద ముడతలు ఏర్పడితే, నలుపు రంగు ఐలైనర్‌కు బదులుగా బ్రౌన్ ఎంచుకోవాలి.
- తలను కొద్దిగా పైకి లేపి, కనురెప్పలు దింపి ఐలైనర్ వేసుకోవాలి.

మస్కారా ఇలా...

- కనురెప్పల చివర్ల నుంచి మొదలుపెట్టి కను కొలకుల వరకూ మస్కారా వేసుకోవాలి.
- ఒక కోట్ వేసుకున్న తర్వాత, 10 సెకన్లు విరామం ఇచ్చి, రెండో కోట్ మస్కారా వేసుకుంటే, కనురెప్పలు దట్టంగా కనిపిస్తాయి.
- మస్కారా మూసిన కనురెప్పలకు అంటుకుంటే, కాటన్ బాల్‌తో ఐల్యాషెస్ వైపు దులపాలి. కానీ రుద్దుకోకూడదు.
- మస్కారా అప్లై చేసే ముందు కర్లర్‌తో ఐల్యాషెస్‌ను పైపైకి తిప్పుకోవాలి.
- మస్కారా అప్లై చేసే విధానం కూడా కీలకమే! పై కనురెప్పకు అప్లై చేసేటప్పుడు మస్కారా వ్యాండ్‌ను అడ్డంగా ఉపయోగించాలి. కింది రెప్పకు అప్లై చేసేటప్పుడు నిలువుగా పట్టుకోవాలి.
- మస్కారా ఉపయోగించడం ఇష్టం లేని వాళ్లు కృత్రిమ ఐల్యాషెస్‌ను అంటించుకోవచ్చు. అయితే వాటిని అంటించుకునేటప్పుడు ఉపయోగించే గ్లూ కళ్లలో పడకుండా జాగ్రత్తగా ఉండాలి.



వంటిల్లు

మెంతికూర, మెంతులతో చేసిన ఆహారం ఒకింత ప్రత్యేకమే. తింటుంటే.. ఆ ఫ్లేవర్ అమోఘమే. మేతి మలై పనీర్, మెంతి చికెన్ కర్రీ, ఆలు మెంతి కూరలను సులువుగా వండుకోవచ్చు ఇలా..

మెంతికూరతో.. మధురంగా!

మెంతి చికెన్ కర్రీ



కావాల్సిన పదార్థాలు

చికెన్- 600 గ్రాములు, కారం పొడి- నాలుగున్నర టీస్పూన్, పసుపు- చిటికెడు, ఉప్పు- తగినంత, మెంతాకు- 4 కట్టలు, నూనె- మూడు టేబుల్ స్పూన్లు, మీడియం సైజ్ ఉల్లిపాయలు- 4 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 5 (పొడవుగా కట్ చేయాలి), కరివేపాకు- 10 ఆకులు, జింజర్, గార్లిక్ పేస్ట్- 1 టేబుల్ స్పూన్, ధనియాల పొడి- 2 టేబుల్ స్పూన్, యాలకుల పొడి- అర టీస్పూన్, గరంమసాలా- కొద్దిగా

తయారీ విధానం

ఒక బౌల్‌లో చికెన్ ముక్కలు వేసి అందులో పసుపు, ఉప్పు, కారంపొడి వేశాక.. మారినేట్ చేసుకుని అరగంట పాటు అలానే ఉంచాలి. శుభ్రం చేసిన మెంతి ఆకులను పక్కన ఉంచుకోవాలి.

ప్యాన్‌లో నూనె వేసి కొద్దిగా వేడయ్యాక తరిగిన ఉల్లిపాయ ముక్కలను వేసి రంగు మారేంత వరకూ కలపాలి. పచ్చిమిర్చి, కరివేపాకు, జింజర్-గార్లిక్ పేస్ట్ వేసి నిముషం పాటు కలిపిన తర్వాత మెంతి ఆకుల్ని వేసి మెత్తగా అయ్యేంత వరకూ కలపాలి. ఇందులో మారినేట్ చేసుకున్న చికెన్ ముక్కల్ని వేసి కలపాలి. ప్యాన్‌పై మూత ఉంచి ఐదు నిముషాల పాటు కుక్ చేయాలి. మధ్యమధ్యలో కలుపుతూ ఉండాలి. చివరగా తగినంత ఉప్పు, మూడు టేబుల్ స్పూన్ల కారంపొడి, ధనియాల పొడి, యాలకుల పొడి, గరంమసాలా వేసి కలిపిన తర్వాత కప్పు నీళ్లు పోయాలి. ప్యాన్ మూత పెట్టి పదిహేను నిముషాల పాటు కుక్ చేయాలి. చికెన్ ముక్కలు బాగా ఉడుకుతాయి. ఈ మిశ్రమాన్ని కలిపిన తర్వాత దించేసుకోవాలి. మెంతి చికెన్ కర్రీ చపాతీ లేదా అన్నంతో తింటే రుచిగా ఉంటుంది.

ఆలు మెంతి కూర



కావాల్సిన పదార్థాలు

బంగాళ దుంపలు- 5 (మీడియం సైజ్), మెంతికూర- పెద్ద కట్ట, నూనె- మూడు టేబుల్ స్పూన్లు, జీలకర్ర- టీస్పూన్, ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), వెల్లుల్లి రెబ్బలు- 8, టమోటాలు-3 (చిన్నవి), పచ్చిమిర్చి- 3, పసుపు- చిటికెడు, ఉప్పు- రుచికి సరిపడ, కారంపొడి- టీస్పూన్, జీలకర్ర పొడి-1 టీస్పూన్, ధనియాల పొడి- 1 టీస్పూన్, గరం మసాలా- పావు టీస్పూన్, అంచూర్ పొడి- టీస్పూన్

తయారీ విధానం

బంగాళదుంపల పీలర్‌తో తొక్క తీసేసి ముక్కలుగా కట్ చేసుకోవాలి. శుభ్రంగా కడిగిన మెంతి ఆకుల్ని గిల్లి ప్లేట్‌లో వేసి సన్నగా తరగాలి. ప్యాన్‌లో నూనె వేసి జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు వేసి నిముషం పాటు గరిటెతో కదిపినత తర్వాత బంగాళదుంపల ముక్కలు వేసి కలుపుతూ వెల్లుల్లి రెబ్బలను వేయాలి. తరగిన టమోటా ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేశాక కలపాలి. వెంటనే పసుపు, ఉప్పు, కారంపొడి, జీలకర్ర పొడి, ధనియాల పొడి వేసి రెండు నిముషాల పాటు కంటిన్యూగా గరిటెతో కలుపుతూ ఉండాలి. ఆ తర్వాత ముప్పావు కప్పు నీళ్లు పోసి కలపాలి. ఆ తర్వాత ప్యాన్ మూత పెట్టి పదినిముషాల పాటు కుక్ చేయాలి. ప్యాన్ తీయగానే నూనె బుడగలు కనపడుతుంటాయి. బాగా ఉడికింది అని తెల్సుకోవటానికి బంగాళదుంప ముక్క ఉడికిందో లేదో చూస్తే సరిపోతుంది. బంగాళదుంపలు ఉడికిన వెంటనే మెంతి ఆకుల్ని వేసి బాగా కలపాలి. ఆ తర్వాత గరిటెతో కదుపుతూ మిశ్రమాన్ని కనీసం పది నిముషాల పాటు వేయిస్తే కూరలోని నీటిశాతం తగ్గిపోతుంది. చివరగా ఆమ్‌చూర్ పొడి, గరం మసాలా పొడి చల్లుకుని కలిపిన తర్వాత దించేసుకుంటే సరి.

మేతి మలై పనీర్



కావాల్సిన పదార్థాలు

మెంతి ఆకులు- పెద్ద కట్ట (సన్నగా తరగాలి), పనీర్ క్యూబ్స్- 11, నూనె- మూడు టేబుల్ స్పూన్లు, జీలకర్ర- టీస్పూన్, బిర్యానీ ఆకు- 1, లవంగాలు- 4, దాల్చిన చెక్క- చిన్నది, అల్లం, వెల్లుల్లి పేస్ట్- 1 టేబుల్ స్పూన్, పచ్చి మిరపకాయ- 1 (నిలువుగా సన్నగా తరగాలి), పెద్ద ఉల్లిపాయ- సగం (చిన్నగా తరగాలి), కారంపొడి- అరటీస్పూన్, పసుపు- పావు టీస్పూన్, ధనియాల పొడి- 1 టీస్పూన్, టమోటా గుజ్జు- 1 కప్పు, పాలు- ముప్పావు కప్పు, క్రీమ్- పావు కప్పు, ఉప్పు- తగినంత, గరం మసాలా- పావు టీస్పూన్,

తయారీ విధానం

బౌల్‌లో మెంతి ఆకులను వేసి అందులో సరిపడ ఉప్పు వేసి కప్పు నీళ్లను పోయాలి. స్పూన్‌తో కదిపిన తర్వాత 15 నిముషాల పాటు అలానే ఉంచాలి. నానిన మెంతి ఆకుల్ని గట్టిగా పిండితే నీళ్లు పోతాయి. ఈ మెంతి ఆకులను ప్యాన్‌లో వేసి రెండు నిముషాల పాటు కదుపుతూ వేయించాలి. వేయించిన ఈ మిశ్రమాన్ని ఒక ప్లేట్‌లో పక్కనబెట్టి ఉంచాలి.

ప్యాన్‌లో నూనె వేసిన తర్వాత జీలకర్ర, బిర్యానీ ఆకు, లవంగాలు, దాల్చిన చెక్క వేసి గరిటెతో మూడు నిముషాల పాటు కదుపుతూ ఉండాలి. అల్లం, వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిరపకాయ వేసి గరిటెతో నిముషం పాటు కదిపి ఉల్లిపాయ ముక్కలు వేసి కదిపిన తర్వాత కారంపొడి, పసుపు, ధనియాల పొడి వేసి నిముషం పాటు కలిపాక టమోట గుజ్జు వేయాలి. ముద్దలా అయ్యేంత వరకూ కదపాలి. ఇందులో ముందుగా వేయించిన మెంతి ఆకుల్ని వేయాలి. ఇందులో తగినంత ఉప్పు వేశాక పాలు పోయాలి. గరిటెతో కదిపిన తర్వాత క్రీమ్‌తో పాటు పావు కప్పు నీళ్లు వేసి మూడు నిముషాల పాటు కలిపితే కాస్త చిక్కగా తయారవుతుంది. ఇందులో పనీర్ ముక్కలను వేసి కలిపిన తర్వాత గరం మసాలా వేశాక సిమ్‌లో ఉంచి మూడు నిముషాల పాటు కుక్ చేయాలి. మేతి మలై పనీర్ కర్రీ రెడీ.

వైరల్

కుబేరులనే కోరుకోవాలట!

'పెళ్లంటే నూరేళ్ల పంట' అన్నాడు ఓ సినీ కవి. దానికి సరికొత్త అర్థాన్ని చెప్పింది ఈ దుబాయ్ భామ. 'కోరుకున్నవారి ఇంట అది పండాల'ంటే 'కాసుల పంట ఉన్నోడితోనే పెళ్లి పీటలు ఎక్కాల'ని కన్న కూతుళ్లకు హితబోధ చేస్తోంది ఈమె. 'మనిషి విలువ పెరిగేది ధనంవల్ల కాదు' అని నెటిజనులు మొత్తుకొంటుంటే... 'బాగా స్థితిమంతులైతేనే పిల్లల్ని కనాలి' అని మరో తీర్మానం చేసేసింది. ఇంతకీ ఈమె ఎవరనేగా..!

పేరు... సౌదీ అల్ నాడక్. 'ఇన్‌స్టాగ్రామ్' తదితర సామాజిక మాధ్యమాల్లో బాగా పాపులర్. అక్కడ ఆమెకు పన్నెండు లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. 'ఇన్‌స్టాగ్రామ్'లోని మూడు లక్షలమంది దీనికి అదనం. 'ఒకవేళ పిల్లలకు సౌకర్యవంతమైన జీవితం ఇవ్వలేనివారైతే... కనే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోండి' అంటూ సూచించిన సౌదీ... తన సంతానాన్ని అదే దారిలో నడిపిస్తోంది. 'జీవితం సాఫీగా సాగిపోవడానికి సంపన్నుడిని జీవిత భాగస్వామిగా ఎంచుకోండి. వీలైతే కుబేరుడిని పెళ్లాడండి' అని తన ఇద్దరు కూతుళ్లకూ మార్గదర్శకాలు విడుదల చేసింది. అలాగే... 'సంపదను ఎలా సృష్టించాలో తండ్రిని చూసి నేర్చుకోండ'ని తన కుమారులకూ సూచించింది.



దుబాయ్‌కి చెందిన 26 ఏళ్ల సౌదీ అల్ నాడక్ పుట్టుకతోనే సంపన్నురాలు. బ్రిటన్‌లో పుట్టిన ఆమె తన విలాసవంతమైన జీవితాన్ని ఎప్పటికప్పుడు ఫొటోలు, రీల్స్ రూపంలో సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో పంచుకొంటోంది. ఖరీదైన కార్లు, బడా షాపింగ్‌మాల్స్‌లో కొనే విలువైన వస్తువులు, విదేశీ ప్రయాణాలు... ఒకటే మిటి... ప్రతి సందర్భాన్నీ అప్‌డేట్ చేస్తుంటుంది.

సౌదీ భర్త జమాల్ అల్ నాడక్ కోట్లకు అధిపతి. ఎంతంటే ఇటీవల అందాల రాశి అయిన తన భార్య కోసం వారం రోజుల్లో పన్నెండు కోట్ల రూపాయలు ఖర్చు చేశాడట. ఆ విషయాన్ని సౌదీ గొప్పగా ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. అది చూసిన నెటిజనులు ఆమెపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. 'తన ఆర్థబలాన్ని ప్రదర్శించాలని ఆరాటపడుతోందని' ఆడి పోసుకొంటున్నారు. అవేవీ పట్టించుకోని సౌదీ... 'నన్ను చూసి మరింత అసూయపడండి' అన్నట్టు 'మా ఇంట్లో పిల్లి పిల్ల వైద్యం కోసమే వారంలో ఎనిమిదిన్నర లక్షలు ఖర్చు చేశాం' అని మరో పోస్ట్ పెట్టింది. మొత్తానికి ఈ వ్యాఖ్యలతో నిన్నటి వరకు దుబాయ్‌కే పరిమితమైన 'సంపన్నురాలు సౌదీ' కథ... ఇప్పుడు సరిహద్దులు దాటింది.



తామర తూడుతో భలే వంటకాలు



బిసాయికురాష్ట్రంద్ర కళానుకరిణో విభావితాః
సైంధవ నింబుకాభ్యామ్!
వికీర్యఖండీకృత శృంగవేర జలేపి వహ్నిం లఘు దీపయన్తి!

తామర మొక్క (నెలుంబో నూసిఫెరా) కాడలు నాళాల్లా ఉంటాయి. అందుకే 'మృణాళం' అని అంటారందుకే! తామరతూడు, తామరతీగ అనీ పిలుస్తారు. ఈ కాడను చక్రంలా కోసి చూస్తే, మధ్యలో గుండ్రంగా, చుట్టూ అండాకారపు సున్నాలు చుట్టి, పద్మం ముగ్గు వేసినట్టుగా దాని అమరిక ఉంటుంది. దీని 100 గ్రాముల గుజ్జులో 5 గ్రాముల పీచు (ఫైబరు) అల్లుకొని ఉంటుంది. ఇప్పుడు చాకచక్యంగా ఈ ఫైబరు నుంచి దారాన్ని తీసి, బట్టలు నేస్తున్నారు. 40వేల తామర తూడుల నుంచి తీసిన దారంతో 250 మీటర్ల వస్త్రం తయారవుతుందిట.

ఇందులో ఫైబరు తరువాత ప్రొటీన్ అధికంగా ఉంటుంది. కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, కాపర్ లాంటి ఖనిజాలు కూడా ఉన్నాయి. 'బి' కాంప్లెక్స్ అధికంగా గల మొక్క ఇది. విష దోషాల్ని హరించే గుణం ఈ కాడలకు ఉంది. వేడిని, జ్వరాన్ని, కఫాన్ని, రక్తంలో షుగరు స్థాయిని తగ్గిస్తుంది. తామర తూడుకు సహజంగా వగరు గుణం ఉంటుంది. అందుకనే ఇది షుగరు మీద పని చేస్తుంది. కఫాన్ని, స్థూలకాయాన్ని తగ్గిస్తుంది. బరువు తగ్గించే ఔషధాలలో ఇది ముఖ్యమైంది. సాధారణంగా చలవ చేసే ద్రవ్యాలు అంతో ఇంతో బరువును పెంచేవిగా ఉంటాయి. కానీ తామరతూడులు బరువుని, కొవ్వుని తగ్గిస్తాయి. కొంచెం ఆలస్యంగా అరుగుతుంది. అందుకని ఎక్కువగా తినకూడదు. కానీ... వెర్రి ఆకలిని తగ్గిస్తాయి.

వాత వ్యాధులున్న వారికి, అమితంగా వేడి చేసి రక్త స్రావం, పొడిదగ్గు, కళ్ల మంటలు, అరికాళ్ల మంటలు, తల తిరుగుడు లాంటి లక్షణాలతో బాధపడేవారికి తామరతూడు బాగా ఉపయోగపడుతుంది. కడుపులో ఎసిడిటీని తగ్గిస్తుంది. రక్తస్రావాన్ని నిలుపుతుంది. అయితే రక్తం పలుచబడేలా చేసే యాస్పిరిన్ లాంటి ఔషధాలు వాడేవారు దీన్ని తినవచ్చా అనే అంశం మీద రీసెర్చి లేదు. రక్తంలో ఉద్రేకాన్ని శాంతింప చేయటం దీని లక్ష్యం. గుండెకి మంచి చేస్తాయని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో పేర్కొన్నాడు.

తామరతూడు పీచుతో దీపారాధన వత్తులు చేస్తారు. తామర వత్తులు మార్కెట్‌లో కూడా దొరుకుతాయి. తామర తూడుల్ని 'బిసము' అని కూడా పిలుస్తారు. ఈ తూడుల్ని తిని జీవిస్తుంది కాబట్టి హంసని 'బిస భుక్తి' అంటారు. హంసల్లాగా మనమూ తామరతూడుల్ని తిని, బిస భుక్తులం కావచ్చు. ఆరోగ్యానికి చాలా మంచిది. సన్నగా చక్రాల్లా తరిగి, సలాదుల్లో కలుపుకొని తింటారు. ఎండబెట్టి వరుగులు చేసుకుని, వేగించుకునీ తింటారు. ఎండినవి, పచ్చివి కూడా ఆన్‌లైన్‌లో దొరుకుతున్నాయి. ఎండిన వాటిని తిరిగి నీళ్లలో నానబెట్టి వంటకాల్లో ఉపయోగించవచ్చు.



ఆకలిని పెంచే సలాదు...

తామర కాడల్ని సన్నగా చక్రాల్లా తరగండి. శుభ్రంగా కడిగి, పొడి వస్త్రంతో తుడిచి, ఒక పాత్రలోకి తీసుకోండి. తగినంత సైంధవ లవణం, నిమ్మ రసం, అల్లం రసం కలిపి మూత పెట్టి ఊరనివ్వండి. ఈ ముక్కలు తక్షణం జీర్ణశక్తిని పెంచుతాయి. కొద్ది రోజులు నిల్వ ఉంటాయి. అల్లం, నిమ్మ రసాలలో ఊరిన ఈ ముక్కలు పైత్యాన్ని హరిస్తాయి. సలాదుగా తినదగినవి.

ఇగురు కూర...

తామర తూడుల్ని చక్రాల్లా తరిగి ఉప్పు చల్లి, చేత్తో గట్టిగా పిసికి నీటిని తీసేయాలి. తాలింపు గింజలు వేగించి అందులో దీన్ని కలిపి మూతబెట్టి, కాసేపు మగ్గనిస్తే కమ్మని ఇగురు కూర తయారవుతుంది. చాలా ఆరోగ్యదాయకమైన వంటకం ఇది.

పొడి కూర...

ఉడికించిన పెసరపప్పు లేదా కందిపప్పుని ఇలా తయారైన కూరలో కలిపి, బాండీలో కొద్దిగా నెయ్యి వేసి వేగిస్తే తామరతూడు పొడికూర సిద్ధమవుతుంది. ఇష్టమైనవారు ఇందులో తెలకపిండి అంటే... నువ్వుల నూనె తీసేయగా మిగిలిన చెక్కను దంచి ఆ పిండిని కలిపితే చాలా కమ్మగా ఉంటుంది. రుచి కోసం రెండు వెల్లుల్లి రెబ్బలు చేర్చుకోవచ్చు.

పచ్చడి...

చక్రాల్లా తరిగి, ఉప్పు వేసి, నీటిని పిండేసిన తామర తూడుల్ని వేగించిన నూనె తాలింపులో వేసి మగ్గనివ్వాలి. దాన్ని మెత్తగా మిక్సీ పట్టి కొత్తిమీరతో అలంకరించిన తామర తూడు పచ్చడి చాలా కమ్మగా ఉంటుంది.

పెరుగు పచ్చడి...

తరిగిన తామరతూడు ముక్కల్ని పెరుగులో కలిపి, తగినంత ఉప్పు, కొద్దిగా వాము పొడి లేదా ఆవపిండి కలిపి తాలింపు పెట్టాలి. ఈ పెరుగు పచ్చడి గుణవత్తరంగా ఉంటుంది. అమీబియాసిస్, పేగుపూత లాంటి వ్యాధుల్లో బాగా ఉపయోగపడుతుంది.

తామరతూడు పప్పు...

పెసరపప్పు లేదా కందిపప్పు తగినంత తీసుకుని, సన్నగా, చక్రాల్లా తరిగిన తామరకాడ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు కలిపి ఉడికించండి. ముద్దగా ఉడికిన తరువాత ఒక రెబ్బ చింతపండు, ఉప్పు, కారం కలిపి తాలింపు పెడితే తామరతూడు పప్పు సిద్ధం. మంచి ప్రొటీన్ కలిగిన ఆహార పదార్థం ఇది.

ఇంకా...

తామర తూడుతో పాయసం కూడా కాచుకోవచ్చు. హల్వా చేసుకోవచ్చు. పులుసులో ముక్కలుగా వేసుకోవచ్చు. దీని రసంతో చారు కాచుకోవచ్చు. కేరెట్, కీరా, ముల్లంగి, తామరతూడు ముక్కల్ని మిక్సీ పట్టి జ్యూస్ తీసుకుని, నెలపాటు రోజూ రెండు పూటలా తాగుతుంటే... బలహీనంగా ఉన్నవారు తక్షణ శక్తిమంతులు అవుతారు. జీర్ణాశయ, రక్తస్రావ వ్యాధులు తగ్గుతాయి. మొలలతో బాధపడేవారికి మంచి ఔషధం ఇది. కేన్సర్ లాంటి వ్యాధులకు దీర్ఘకాల చికిత్స తీసుకుంటున్నవారికి ఇది ఎంతో మేలు చేస్తుంది.

• గంగరాజు అరుణాదేవి

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XZZSrt1 లో చదవండి.



ఫైనల్లో రష్మిక జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ 35కే టెన్నిస్ టోర్నమెంట్ డబుల్స్ ఫైనల్లో శ్రీవల్లి రష్మిక జోడీ ప్రవేశించింది. ఇండోర్‌లో శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి రష్మిక-వైదేహి చౌధరి జోడీ 6-1, 7-6తో భారత్‌కే చెందిన జీల్ దేశాయ్-సహజ జంటపై విజయం సాధించింది. ఇక, సింగిల్స్‌లో రష్మిక క్వార్టర్స్ చేరింది. ప్రీక్వార్టర్స్‌లో రష్మిక 6-0, 6-0తో జస్టినా మికుల్స్‌కైట్ (లిథువేనియా)పై గెలిచింది.

భళా.. బెంగళూరు



- తొలిసారి డబ్ల్యూపీఎల్ ఫైనల్‌కు
- ఎలిమినేటర్‌లో ముంబైపై విజయం
- రేపు ఢిల్లీతో టైటిల్‌ఫైట్



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌కు ఝలక్. ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన ఎలిమినేటర్ పోరులో.. సమష్టి బౌలింగ్ ప్రదర్శనతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు స్వల్ప లక్ష్యాన్ని అద్భుతంగా కాపాడుకుంది. అటు చివరి మూడు ఓవర్లలో 20 పరుగులను సాధించలేక ముంబై బోల్తా పడింది. దీంతో 5 పరుగుల తేడాతో గెలిచిన స్మృతి మంధాన సేన.. తొలిసారి లీగ్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆదివారం జరిగే టైటిల్‌ఫైట్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లకు 135 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఎలిస్ పెర్రీ (66) అర్ధ సెంచరీతో ఆదుకుంది. ప్రత్యర్థి ముందు భారీ స్కోరును ఉంచాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్‌సీబీ తొలి ఓవర్‌ను మూడు ఫోర్లతో ఆరంభించింది. కానీ ఆ తర్వాత మూడు ఓవర్లలోనే సోఫీ డివైన్ (10), మంధాన (10), దిశా కసత్ (0) వికెట్లను కోల్పోయింది. అయితే 23/3 స్కోరుతో తడబడిన జట్టును ఎప్పటిలాగే పెర్రీ ఆదుకుంది. ఓవైపు వికెట్లు పడుతున్నా మెరుపు ఆటతీరుతో 40 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. రిచా ఘోష్ (14)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు, మోలినెక్స్ (11)తో ఆరో వికెట్‌కు 42 రన్స్ జోడించింది. ఆఖరి ఓవర్‌లో పెర్రీ వెనుదిరిగినా.. ఆమె దూకుడుతో చివరి ఐదు ఓవర్లలో 51 రన్స్ సమకూరాయి.

బౌలర్ల కట్టడి: స్వల్ప ఛేదనే.. బరిలోకి దిగిన ప్రతీ బ్యాటర్ పర్వాలేదనిపించినా.. ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 130 పరుగులకే పరిమితమై ఓడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (33) టాప్ స్కోరర్. తొలి 8 ఓవర్లలో 50 పరుగులు చేసిన ముంబై ఓపెనర్లు మాథ్యూస్ (15), యాస్తిక (19) వికెట్లను కోల్పోయింది. ఇక, సివర్ (23), హర్మన్ ఆదుకునే ప్రయత్నం చేశారు. అటు హర్మన్‌కు జతగా అమెలియా కెర్ (27 నాటౌట్) కూడా కుదురుకోవడంతో ముంబైదే గెలుపులా కనిపించింది. అయితే 18వ ఓవర్‌లో హర్మన్‌ను శ్రేయాంక అవుట్ చేయడంతో అంతా తారుమారైంది. చివరి 2 ఓవర్లలో 16 పరుగులు కావాల్సిన వేళ హైడ్రామా నెలకొంది. 19వ ఓవర్‌లో సజన స్టంపౌట్ కాగా.. 6 బంతుల్లో సమీకరణం 12 రన్స్‌గా మారింది. క్రీజులో కెర్ ఉండడంతో ముంబై ఆశలు వదులుకోలేదు. కానీ స్పిన్నర్ శోభన.. పూజా వస్త్రాకర్ (4) వికెట్‌తో పాటు 6 పరుగులే ఇవ్వడంతో ఆర్‌సీబీ సంబరాల్లో మునిగింది.

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 135/6 (ఎలిస్ పెర్రీ 66, వేర్‌హమ్ 18 నాటౌట్; మాథ్యూస్ 2/18, సివర్ 2/18, సైకా ఇషాక్ 2/27)
ముంబై: 20 ఓవర్లలో 130/6 (హర్మన్ 33, కెర్ 27 నాటౌట్, సివర్ 23; శ్రేయాంక 2/16).

స్టాప్ క్లాక్ అమల్లోకి.. ఐసీసీ నిర్ణయం

దుబాయ్: అంతర్జాతీయ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఇకనుంచి స్టాప్ క్లాక్ నిబంధన తప్పనిసరి కానుంది. ఈ మేరకు దుబాయ్‌లో జరుగుతున్న ఐసీసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గత డిసెంబరు నుంచి పురుషుల క్రికెట్‌లో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ వరకు గడువు ఉన్నప్పటికీ ఇప్పటికే ఫలితం సానుకూలంగా వచ్చినట్టు ఐసీసీ పేర్కొంది. అందుకే రానున్న టీ20 వరల్డ్‌కప్ ద్వారా స్టాప్ క్లాక్‌ను అధికారికంగా అమలు చేయబోతున్నారు.

స్టాప్ క్లాక్ అంటే..: ఫీల్డింగ్ జట్టు ఓ ఓవర్‌ను ముగించిన 60 సెకన్లలోపే మరో ఓవర్‌ను ప్రారంభించాలి. ఇందుకుగాను మైదానంలో ఎలక్ట్రానిక్ బోర్డుపై 60 నుంచి 0 వరకు కౌంట్‌డౌన్ వస్తుంది. ఒకవేళ రెండుసార్లు ఈ రూల్‌ను అతిక్రమిస్తే మాత్రం ప్రత్యర్థి జట్టుకు 5 పరుగులు అదనంగా ఇస్తారు. అయితే ఓవర్ మధ్యలో మరో బ్యాటర్ క్రీజులోకి వచ్చినప్పుడు, బ్యాటర్ గాయపడిన సందర్భాల్లో మినహాయింపు ఉంటుంది. మరోవైపు టీ20 వరల్డ్‌కప్ సెమీస్, ఫైనల్‌కు రిజర్వ్ డేలను కూడా కేటాయించారు.

2026 టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫికేషన్ ఇలా..: భారత్, శ్రీలంక దేశాల్లో జరిగే 2026 టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫికేషన్ ప్రక్రియకు ఐసీసీ ఆమోదం తెలిపింది. ఈ టోర్నీలో 20 జట్లు పాల్గొంటాయి. వీటిలో ఆతిథ్య జట్లుగా భారత్, శ్రీలంకతో పాటు ఈఏడాది జరిగే వరల్డ్‌కప్‌లో టాప్-8లో నిలిచిన జట్లే కాకుండా, మిగిలిన నాలుగు జట్లకు ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా అర్హత కల్పిస్తారు. మరో 8 జట్లను ఐసీసీ రీజినల్ క్వాలిఫయర్ మ్యాచ్‌ల ద్వారా నిర్ణయిస్తారు.

ఎంగిడి అవుట్..ఫ్రేజర్ ఇన్

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆరంభానికి ముందే ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ దూరమవగా, తాజాగా ఆ జట్టు పేసర్, సఫారీ బౌలర్ లుంగి ఎంగిడి లీగ్ నుంచి తప్పుకొన్నాడు. గాయం కారణంగా ఐపీఎల్‌లో ఆడడం లేదని ఎంగిడి ప్రకటించాడు. అతని స్థానంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌ను తీసుకున్నట్టు ఢిల్లీ ప్రకటించింది. కనీస ధర రూ.50 లక్షలు వెచ్చించి జేక్ ఫ్రేజర్‌ను ఢిల్లీ తీసుకుంది.

అంతా మా ఇష్టం!

సెలెక్షన్స్‌లో ఒక సామాజిక వర్గానికే ప్రాధాన్యం

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)కు ఒకప్పుడు దేశంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవ మర్యాదలు ఉండేవి. ముఖ్యంగా క్రికెటర్ల సెలెక్షన్స్ విషయంలో ఇతర రాష్ట్రాల క్రికెట్ బోర్డులకు ఆదర్శప్రాయంగా ఉండేది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఏసీఏపై ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి కన్ను పడ్డాక అందులోని వ్యవస్థలన్నీ ఒక్కొక్కటిగా నీరుగారడం మొదలైంది. తొలుత ఏసీఏ పాలకవర్గాన్ని గుప్పిటపట్టిన సాయిరెడ్డి అండ్ కో.. ఆ తర్వాత అన్ని విభాగాల్లోకి చొరబడడం ప్రారంభమైంది. ఇందులో మనోళ్లే ఉండాలి, మన సామాజిక వర్గానికి, పార్టీ నాయకులకే ప్రాధాన్యమివ్వాలన్న ధోరణితో కొందరు నేతలు తలదూర్చడంతో అధికార పార్టీకి అనుబంధ వ్యవస్థగా మారిందన్న అపఖ్యాతిని ఏసీఏ మూటగట్టుకుంటోంది.



పైరవీలతోనే జట్టులో చోటు!

అస్మదీయులు లేని జిల్లాల్లో అడ్‌హాక్ కమిటీలు

ప్రతిభకు పాతర, సిఫార్సులకు అందలం

మసకబారుతున్న ఏసీఏ ప్రతిష్ఠ

రంజీ ట్రోఫీ సందర్భంగా ఇటీవల వెలుగు చూసిన హనుమ విహారి ఎపిసోడ్ ఏసీఏలో అధికార పార్టీ పెత్తనం ఏ స్థాయిలో ఉందో కళ్లకు కట్టింది. కీలకమైన రంజీ క్వార్టర్స్ నుంచి వైస్ కెప్టెన్ షేక్ రషీద్‌ను ఎందుకు తప్పించారో ఏసీఏ పెద్దలకే తెలియాలి. అండర్-19 వరల్డ్‌కప్ నెగ్గిన భారత జట్టుకు రషీద్ ఉప సారథి. ఈ సీజన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఆంధ్ర తరఫున అత్యధిక పరుగులు సాధించిన మూడో బ్యాటర్. టీ20ల్లో అయితే, అతడే నెంబర్ వన్. అలాంటి రషీద్‌ను తుది జట్టు నుంచి తప్పించడంతో క్వార్టర్స్‌లో ఆడిన ఆంధ్ర జట్టు బ్యాటింగ్ లైనప్‌లో సమతుల్యం దెబ్బతిని, ఓటమికి దారితీసింది. ఇక, అండర్-14, 16, 19, 23 జట్ల ఎంపికలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఒత్తిళ్లు, పైరవీలు మితిమీరాయన్న విమర్శలున్నాయి. పెద్దల అహంకార పోకడలతో ప్రతిభావంతులైన క్రికెటర్లకు అన్యాయం జరుగుతోందని పలు క్రికెట్ సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. సిఫార్సులుంటే జట్టులో చోటు ఖాయమన్న విషయం ఆటగాళ్లలో బాగా ప్రబలిందని, ఇది ఆంధ్ర క్రికెట్‌కు మంచిది కాదని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డగోలు నియామకాలు..

ఏసీఏ జూనియర్ సెలెక్షన్ కమిటీలో చైర్మన్ మినహా మిగిలిన సభ్యులెవరూ అర్హత, నిబంధనలకు అనుగుణంగా ఎంపికైన వారు కాదు. సెలెక్షన్ కమిటీలోని సాగర్, నాగార్జున, కోటారెడ్డికి సెలెక్టర్లకు ఉండాల్సిన అర్హతలు లేకపోయినా తీసుకున్నారనే విమర్శలున్నాయి. అపెక్స్ కౌన్సిల్‌లో క్రికెటర్ల సంఘం నుంచి గీత ప్రాతినిథ్యం వహిస్తుండగా, ఆమె భర్త జేటీ యాదవ్‌ను రంజీ జట్టు ట్రైనర్‌గా నియమించారు. రంజీ జట్టుకు ఒక ప్లేయర్‌ను ఎంపిక చేసే అవకాశం సెక్రటరీకి ఇవ్వాల్సిందిగా గత ఏజీఎంలో నిర్ణయం తీసుకున్నారని సమాచారం. దీనికి అనుగుణంగానే రంజీ ట్రోఫీ జరుగుతున్నప్పుడు ఒక రాయలసీమ ఆటగాడిని ఈ సీజన్‌కు జట్టులోకి తీసుకుంటున్నట్టు సెక్రటరీ ఈమెయిల్ నుంచి సందేశం రావడంతో అంతా అవాక్కయ్యారు. సెలెక్టర్ల పనిని సెక్రటరీనే చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

భోగాపురం 'రియల్' స్కెచ్?

విశాఖపట్నం, మూలపాడులోని అంతర్జాతీయ స్టేడియాల ఆధునికీకరణ, అభివృద్ధి పనులను గాలికొదిలేసి కొత్తగా భోగాపురం సమీపంలో రూ.300 కోట్ల వ్యయంతో మరో స్టేడియాన్ని నిర్మించేందుకు సాయిరెడ్డి అండ్ కో ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. అధికారిక ప్రకటనకు ముందే ఆ చుట్టు పక్కల భూములు కొనుగోలు చేసి, తద్వారా వాటి విలువ పెంపునకు తెరతీసినట్టు చెబుతున్నారు. విశాఖ, మూలపాడు స్టేడియాల్లో పాడైపోయిన సీట్ల మరమ్మతు, ఫ్లడ్ లైట్ల ఏర్పాటుతో పాటు మరికొన్ని పెండింగ్ పనులున్నాయి. ఈ పనుల్ని వదిలేసి రియల్ దందా చేసేందుకు భోగాపురం వద్ద కొత్త స్టేడియం నిర్మిస్తామంటూ లీకులిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

◆ ఎక్స్‌లెన్స్ అకాడమీలకు పాతర

బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ చొరవతో ఒకప్పుడు రాష్ట్రంలో నాలుగు ఎక్స్‌లెన్స్ అకాడమీలు ఏర్పాటయ్యాయి. విజయనగరంలో నార్త్‌జోన్, మంగళగిరిలో సెంట్రల్ జోన్, కడపలో సౌత్‌జోన్, గుంటూరులో మహిళల కోసం ప్రత్యేకంగా అకాడమీలను ఏర్పాటు చేశారు. సాయిరెడ్డి బృందం వచ్చాక ఈ అకాడమీలకు మంగళం పాడారు. దీంతో ప్రతిభావంతులైన నిరుపేద క్రికెటర్లకు ఆసరా పోయింది.

◆ కడపపై మోజు.. ఇతర జిల్లాలపై కక్ష

సీఎం జగన్‌మోహన్ రెడ్డి సొంత జిల్లా కావడంతో ప్రస్తుత ఏసీఏ పెద్దలు కడపపై వల్లమాలిన ప్రేమ కనబరుస్తున్నారు. ఇప్పటికే వైఎస్ రాజారెడ్డి పేరిట కడపలో ఒక స్టేడియం ఉండగా.. దీనికి అదనంగా ఇప్పుడు సీఎం సొంత నియోజకవర్గం పులివెందులలో దాదాపు రూ.15 కోట్లతో మరో స్టేడియాన్ని కడుతున్నారు. ఈ రెండు కాకుండా కడప జిల్లాలో రెండు గ్రౌండ్లను ఏసీఏ లీజుకు తీసుకుంది. కడప పరిస్థితి ఇలా ఉంటే శ్రీకాకుళం, ఉమ్మడి గోదావరి జిల్లాలు, నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో ఏసీఏకు సొంత మైదానాలు లేవు. పాలకుల మెప్పు, కొందరి స్వలాభం కోసం కొత్త స్టేడియాలకు పునాది వేస్తే ఒనకూరేది ఏముంటుందన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

◆ ప్రకాశంలో బరితెగింపు

లోధా సిఫార్సుల ప్రకారం ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ సంఘానికి గత మార్చిలో కొత్త కార్యవర్గం కొలువుదీరింది. అయితే సంఘంలోని ముఖ్యులు తమ సామాజిక వర్గం వారు కాదని స్థానిక నేతలైన వెంకటాద్రి రెడ్డి, రామకృష్ణా రెడ్డి ఆ కార్యవర్గాన్ని కూలదోయించారని ఆరోపణలు ఉన్నాయి. వీరు వైఎస్సార్‌సీపీ నేతలు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి ప్రధాన అనుచరులు కావడంతో తమ పరపతితో ఏసీఏ పెద్దలపై ఒత్తిడి తీసుకొచ్చి అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేయించారు. అక్కడి నుంచి వీరి అక్రమాలకు అడ్డూఅపు లేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2008 నుంచి సీఎస్‌ఆర్ శర్మ కళాశాలలో దాదాపు రూ.కోటి వ్యయంతో అభివృద్ధి చేసిన మైదానాన్ని వదిలిపెట్టి, కొత్తగా ఒంగోలు మంగమూరు రోడ్డు వైపు రూ.50 లక్షలు వెచ్చించి, ఎకరం భూమిని లీజుకు తీసుకున్నారు. ఇందులో మళ్లీ కొత్తగా నెట్స్‌తో పాటు అన్ని పనులు చేస్తున్నారు. ఈ పనుల్లో అడ్‌హక్ కమిటీ సభ్యుడిగా ఉన్న వెంకటాద్రి రెడ్డి రూ.19 లక్షలు తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు మళ్లించుకున్నట్టు ఆ వర్గానికే చెందిన రామకృష్ణా రెడ్డి ఏసీఏకు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఒక్క ప్రకాశం జిల్లాలోనే కాదు కర్నూలు, కృష్ణా జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. తమ సామాజికవర్గం వారు, అస్మదీయులు లేని చోట అడ్‌హాక్ కమిటీలు వేసి, అధికారాన్ని చెలాయిస్తున్నారు. తాజాగా కర్నూలు క్రికెట్ సంఘం అడ్‌హాక్ కమిటీ వ్యవహారంలో ఏసీఏకు చుక్కెదురైంది. ఇక, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్ రెడ్డి అన్నీ తానై చిత్తూరు జిల్లా క్రికెట్ సంఘాన్ని నడిపిస్తున్నాడన్న ఆరోపణలున్నాయి.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)



వడ్డీ రేట్లు ఇప్పట్లో తగ్గే అవకాశం లేదు

హైదరాబాద్‌లో మరో నాలుగు శాఖలు
యస్ బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్

హైదరాబాద్: దేశంలో వడ్డీ రేట్లు ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదని యస్ బ్యాంక్ ఎండీ, సీఈఓ ప్రశాంత్ కుమార్ చెప్పారు. అలా అని వడ్డీ రేట్లు మరింత పెరిగే అవకాశమూ లేదన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం ఇంకా అధికంగానే ఉన్నందున భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇప్పట్లో రెపో రేటు తగ్గించక పోవచ్చన్నారు. పరిస్థితులు అనుకూలిస్తే వచ్చే ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నుంచి ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించే అవకాశం ఉందన్నారు. వడ్డీ రేట్ల తగ్గింపునకు రిటైల్ ద్రవ్యోల్బణమే పెద్ద అడ్డంకి అన్నారు. సంక్షోభ సమయంలో తమ బ్యాంకును ఆదుకున్న ఎస్‌బీఐతో సహా ఏ సంస్థా ప్రస్తుతం యస్ బ్యాంకులోని తమ వాటాలను అమ్మే యోచనలో లేవన్నారు.

మరింత విస్తరణ: ప్రస్తుతం హైదరాబాద్‌లో తమకు ఉన్న 25 శాఖలను ఈ నెలాఖరుకల్లా 29 శాఖలకు విస్తరిస్తున్నట్టు ప్రశాంత్ చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) హైదరాబాద్‌లో మరో రెండు శాఖలు ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. రుణాల మంజూరులో ఎంఎస్ఎంఈలు, మధ్య తరహా కంపెనీలే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రస్తుతం తమ మొత్తం రుణ పోర్టుఫోలియోలో ఎంఎస్ఎంఈల వాటా 30 శాతంగా ఉన్నట్టు చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం దీన్ని 35 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

తెలంగాణలో ముత్తూట్ మైక్రోఫిన్

హైదరాబాద్: ఆర్థిక సేవల రంగంలోని ముత్తూట్ మైక్రోఫిన్ తెలంగాణలో అడుగు పెడుతోంది. తొలి విడతగా తెలంగాణలో నాలుగు బ్రాంచీలు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. అవి భువనగిరి, జనగాం, హనుమకొండ, పరకాల. తదుపరి దశలో ఈ ఏడాది జూన్ నాటికి ఆంధ్రప్రదేశ్‌లో కూడా అడుగుపెట్టనున్నట్టు కంపెనీ తెలిపింది. పంపిణీ నెట్‌వర్క్‌ను విస్తరించి కొత్త కస్టమర్లను ఆకట్టుకునే వ్యూహంలో తెలంగాణలో మరింతగా కార్యకలాపాలు విస్తరించడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రవేశించబోతున్నామని ముత్తూట్ మైక్రోఫిన్ సీఈఓ సదాఫ్ సయీద్ తెలిపారు. దేశంలోని 18 రాష్ట్రాలకు చెందిన 346 జిల్లాల్లో 1,424 శాఖలు కలిగి ఉన్న ఈ కంపెనీకి 32.8 లక్షల మంది క్రియాశీల కస్టమర్లున్నారు.

టెస్లా ఎంట్రీకి లైన్ క్లియర్!

ఈవీ పాలసీకి కేంద్ర ప్రభుత్వ ఆమోదం .. కనీసం 50 కోట్ల డాలర్ల పెట్టుబడితో దేశంలో ప్లాంట్ ఏర్పాటు చేసే కంపెనీలకు దిగుమతి సుంకం రాయితీ



న్యూఢిల్లీ: టెస్లా సహా పలు అంతర్జాతీయ విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీ కంపెనీలు భారత్‌లోకి ప్రవేశించేందుకు మార్గం సుగమం అయింది. ఈ కంపెనీలను ఆకర్షించేందుకు రూపొందించిన ఈవీ పాలసీకి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ రంగంలోకి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు ఆధునిక సాంకేతికతతో కూడిన ఈవీల తయారీకి భారత్‌ను కేంద్రంగా తీర్చిదిద్దడమే ఈ పాలసీ ముఖ్యోద్దేశం. ఈ పాలసీతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగంలో భారత్ విశ్వ శక్తిగా అవతరించనుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ధీమా వ్యక్తం చేశారు. "ఈ పథకం ద్వారా ప్రపంచ కంపెనీలను భారత్‌కు ఆహ్వానిస్తున్నాం. దేశంలో ఈవీల తయారీ త్వరితగతిన విస్తరించాలి. అలాగే, దేశంలో తయారైన ఈవీలను ప్రపంచానికి ఎగుమతి చేయగలగాలి. తద్వారా ఈ రంగంలో మనం విశ్వ శక్తిగా ఎదగాలి. ఈ రంగం లక్షలాది మందికి ఉపాధి కల్పించడంతో పాటు లక్షల కోట్ల రూపాయల టర్నోవర్‌ను సృష్టించగలద"ని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

దేశంలో ఈవీ మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోంది. దాంతో అంతర్జాతీయ కంపెనీలు భారత్‌లో ఎంట్రీపై కన్నేశాయి. వియత్నాంకు చెందిన ఈవీ కంపెనీ విన్‌ఫాస్ట్ రూ.16,000 కోట్ల పెట్టుబడులతో తమిళనాడులో విద్యుత్ వాహనాలు, బ్యాటరీల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. 2030 నాటికి భారత్‌లో ఈవీల వార్షిక విక్రయాలు కోటి యూనిట్లకు చేరుకోవచ్చని అంచనా. అలాగే, ఈ రంగం 5 కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించవచ్చని 2022-23 ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఇండస్ట్రీ వర్గాల ప్రకారం.. 2022లో ఈవీల విక్రయాలు 10 లక్షల యూనిట్ల మైలురాయికి చేరుకున్నాయి. దేశీయ ఎలక్ట్రిక్ కార్ల కంపెనీల్లో టాటా మోటార్స్ అగ్రగామిగా ఉంది. ప్రస్తుతం ఈ కంపెనీ నెగ్జాన్, టియాగో, టిగోర్ మోడళ్లలో ఎలక్ట్రిక్ వెర్షన్లను విక్రయిస్తోంది.

దరఖాస్తు ఇలా..

పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య డిపార్ట్‌మెంట్ (డీపీఐఐటీ) కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ పాలసీ వివరాలను మీడియాకు వివరించారు. భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పథకం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఆసక్తి కలిగిన కంపెనీలు పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని.. దిగుమతి అవసరాలతో పాటు పలు వివరాలను అప్లికేషన్‌లో పొందుపర్చాలని అన్నారు. టెస్లా సహా పలు అంతర్జాతీయ ఈవీ కంపెనీలు భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు ఆసక్తిగా ఉన్నాయన్నారు. ఇంకా ఏమన్నారంటే..

- ఈ పథకం నోటిఫికేషన్ విడుదల చేసిన 120 (అంతకంటే ఎక్కువ) రోజుల్లోగా దరఖాస్తులను ఆహ్వానించడం జరుగుతుంది. నోటీసు ద్వారా అప్లికేషన్లను ఆహ్వానించనున్నారు. 120 (అంతకంటే ఎక్కువ) రోజుల్లోగా దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది.
- స్వీకరించిన దరఖాస్తులపై వాటిని సమర్పించిన లేదా ప్రభుత్వం కోరిన మేరకు వివరణ ఇచ్చిన 120 రోజుల్లో నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.
- పథకం తొలి రెండేళ్లలో అవసరమైనప్పుడల్లా దరఖాస్తులను ఆహ్వానించే హక్కు ప్రభుత్వం కలిగి ఉంటుంది.
- ప్లాంట్ ఏర్పాటు కోసం భూమి సేకరణకయ్యే వ్యయం పెట్టుబడి పరిధిలోకి రాదు. ఈ పథకం ప్రయోజనాల కోసం దరఖాస్తు చేసుకునే గ్లోబల్ కంపెనీలు కనీసం రూ.10,000 కోట్ల వార్షికాదాయం కలిగి ఉండాలి.
- ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (పీఎంఏ) ఈ పథకాన్ని అమలు చేయనుంది. కంపెనీలకు పీఎంఏ కార్యదర్శి, నిర్వాహక, అమలు మద్దతును అందించనుంది.
- దిగుమతి సుంకం రాయితీ కోసం ఆమోదిత దరఖాస్తుదారులు యేటేటా దిగుమతి అప్లికేషన్‌ను సమర్పించాలి.

పాలసీ మార్గదర్శకాలు

- కనీసం 50 కోట్ల డాలర్ల (సుమారు రూ.4,150 కోట్లు) పెట్టుబడితో భారత్‌లో ఈవీల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే గ్లోబల్ కంపెనీలకు ప్రభుత్వం దిగుమతి సుంకం రాయితీలు కల్పించనుంది.
- కంపెనీలకు భారీ పరిశ్రమల శాఖ నుంచి అనుమతి లభించిన మూడేళ్లలో ప్లాంట్‌లో తయారీ ప్రారంభించాల్సి ఉంటుంది. అలాగే మూడేళ్లలో 25 శాతం కాంపొనెంట్లను దేశీయంగా సేకరించాల్సి ఉంటుంది. ఐదేళ్లలో ఈవాటాను 50 శాతానికి పెంచాల్సి ఉంటుంది.
- కంపెనీకి అనుమతి మంజూరు చేసిన తేదీ నుంచి ఐదేళ్ల వరకు 35,000 డాలర్లు (రూ.29 లక్షలు) అంతకు పైగా విలువ చేసే కార్లను 15 శాతం కస్టమ్స్ సుంకం చెల్లించి దిగుమతి చేసుకునేందుకు అనుమతించనున్నారు. ప్రస్తుతం కంప్లీట్లీ బిల్ట్ యూనిట్ (సీబీయూ) కార్ల దిగుమతిపై చెల్లించాల్సిన కస్టమ్స్ సుంకం.. ఇంజన్ సైజు, ధర, బీమా, రవాణా విలువ ఆధారంగా 70-100 శాతం స్థాయిలో ఉంది.
- గరిష్ఠంగా 8,000 యూనిట్ల వరకు సుంకం రాయితీతో దిగుమతి చేసుకునే వీలుంటుంది. వినియోగించుకోని వార్షిక దిగుమతి పరిమితిని మరుసటి ఏడాదికి బదిలీ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు.
- కనీస పెట్టుబడితో పాటు దేశీయంగా విడిభాగాల సమీకరణ నిబంధనలను పాటింపునకు హామీగా బ్యాంక్ గ్యారెంటీ సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ కంపెనీ ఈ నిబంధనలను పాటించడంలో విఫలమైతే బ్యాంక్ గ్యారెంటీ అమలు చేయబడుతుంది.

25 కంపెనీల షేర్లలో టీ+0 సెటిల్‌మెంట్: సెబీ

ముంబై: మార్కెట్ నియంత్రణ మండలి సెబీ.. శుక్రవారం నాటి బోర్డు సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పరిమిత బ్రోకర్ల ద్వారా 25 కంపెనీల షేర్లలో బీటా వెర్షన్‌లో ఆప్షనల్ టీ+0 సెటిల్‌మెంట్‌ను అనుమతించాలని నిర్ణయించింది. దీంతో ఈ షేర్ల అమ్మకం, కొనుగోళ్లు, చెల్లింపుల ప్రక్రియ అదే రోజు పూర్తి అవుతుంది. మూడు, ఆరు నెలల తర్వాత దీన్ని సమీక్షించి సెబీ అవసరమైన నిర్ణయాలు తీసుకుంటుంది. దీనికి తోడు పబ్లిక్ లేదా రైట్స్ ఇష్యూల ద్వారా ఈక్విటీ షేర్లు జారీ చేసే కంపెనీలు.. సమీకరించే మొత్తంలో ఒక శాతం డిపాజిట్ చేయాలనే నిబంధనను ఎత్తివేసేందుకూ సెబీ బోర్డు ఆమోదం తెలిపింది. ఎఫ్‌పీఐలు ఎప్పటికప్పుడు వెల్లడించాల్సిన అంశాలపైనా సడలింపు ఇచ్చింది. మార్కెట్ లావాదేవీలను మరింత సులభతరం చేసేందుకు సెబీ ఈ చర్యలు తీసుకుంది. ఇతర ప్రధాన నిర్ణయాలు..

- కొన్ని షరతులకు లోబడి దేశంలోని తమ మొత్తం పెట్టుబడుల్లో 50 శాతానికిపైగా ఏదైనా కార్పొరేట్ గ్రూప్‌లో మదుపు చేసిన ఎఫ్‌పీఐలకు ఆ విషయం వెల్లడి నుంచి మినహాయింపు.
- ఎఫ్‌పీఐల యాజమాన్య మార్పులను నిర్దిష్ట సమయంలోగా వెల్లడించాలన్న నిబంధనల్లో సడలింపు.
- లిస్టెడ్ కంపెనీల షేర్లపై వచ్చే పుకార్ల పరిశీలనపై ఇక ఒకే విధానం.
- పుకార్ల ఆధారంగా షేర్ల ధరల్లో మార్పులు చోటు చేసుకుంటే 24 గంటల్లో ఆ లావాదేవీని నిర్ధారించాలి.
- మార్కెట్ పుకార్లపై లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్లు, డైరెక్టర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయి వ్యక్తులు సకాలంలో స్పందించాలి.

నష్టాల వారం

వారాంతం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 454 పాయింట్లు డౌన్

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో మళ్లీ నష్టాలు చవిచూశాయి. ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో, ఎనర్జీ రంగ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణతో పాటు స్మాల్, మిడ్‌క్యాప్ షేర్ల వాల్యువేషన్లపై ఆందోళనలు ట్రేడింగ్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. శుక్రవారం సెన్సెక్స్ ఒక దశలో 612 పాయింట్లకు పైగా పతనమై 72,484.82 వద్దకు జారుకున్నప్పటికీ, చివర్లో 453.85 పాయింట్ల నష్టంతో 72,643.43 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 123.30 పాయింట్లు కోల్పోయి 22,023.35 వద్ద ముగిసింది. ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 1,475.96 పాయింట్లు (1.99%), నిఫ్టీ 470.20 పాయింట్లు (2.09%) నష్టపోయాయి.


జీడీపీ లెక్కల్లో గందరగోళం

అర్వింద్ సుబ్రమణియన్

న్యూఢిల్లీ: ఇటీవల విడుదల చేసిన భారత జీడీపీ గణాంకాలు తీవ్ర గందరగోళంగా ఉన్నాయని, వాటిని అవగాహన చేసుకోవడం కూడా కష్టంగానే ఉన్నదని ప్రభుత్వ మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు అర్వింద్ సుబ్రమణియన్ అన్నారు. తాజా గణాంకాల ప్రకారం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో జీడీపీ ఏడాదిన్నర కాలంలో అమిత వేగంగా వృద్ధి చెంది 8.4 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇండియా టుడే కాంక్లేవ్‌లో ఈ గణాంకాలపై అర్వింద్ మాట్లాడుతూ.. ఈ గణాంకాల ప్రకారం చూసినట్టయితే ద్రవ్యోల్బణం 1 నుంచి 1.5 శాతం మధ్యలో ఉంటుందని, కాని వాస్తవిక ద్రవ్యోల్బణం 3 నుంచి 5 శాతం మధ్యన ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు. అదే విధంగా ఒకపక్క ప్రైవేటు వినియోగం 3 శాతం ఉంటే ఆర్థిక వ్యవస్థలో వృద్ధి 7.5 శాతం మేరకు ఉన్నదని ఆయన తెలిపారు. గణాంకాలు తప్పు అని నేను చెప్పడంలేదని, కాని వాటిలో చాలా గందరగోళం ఉన్నదని ఆయన అన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల వేతనాలు 17% పెంపు

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందే కేంద్ర ప్రభుత్వం భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. వారి వేతనాలు 17 శాతం పెంచేందుకు ఆమోదం తెలిపింది. 2022 ఆగస్టు 1 నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుంది. దీంతో 1.10 లక్షల మందికిపైగా ఎల్ఐసీ ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) సిబ్బంది జీతాలు 17 శాతం పెంచేందుకు అనుమతించిన కొద్ది రోజులకే.ప్రభుత్వం ఎల్ఐసీ ఉద్యోగుల జీతాల పెంపునకు ఆమోదం తెలపడం విశేషం. 2010 ఏప్రిల్ 1 తర్వాత ఉద్యోగంలో చేరిన దాదాపు 24,000 మంది ఎల్ఐసీ ఉద్యోగుల ఎన్‌పీఎస్ చందాను 10 నుంచి 14 శాతానికి పెంచేందుకూ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పెన్షనర్లకు వన్ టైమ్ ఎక్స్‌గ్రేషియా చెల్లింపునకూ ప్రభుత్వం అంగీకరించింది. దీంతో దాదాపు 30,000 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,120 ▲	60,610 ▲	80,100 ▲
ముంబై	65,559 ▲	60,052 ▲	74,210 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ		విజయవాడ	420
హైదరాబాద్	395	విశాఖపట్నం	425
16వ తేదీ		వరంగల్	397
చిత్తూరు	463		
గోదావరి	420	దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	గోదావరి	106
వరంగల్	104	విజయవాడ	106
కరీంనగర్	104	గుంటూరు	110
మహబూబ్‌నగర్	104	ఒంగోలు	110
కర్నూలు	104	చిత్తూరు	121
విశాఖపట్నం	103		

టీడీపీ కూటమికి 25 స్థానాలు వచ్చే అవకాశం

- త్వరలో వివేకా హత్యపై విచారణ పార్ట్ 2
- నూతన ప్రభుత్వంలో

సీఐడీతో విచారణ: ఎంపీ రఘురామరాజు

న్యూఢిల్లీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి మొత్తం 25 ఎంపీ స్థానాలనూ గెలుచుకునే అవకాశం ఉంది. కచ్చితంగా 23 స్థానాలను గెలుచుకుంటుంది' అని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ టీవీ చానెళ్ల సర్వే అంచనాలను చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చున్న జగన్ గజగజ వణికిపోతున్నారన్నారు. ప్రధాని మోదీ పాల్గొనే సభల అనంతరం రాజకీయ పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. కడప జిల్లా ప్రజలు ఈ హత్యా రాజకీయ సంస్కృతి తమకు వద్దని, బయటపడాలని భావిస్తే... కూటమికి 25కు 25 స్థానాలు రావచ్చు. వివేకా హత్యపై పార్ట్ 2 విచారణ త్వరలోనే ప్రారంభం అవుతుంది. జగన్ ప్రభుత్వం మారిన వెంటనే, నూతనంగా ఏర్పడబోయే టీడీపీ ప్రభుత్వమే విచారణ చేపడుతుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని సీఐడీ చేత విచారణ చేయిస్తారు. సీఐడీలో అప్పుడు బూట్లు తుడిచే అధికారులు ఉండరు. వారే ఇన్వెస్టిగేట్ చేస్తారు. దానిపై సందేహం అవసరం లేదు' అని రఘురామరాజు అన్నారు.



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి కుటుంబ సమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని శుక్రవారం దర్శించుకున్నారు.

అడ్డంగా దొరికిన ఏపీపీఎస్సీ!

- గ్రూప్-1 పేపర్లు రెండుసార్లు మూల్యాంకనం
- హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌కు స్పష్టంగా చెల్లింపులు
- వసతి, భోజనం, టీలు... ప్రతిదానికీ బిల్లులు
- మూల్యాంకనానికి అవసరమైన సామగ్రికి హైదరాబాద్ కంపెనీలకు వర్క్ ఆర్డర్లు
- భద్రత కావాలంటూ గుంటూరు ఎస్పీకి లేఖ
- కర్నూలు పోలీసులతో స్ట్రాంగ్ రూంకు రక్షణ
- ఇవేం జరగలేదని ఏపీపీఎస్సీ బుకాయింపు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

2018 గ్రూప్-1 మెయిన్స్ విషయంలో ఏపీపీఎస్సీ అడ్డంగా దొరికిపోయింది. మాన్యువల్ మూల్యాంకనం రెండుసార్లు జరగలేదన్న కమిషన్ వాదనను ఇప్పటికే హైకోర్టు తోసిపుచ్చగా ఇప్పుడు దానికి సంబంధించిన ఆధారాలు బయటపడుతున్నాయి. గుంటూరు సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మొదటిసారి మాన్యువల్ మూల్యాంకనం చేశారని అభ్యర్థులు మొదటినుంచీ వాదిస్తూ వచ్చారు. అయితే అసలు హాయ్‌ల్యాండ్ అనే మాటే తాము వినలేదని ఏపీపీఎస్సీ బుకాయించింది. కానీ అక్కడే మూల్యాంకనం జరిగిందని, పేపర్లు దిద్దేవారు అక్కడికి వెళ్లారని, దీనికోసం భద్రత ఏర్పాట్లు కూడా చేసినట్లుగా అన్ని ఆధారాలు వెలుగు చూస్తున్నాయి.

ఇవిగో ఆధారాలు...

- హైకోర్టు ఆదేశాలతో గ్రూప్-1 జవాబుపత్రాల మూల్యాంకనానికి ఏపీపీఎస్సీ చర్యలు ప్రారంభించింది. దీనికోసం 3వేల కంట్రోల్ బండిల్ స్లిప్పులు సరఫరా చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన డేటాటెక్ మెథోడెక్స్ కంపెనీకి అప్పటి కమిషన్ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు 2021 నవంబరు 25న లేఖ రాశారు. కంట్రోల్ బండిల్ స్లిప్పులు సరఫరా చేసినందుకు గాను డేటాటెక్ మెథోడెక్స్ కంపెనీకి రూ.17,936 మంజూరు చేస్తూ డిసెంబరు 29న ఉత్తర్వులు ఇచ్చారు.
- "చినకాకాని సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో గ్రూప్-1 పేపర్ల మూల్యాంకనం చేయాలని ఏపీపీఎస్సీ నిర్ణయించింది. 2021 డిసెంబరు 6 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇది చాలా కాన్ఫిడెన్షియల్ వర్క్. అందువల్ల విజయవాడలో ఉన్న ఏపీపీఎస్సీ కార్యాలయం నుంచి హాయ్‌ల్యాండ్‌కు ప్రశ్నపత్రాలు తరలించే వాహనానికి భద్రత కల్పించండి. అలాగే 2021 డిసెంబరు 5 నుంచి హాయ్‌ల్యాండ్‌లో 24గంటల భద్రత అవసరం" అని కోరుతూ అప్పటి కమిషన్ కార్యదర్శి 2021 డిసెంబరు 3న గుంటూరు అర్బన్ ఎస్పీకి లేఖ రాశారు.
- హాయ్‌ల్యాండ్‌లోని ఆవాస్ రిసార్ట్స్‌కు 2022 ఫిబ్రవరి 1న బిల్లులు చెల్లించారు. హాల్ అద్దె 26 రోజులకు, స్ట్రాంగ్ రూం 26 రోజులు, బోర్డు రూం అద్దె 26 రోజులకు, ఇంకా భోజనం, ఉదయం టీ, హైటీ, డిన్నర్ అంటూ ప్రతిదానికీ వేర్వేరుగా బిల్లులు చూపిస్తూ మొత్తం రూ.20.06 లక్షలు చెల్లించారు. అయితే ఇది నేరుగా ఏపీపీఎస్సీ చెల్లించలేదు. హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం చేసేవారి అవసరాల కోసం కమిషన్ ఎంపిక చేసిన కామ్‌సైన్ మీడియా కంపెనీ ఈ బిల్లులను చెల్లించింది.
- కర్నూలు పోలీస్ యూనిట్ నుంచి పదిహేను రోజులకో బ్యాచ్ చొప్పున 32 మంది సిబ్బందిని హాయ్‌ల్యాండ్‌లో నియమించారు. వీరు 2021 డిసెంబరు 5 నుంచి 2022 ఫిబ్రవరి 26 వరకు అక్కడే విధుల్లో ఉన్నారు. ఆ వివరాలను వారి ఐడీ నంబర్లతో సహా అభ్యర్థులు హైకోర్టుకు సమర్పించారు.
- పీఎస్ఆర్ ఆంజనేయులు తర్వాత ఏపీపీఎస్సీ కార్యదర్శిగా వచ్చిన ఎ.బాబు... కంట్రోల్ బండిల్ స్లిప్పులు, వాటితో పాటు ఏకంగా 4వేల ఓఎంఆర్ షీట్లు కావాలని హైదరాబాద్‌కు చెందిన డేటాటెక్ మెథడ్ కంపెనీకి వర్క్ ఆర్డర్ జారీ చేశారు.
- గ్రూప్-1 పేపర్ల మూల్యాంకనం కోసం అవసరమైన కంట్రోల్ బండిల్ స్లిప్పుల సరఫరాకు వర్క్ ఆర్డర్ జారీచేస్తూ అప్పటి కార్యదర్శి ఎ.బాబు 2022 మార్చి 9న లేఖ రాశారు. 49 వేల బార్‌కోడ్ ఓఎంఆర్ షీట్లు, 2,500 కంట్రోల్ బండిల్ స్లిప్పులు సరఫరా చేయాలని అందులో పేర్కొన్నారు.
- ఓఎంఆర్ షీట్ల సరఫరా, వాటి ప్రింటింగ్, డిజైనింగ్, కంట్రోల్ బండిళ్లను సరఫరా చేసిన డేటాటెక్ మెథడ్ కంపెనీకి రూ.3,34,720 మంజూరు చేస్తూ 2022 మే 24న ఏపీపీఎస్సీ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ఇన్‌వాయిస్‌లతో సహా బిల్లుల చెల్లింపుల వివరాలు పేర్కొన్నారు. అయితే అసలు మొదటిసారి హాయ్‌ల్యాండ్‌లో మాన్యువల్ మూల్యాంకనం జరగలేదని ఏపీపీఎస్సీ వాదిస్తోంది. కానీ గుంటూరు ఎస్పీకి భద్రత కోసం అప్పటి కార్యదర్శి రాసిన లేఖలు, భద్రతా సిబ్బంది వివరాలు, హాయ్‌ల్యాండ్‌కు చెల్లింపులపై మాత్రం నోరు మెదపడం లేదు. మొదటిసారి మాన్యువల్ మూల్యాంకనంలో తమకు కావాల్సినవారు ఎంపిక కాకపోవడం వల్లే రెండోసారి చేశారని అభ్యర్థులు ప్రధానంగా ఆరోపిస్తున్నారు. దీనికి సమాధానం చెప్పాల్సిన ఏపీపీఎస్సీ దాటవేత ధోరణి అవలంబిస్తోంది.

అసలేం జరిగిందంటే...

2018 డిసెంబరు 31న గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. 1,14,473 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 2019 మే 26న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించగా 59,200 మంది హాజరయ్యారు. 2020 డిసెంబరు 14 నుంచి 20 వరకు మెయిన్స్ జరిగాయి. 6,807 మంది ఈ పరీక్షలు రాశారు. 2021 మే 26న మెయిన్స్ ఫలితాలను ఏపీపీఎస్సీ ప్రకటించి, 326 మందిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేసింది. ఇక్కడే వివాదం ప్రారంభమైంది. 2018 నోటిఫికేషన్‌లో సంప్రదాయ విధానంలో అంటే మాన్యువల్‌గానే మూల్యాంకనం ఉంటుందని ఏపీపీఎస్సీ పేర్కొంది. కానీ కొవిడ్ పేరుతో డిజిటల్ విధానంలో మూల్యాంకనం చేసింది. ఇది నోటిఫికేషన్‌కు విరుద్ధమంటూ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించగా, 2021 అక్టోబరు 1న మాన్యువల్ విధానంలో మూల్యాంకనం చేయాలని హైకోర్టు ఆదేశించింది.

ఏపీపీఎస్సీ భ్రష్టు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవస్థపైనే యువతకు నమ్మకం పోయేలా చేస్తున్నారు. రాష్ట్రంలో అత్యున్నతమైన గ్రూప్-1 పరీక్షలనే మొక్కుబడి తంతుగా మార్చడం దిగ్భ్రాంతికరం' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'మేం ఉన్నప్పుడు నిజాయితీపరులను, సమర్థులను వెతికి తెచ్చి పెట్టాం. డీజీపీగా పనికిరాడని తీసేసిన సవాంగ్‌ను జగన్ ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమించారు. ఆయనతో తమకు కావాల్సిన పనులు చేయించుకోవాలని చూశారు. వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు బాబు, అనంతపురం వైసీపీ నేత సుధాకర్‌రెడ్డి, తమ కుటుంబంలోని ప్రభుదాస్ రెడ్డి మనవడు సుధీర్‌రెడ్డి వంటివారిని కమిషన్ సభ్యులుగా వేశారు. ఇంతమందిని తెచ్చి నింపడానికి అదేమైనా వైసీపీ కార్యాలయమా? వీరందరూ కలసి ఏపీపీఎస్సీని నాశనం చేశారు. నేను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 30 డిప్యూటీ కలెక్టర్లు, 28 డీఎస్పీ పోస్టులతో సహా మొత్తం 162 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రిలిమ్స్, మెయిన్ జరిగాయి. పరీక్ష పత్రాలు చేతితో దిద్దాలని నోటిఫికేషన్‌లో ఉంటే డిజిటల్‌గా మూల్యాంకనం చేయించారు. దీనిపై అభ్యర్థులు కోర్టుకు వెళ్లడంతో చేతితోనే దిద్దించాలని తీర్పు చెప్పింది. ఆ సమయంలో సీతారామాంజనేయులు కమిషన్ కార్యదర్శిగా ఉన్నారు. ఆయన మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్‌లో మెయిన్స్ పరీక్షాపత్రాలు దిద్దించారు. ఆ తర్వాత గౌతంసవాంగ్ ఛైర్మన్‌గా వచ్చారు. అంతకు ముందు చేతితో దిద్దించిన పరీక్షా పత్రాల ఫలితాలను తొక్కేసి అవే పత్రాలను ఆయన రెండోసారి దిద్దించారు. దీనిపై అభ్యర్థులు కోర్టుకు వెళ్తే అధికారులు బరితెగించి కోర్టుకు అబద్ధాలు చెప్పారు. రెండోసారి దిద్దించలేదని ఏకంగా అఫిడవిట్ సమర్పించారు. కానీ దీనిపై పోరాటం చేసిన అభ్యర్థులు.. రెండుసార్లు మూల్యాంకనం చేసినట్లు ఆధారాలు సంపాదించి కోర్టుకు సమర్పించారు. మొదటిసారి దిద్దించినప్పుడు హాయ్‌ల్యాండ్‌లోని రిసార్ట్‌కు అద్దె చెల్లించారు. అక్కడ పోలీసు భద్రత కావాలని గుంటూరు ఎస్పీకి కమిషన్ కార్యదర్శి హోదాలో సీతారామాంజనేయులు లేఖ రాశారు. పేపర్లు దిద్దడానికి అవసరమైన స్టేషనరీ కోసం ఆర్డర్ పెట్టి డబ్బు కూడా చెల్లించారు' అని చంద్రబాబు వివరించారు. ఈ పత్రాలను రెండోసారి దిద్దించడమే అక్రమాలకు మూలమని ఆరోపించారు. తమకు కావాల్సినవారికి ఉద్యోగాలు రాలేదని మొదటిసారి దిద్దిన ఫలితాలను తొక్కిపెట్టారని, తాడేపల్లి ప్యాలెస్ ఆదేశించగానే మరోసారి దిద్దించారని చెప్పారు. ఇద్దరు పీఎస్ అధికారులు అక్కడ కూర్చుని కమిషన్‌లో పాపాలు చేసి ఐపీఎస్ విలువ దిగజార్చారని, ఈ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి రూ.వందల కోట్లు ఖర్చు చేసి ఢిల్లీ నుంచి పెద్ద లాయర్లను తెచ్చి కోర్టుల్లో హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. 'పరీక్షా పత్రాలను నిబంధనలకు విరుద్ధంగా రెండోసారి దిద్దారని కోర్టు స్పష్టమైన నిర్ధారణకు వచ్చి ఆ పరీక్షను రద్దు చేసింది. మళ్లీ పెట్టాలని ఆదేశించింది. బాబాయి హత్యను కప్పిపెట్టినట్లుగా ఈ పరీక్షల్లోని అవినీతి బాగోతాలను దాచాలని ప్రయత్నించారు. ఈ ముఖ్యమంత్రికి సిగ్గూ ఎగ్గూ లేవు. కోర్టు తీర్పు కాపీ రాకముందే అప్పీలుకు వెళ్తామని ప్రకటనలు చేయించారు. డబ్బు ఇచ్చినవాళ్ల మీద పడకుండా కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఇంత ముఖ్యమైన పరీక్షలో ఇన్ని అక్రమాలు చేసి పట్టుబడిన తర్వాత ఈ సీఎం ఇంకా ఏ మొహం పెట్టుకొని సీట్లో కూర్చున్నాడు? మాపై కేసులు పెట్టి మా నోళ్లు మూయిస్తే సరిపోతుందా? ఇన్ని అక్రమాలు జరుగుతుంటే యువత ఇంకా ఈ రాష్ట్రంలో ఉండగలుగుతారా? ఇన్ని దుర్మార్గాలు చేసిన అధికారులు ఒక్కక్షణం కూడా అక్కడ ఉండటానికి అర్హులు కాదు. వారిని తక్షణం తొలగించాలి. వారిపై కేసు పెట్టి అరెస్టు చేయాలి' అని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం 22 ఏళ్లపాటు అధికారంలో ఉంటే ఒక్కసారి కూడా ఏపీపీఎస్సీ పరీక్షల్లో అవకతవకలకు ఆస్కారం ఇవ్వలేదని, వీళ్లు బహిరంగ మార్కెట్లో పోస్టులు అమ్మకానికి పెట్టారని విమర్శించారు. ప్రశ్నాపత్రాలు రెండుసార్లు దిద్దడంలో సీతారామాంజనేయులు, సవాంగ్ ఇద్దరి పాత్ర ఉందని, వారిద్దరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఎం పేషీలో కూర్చుని సెటిల్మెంట్లు, రాజీలు చేసే ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డిపైనా విచారణ జరపాలని చంద్రబాబు కోరారు. ఈ ముగ్గురు అధికారులు ఈ వ్యవహారంలో తమ పాత్రపై సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం జగన్ కూడా నోరు తెరిచి తన వైఫల్యంపై సమాధానం చెప్పాలన్నారు. దీనిపై గవర్నర్‌ను కలసి ఆయన జోక్యం కోరతామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినవారిని వదిలిపెట్టేది లేదని చంద్రబాబు ప్రకటించారు.

సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా అందించొద్దు

- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి రమేశ్ కుమార్

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ముగిసే వరకూ వివిధ పథకాల లబ్ధిదారులకు అందించే సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా అందించవద్దని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సూచించింది. వాటి పంపిణీకి ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని కోరింది. వలంటీర్లను పూర్తిగా ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఆదేశాలను సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ గమనించిందని ఆ సంస్థ కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే అంశంపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ హైకోర్టులో రిట్ పిటిషన్ వేయడంతోనే ఈ ఆదేశాలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికీ కూడా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీకి చేరిన సమాచారం ప్రకారం వలంటీర్లు వారి సామీప్యత కారణంగా ఓటర్లను ప్రభావితం చేస్తూనే ఉన్నారని, ఓటర్లకు పారితోషకాలు, డబ్బులు, చీరలు తదితర తాయిలాలను పంపిణీ చేస్తున్నారని రమేశ్ కుమార్ తెలిపారు.

హింసాత్మక ఘటనలకు ఎస్పీలదే బాధ్యత

- ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం
- ఉద్యోగులు పార్టీలకు సపోర్టు చేస్తే చర్యలు
- పార్టీ అనుబంధ చానళ్లలో అనుకూల వార్తలు వస్తే ఆ వ్యయం ఆ పార్టీ, అభ్యర్థి ఖాతాలకే!
- మీడియా వర్క్‌షాపులో సీఈవో మీనా



ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షా సమావేశంలో సీఈవో మీనా, ఇతర అధికారులు

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడ హింసాత్మక ఘటనలు జరిగినా ఎస్పీలదేనని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. హింసాత్మక సంఘటనలు జరిగినప్పుడు ఎస్పీలు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే వారిపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హింసలేని, రీపోలింగ్‌కు ఆస్కారంలేని ఎన్నికలే లక్ష్యంగా ఈసారి ఎన్నికల నిర్వహణ ఉంటుందని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మీడియా మాధ్యమాలు, మీడియా ప్రతినిధులు అనుసరించాల్సిన విధి విధానాలను వివరించేందుకు మీనా అధ్యక్షతన అమరావతి సచివాలయంలో మీడియా వర్క్‌షాపు జరిగింది. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించే విషయంలో మీడియా పాత్ర ఎంతో కీలకమన్నారు. అందుకు అనుగుణంగా మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. పెయిడ్ న్యూస్ అంశాన్ని ఆయన వివరిస్తూ.. ప్రచార మాధ్యమాల్లో ప్రచురితం, ప్రసారమయ్యే పెయిడ్ ఆర్టికల్స్‌పై ఎన్నికల కోడ్ అమలు నుంచి గట్టి నిఘా ఉంటుందన్నారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి పెయిడ్ న్యూస్ అంశాన్ని సునిశితంగా పరిశీలిస్తామని చెప్పారు. ఇందుకోసం జిల్లా స్థాయిలోను, రాష్ట్ర స్థాయిలో ఉండే మీడియా సర్టిఫికేషన్, మీడియా మానిటరింగ్ కమిటీలు ఎంతో అప్రమత్తంగా పర్యవేక్షిస్తుంటాయని తెలిపారు. పెయిడ్ న్యూస్‌గా నిర్ధారణ అయిన ఆర్టికల్స్‌కు సంబంధించి రేటు కార్డు ప్రకారం ఖరారు చేయబడిన సొమ్మును సంబంధిత అభ్యర్థికి అనుమతించిన వ్యయం కింద జమ అవుతుందని తెలిపారు.

ప్రకటనలకు ప్రి సర్టిఫికేషన్ తీసుకోవాల్సిందే..

డిజిటల్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ఎన్నికల ప్రకటనలు ఇవ్వాలంటే పార్టీలు, అభ్యర్థులు ప్రి సర్టిఫికేషన్ తీసుకోవాల్సిందేనని మీనా స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రకటనలు రూపొందించుకోవాలని సూచించారు. పార్టీకి అనుబంధంగా ఉండే చానెళ్లలోని వార్తలు, ప్రకటనలపై ప్రత్యేక నిబంధనలు ఉన్నాయన్నారు. పార్టీ అనుబంధ చానెళ్లలో వచ్చే వార్తలను పెయిడ్ న్యూస్‌గా పరిగణించే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి వార్తలను ఎంసీఎంసీ కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రకటనలు, పెయిడ్ న్యూస్ విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే అభ్యర్థులపై చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు సపోర్టు చేయకూడదని, ప్రచారం చేయకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా ఉద్యోగ సంఘాల నేతలు ఈ విధంగా చేస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు వివిధ రాజకీయ పార్టీల నుంచి 155 ప్రకటనల కోసం ఈసీకి దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 140 ప్రకటనలకు పర్మిషన్ ఇచ్చామని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థికి రూ. 40 లక్షలు, ఎంపీ అభ్యర్థికి రూ.95 లక్షల వ్యయాన్ని మాత్రమే ఈసీ ఎన్నికల వ్యయంగా అనుమతించిందని సీఈవో తెలిపారు.

పార్టీలు, అభ్యర్థుల ఖాతాల వివరాలివ్వండి

- బ్యాంకర్లకు ముఖేష్ కుమార్ మీనా ఆదేశం

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో బ్యాంకు ఖాతాల ద్వారా అనుమానాస్పద, అధిక మొత్తంలో జరిగే లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు ఆదాయపన్నుశాఖకు, ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా బ్యాంకర్లను ఆదేశించారు. గతేడాది అక్టోబరు 1 నుంచి రోజుకి రూ.10 లక్షలకు మించి 30 రోజుల వ్యవధిలో రూ.50 లక్షలకు మించి లావాదేవీలు జరిగిన బ్యాంకు ఖాతాల వివరాలను అందజేయాలని అన్ని బ్యాంకుల నోడల్ అధికారులను ఆయన కోరారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, ఎలాక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్ అమలు అంశాలను సమీక్షించేందుకు శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ... కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి లోక్‌సభ అభ్యర్థి రూ.95 లక్షలు, శాసన సభ అభ్యర్థి రూ.40 లక్షల మేర వ్యయం చేసేందుకు అనుమతి ఉంటుందన్నారు. అయితే అంతకు మించి జరిగే వ్యయంపై పటిష్ట నిఘా ఉంటుందని, ఈ విషయంలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థుల బ్యాంకు ఖాతాల నుంచి జరిగే లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు ఐటీశాఖతో పాటు తమకు అందజేయాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తదుపరి అభ్యర్థులు, వారి సంబంధీకులు లేదా రాజకీయ పార్టీల బ్యాంకు అకౌంట్ల నుంచి లక్ష రూపాయాలకు మించి జరిపే లావాదేవీల వివరాలను కూడా అందజేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో సీజ్ చేసిన నగదు, ఇతర వస్తువుల వివరాలు రియల్ టైమ్ బేసిస్‌లో నివేదించేందుకు ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ అంశానికి సంబంధించి ఐటీ, సీఎస్‌టీ, పోలీస్, ఎక్సైజ్ తదితర 22 ఎన్ఫోర్‌మెంట్ ఏజన్సీలు నిరంతరం పని చేస్తున్నాయని, వారు సీజ్ చేసే నగదు, వస్తువుల వివరాలను ఈ యాప్‌లో ఫీడ్ చేస్తారని తెలిపారు. అన్ని బ్యాంకుల ప్రతినిధులు ఈ యాప్‌ను పటిష్టంగా వినియోగించుకునేందుకు ఈ యాప్‌లోకి లాగిన్ అవ్వాలని ఆయన కోరారు.

రహదారి భద్రత, ఆడిట్‌పై మరిన్ని చర్యలు తీసుకోండి

- రాష్ట్రానికి రహదారి భద్రత కమిటీ చైర్మన్ ఆదేశం

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై మరిన్ని పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రహదారి భద్రత ఆడిట్‌పై సుప్రీంకోర్టు నియమించిన రహదారి భద్రత కమిటీ చైర్మన్ జస్టిస్ అభయ్ మనోహర్ సాప్రే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. శుక్రవారం ఆయన ఢిల్లీ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి సహా సంబంధిత శాఖల అధికారులతో రహదారి భద్రత ఆడిట్ అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. జస్టిస్ మనోహర్ సాప్రే మాట్లాడుతూ.. రాష్ట్ర, జిల్లా స్థాయిలో రహదారి భద్రతకు సంబంధించిన కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర ఇతర ప్రధాన రహదారులపై బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని జస్టిస్ ఎఎం సాప్రే రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించే చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి భద్రతకు సంబంధించిన పాలసీని జారీచేసి పటిష్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రహదారి భద్రతకు సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల రహదారి భద్రత కమిటీ చైర్మన్ జస్టిస్ అభయ్ మనోహర్ సాప్రే సంతృప్తి వ్యక్తంచేశారు. ఎన్నికల అనంతరం రహదారి భద్రతా చర్యల పరిశీలనకు ఏపీలో స్వయంగా పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రహదారి భద్రతపై ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని వివరించారు. రాష్ట్రంలో నాన్‌లేప్సబుల్ విధానంలో రూ.50 కోట్లతో రహదారి భద్రతా నిధిని ఏర్పాటు చేస్తూ శుక్రవారం జీవో ఇచ్చామన్నారు.

నంబర్లను వెల్లడించలేదేం?



- ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు నోటీసులు
- 18వ తేదీకి విచారణ వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్ బాండ్ల తాలూకు పూర్తి వివరాలు వెల్లడించాలని ఆదేశించినా కూడా వాటిని ఎందుకు సమర్పించలేదని ఎస్బీఐపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బాండ్లను కొన్న తేదీ, బాండ్ విలువ, కొన్న వారెవరు వంటి మొత్తం వివరాలను వెల్లడించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన యూనిక్ ఆల్ఫా న్యూమరిక్ నెంబర్లను తెలియజేయాలని పేర్కొంది. యూనిక్ ఆల్ఫా న్యూమరిక్ నెంబర్ల ద్వారా బాండ్ల రూపంలో ఏ పార్టీకి ఎవరు ఎంత విరాళం ఇచ్చారన్నది తెలుస్తుంది. ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎస్బీఐ ఎన్నికల సంఘానికి (ఈసీకి) అందించాలని, వాటిని ఈసీ తమ వెబ్‌సైట్‌లో బహిరంగపరచాలని ఈ నెల 11వ తేదీన సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం తమ వెబ్‌సైట్‌లో బాండ్ల వివరాలను

గతంలో కోర్టుకు సమర్పించిన వివరాలను ఈసీ భద్రపరచాలని కూడా కోర్టు ఆదేశించింది. ఈ మేరకు గురువారం తమ వెబ్‌సైట్‌లో బాండ్ల వివరాలను అప్‌లోడ్ చేసిన ఈసీ.. విరాళాల తాలూకు పత్రాలు కోర్టు వద్దే ఉన్నాయని, వాటిని తిరిగి అప్పగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించింది. ఈ మేరకు ఇటీవలి తీర్పు అమలుకు సంబంధించి స్వల్ప సవరణలు కోరుతూ దరఖాస్తు దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ ఎస్బీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎస్బీఐ తరఫున ఎవరు వాదనలు వినిపిస్తున్నారు? ఇంతకుముందు మేం ఇచ్చిన తీర్పులో.. బాండ్లను కొన్న వారెవరు? బాండ్ విలువ ఎంత? ఏ రోజున కొన్నారు? వంటి అన్ని వివరాలను వెల్లడించాలని స్పష్టంగా పేర్కొన్నాం. కానీ, ఆ వివరాలేమీ తెలియజేయలేదు. బాండ్ల నెంబర్లను కూడా వెల్లడించలేదు' అని పేర్కొన్నారు. ఈ వివరాలన్నింటినీ తెలియజేయాల్సిందేనని స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా ఈసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ..పార్టీలకు విరాళాలకు సంబంధించిన వివరాల సీల్డ్ కవర్లను సుప్రీంకోర్టుకు గతంలో సమర్పించామని, వాటి తాలూకు మరొక కాపీ తమవద్ద లేదని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. వాటిని ఈసీకి అందజేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈపని శనివారం సాయంత్రం ఐదు గంటల లోపు జరగాలని, అదేరోజుగానీ మరుసటి రోజుగానీ ఆ పత్రాలను కూడా ఈసీ తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తాను కేంద్రం తరఫున మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నానని, ఎస్బీఐ తరఫున కాదని ధర్మాసనానికి విన్నవించగా.. విచారణ జరుగుతున్న సమయంలో ఎస్బీఐ తరఫు న్యాయవాదులు కూడా ఉండాలి అని ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు ఎస్బీఐకి నోటీసులు జారీచేస్తూ, విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది.

లోకం తీరు



కొనుగోలు చేసిన బాండ్లు వర్సెస్ నికర లాభాలు

	కొనుగోలు చేసిన బాండ్లు (రూ.కోట్లలో)	2019-20 నుంచి 2022-23 వరకు నికర లాభం (రూ.కోట్లలో)
ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్	1368	215
మేఘ ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్	966	7509
క్విక్ సప్లయ్ చెయిన్ ప్రైవేట్ లిమిటెడ్	410	109
వేదాంత లిమిటెడ్	400	48372
హల్దియా ఎనర్జీ లిమిటెడ్	377	1274
ఎస్సెల్ మైనింగ్ అండ్ ఐఎస్‌డీఎస్	224	3700
ఎంకేజే ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్	192	58
మదన్‌లాల్ లిమిటెడ్	185	10
భారతీ ఎయిర్‌టెల్ సర్వీసెస్ లిమిటెడ్	183	253
ఉత్కల్ అల్యూమినియా ఇంటర్నేషనల్	145	3713
జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్	123	18482
టోరెంట్ పవర్ లిమిటెడ్	106	5076
ఐఎఫ్‌బీ ఆగ్రో ఐఎన్‌డీఎస్ లిమిటెడ్	92	175

భారీగా విరాళాలిచ్చింది వీళ్లే

గనులు, విద్యుత్, ఇన్‌ఫ్రా సంస్థలదే అగ్రస్థానం.. విరివిగా నిధులిచ్చిన హైదరాబాద్ మౌలిక, ఫార్మారంగం



న్యూఢిల్లీ, మార్చి 15: రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చిన సంస్థల్లో మౌలిక సదుపాయాలు, గనులు, విద్యుత్ కర్మాగారాల సంస్థలే అగ్రస్థానంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా అయిదేళ్ల వ్యవధిలో రూ.16,500 కోట్లకు పైగా విరాళాలు కంపెనీలు అందజేయగా, హైదరాబాద్‌కు చెందిన ఇన్‌ఫ్రా, ఫార్మా, రియల్ ఎస్టేట్ కంపెనీలు అందులో తమవంతు పాత్ర పోషించాయి. అయితే, అగ్రస్థానంలో ఉన్న పది కంపెనీల్లో హైదరాబాద్ కంపెనీ మేఘా ఇంజనీరింగ్ ఒక్కటే ఉంది.

1) ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్: కోయంబత్తూరు రిజిస్టర్డ్ సంస్థ. ఏకంగా 1,368 కోట్ల రూపాయల బాండ్లు కొన్నారు. ఈడీ కేసులున్నాయి. మార్టిన్ లాటరీ ఏజెన్సీస్ అనే పేరుతో కొన్నాళ్లు నడిచింది. యజమాని మార్టిన్ చాలాకాలంలో దేశంలో కెల్లా అత్యధిక పన్ను చెల్లింపుదారుగా ఉన్నారు. నిర్మాణం, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు ఉన్నాయి. కంపెనీ వార్షికాదాయం 16,500 కోట్లు.

2) మేఘా ఇంజనీరింగ్: హైదరాబాద్ కంపెనీ. 966 కోట్ల విరాళాలు ఇచ్చింది. దాని అనుబంధ సంస్థ టాప్ -10లో ఏడో స్థానంలో ఉన్న వెస్టర్న్ యూపీ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మరో 220 కోట్లు ఇచ్చింది. టన్నెళ్లు, రైల్వే మౌలిక సదుపాయాలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణంలో ప్రసిద్ధి. హిమాలయాల్లో జోజిల్లా రోడ్ టన్నెల్ నిర్మాణం చేస్తోంది.

3) క్విక్ సప్లయి చైన్: ఇది ముంబైకి చెందిన లాజిస్టిక్స్ కంపెనీ. ఏకంగా 410 కోట్లు రాజకీయ పార్టీలకు విరాళంగా ఇచ్చింది. 2000 సంవత్సరంలో 130 కోట్ల మూలధనంతో ఏర్పాటు చేశారు. గోదాములతో పాటు మానవ వనరుల నిర్వహణ కూడా చేస్తోంది. 2021-22లో కేవలం రూ.21 కోట్ల ఆదాయం ఉన్న ఈ సంస్థ ఆ సంవత్సరం ఏకంగా 360 కోట్ల విరాళం ఇచ్చింది. దీని కేంద్ర కార్యాలయం నవీ ముంబైలోని ధీరూభాయ్ అంబానీ నాలెడ్జి పార్క్‌లో ఉంది. దాని డైరెక్టర్లు కూడా రిలయన్స్ ఇతర కంపెనీల్లో డైరెక్టర్లుగా ఉన్నారు. పైగా, దేశంలోని అతి పెద్ద కంపెనీల్లో ఒకటైన రిలయన్స్ ఎలాంటి విరాళాలు ఇవ్వలేదు. 410 కోట్లు రిలయన్స్ విరాళాలేనని వార్తలు వచ్చిన నేపథ్యంలో క్విక్ సప్లయి చైన్ తమ అనుబంధ సంస్థ కాదని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది.

4) వేదాంత: అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని వేదాంత 401 కోట్లు ఇచ్చింది. పలు రకాల గనుల వ్యాపారం ఉంది. బ్రిటన్ సంస్థకు అనుబంధ సంస్థ. గ్రూప్‌ను ఆరు భాగాలుగా విభజించే క్రమంలో ఉంది.

5) హాల్దియా ఎనర్జీ: బెంగాల్లోని హాల్దియాలో భారీ థర్మల్ విద్యుత్ కర్మాగారాలు నిర్వహిస్తున్న హాల్దియా గ్రూపు 377 కోట్ల విరాళాలు ఇచ్చింది. గోయంకా కుటుంబానికి చెందిన ఈ సంస్థకు మోహన్ బగాన్ ఫుట్‌బాల్ జట్టు, ఐపీఎల్ లఖ్‌నవూ జట్టు ఉన్నాయి. ఇ

6) ఎస్సెల్ మైనింగ్: దేశంలో అతిపెద్ద ప్రైవేటు బొగ్గు గనుల సంస్థ. 225 కోట్లు విరాళాలుగా ఇచ్చింది. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందినది.

7) వెస్టర్న్ యూపీ పవర్: దేశంలో అతిపెద్ద విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ. 220 కోట్ల విరాళం ఇచ్చింది. ఇది మేఘా అనుబంధ సంస్థ.

8) భారతి ఎయిర్‌టెల్: జియో తర్వాత దేశంలో అతిపెద్ద టెలికం సంస్థ. 198 కోట్ల విరాళాలు ఇచ్చింది.

9) కెవ్వెంటర్ ఫుడ్ పార్క్: బెంగాల్లో ఆహారం, పాల ఉత్పత్తుల ఎగుమతుల వ్యాపారం ఉంది. 195 కోట్ల విరాళం ఇచ్చింది.

10) ఎంకేజీ ఎంటర్‌ప్రైజెస్: బెంగాల్ సంస్థ. స్టీల్ వ్యాపారంలో ఉంది. 192 కోట్లు ఇచ్చింది.

162 కోట్లు ఇచ్చింది ఎవరు?

పన్నెండవ స్థానంలో యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉంది. ఏకంగా రూ.162 కోట్ల విరాళం ఇచ్చింది. అయితే, ఘాజియాబాద్‌లోని యశోద, హైదరాబాద్‌లోని యశోద రెండూ ఆ విరాళాలు తమవి కాదని స్పష్టం చేశాయి. యశోద హాస్పిటల్స్ పేరుతో రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చిందెవరనేది తేలాల్సి ఉంది. మరోపక్క ఈడీ దాడులకు గురయిన కంపెనీలే బీజేపీకి భారీగా విరాళాలు ఇచ్చాయని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. తప్పని నిరూపించ దలచుకుంటే విరాళాలు ఇచ్చిన సంస్థల వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేసింది.

తెలుగు కంపెనీలు

తెలుగు రాష్ట్రాలతో సంబంధం ఉన్న కొన్ని కంపెనీలు కూడా భారీగానే విరాళాలు ఇచ్చాయి. రెడ్డి ల్యాబ్స్ రూ.80 కోట్లు, నాట్కో ఫార్మా రూ.69 కోట్లు, ఎన్‌సీసీ రూ.60 కోట్లు, దివి ల్యాబ్స్ రూ.55 కోట్లు, నవయుగ రూ.55 కోట్లు, రామ్‌కో సిమెంట్స్ రూ.54 కోట్లు, అరబిందో ఫార్మా రూ.52 కోట్లు, రిత్విక్ ప్రాజెక్టు రూ.45 కోట్లు, అపర్ణ ఎస్టేట్స్ రూ.30 కోట్లు, సన్ ఫార్మా 31 కోట్లు, హెటిరో డ్రగ్స్ రూ.30 కోట్లు, హెటిరో ల్యాబ్స్ రూ.25 కోట్లు, హెటిరో బయో ఫార్మా 5 కోట్లు, హానర్ ల్యాబ్స్ రూ.25 కోట్లు, నూజివీడు సీడ్స్, ప్రభాకర్‌రావు కలిపి రూ.27 కోట్లు, మైహోం రూ.15 కోట్లు, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ రూ.10 కోట్లు, సంధ్య కన్‌స్ట్రక్షన్స్ 13 కోట్లు, నర్రా కన్‌స్ట్రక్షన్స్ రూ.10 కోట్లు, మైహోం ఇన్‌ఫ్రా రూ.10 కోట్లు, భారత్ బయోటెక్ రూ.10 కోట్లు, వంశీరాం బిల్డర్స్ 7 కోట్లు, శ్రీచైతన్య 5 కోట్లు, రాజకీయ పార్టీలకు విరాళాలుగా ఇచ్చాయి. ఫార్మ హెల్త్‌కేర్ రంగాలే ఏకంగా రూ.900 కోట్ల విరాళాలు ఇచ్చాయి.

ఉత్తర కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఉత్తర ఒడిశా నుంచి దక్షిణ ఛత్తీస్‌గఢ్ వరకు, మరఠ్వాడ నుంచి కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమెరిన్ తీరం వరకు వేర్వేరుగా ద్రోణులు విస్తరించాయి. ఇంకా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అధిక పీడనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో శుక్రవారం ఉత్తర కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఇదే సమయంలో రాయలసీమలో ఎండతీవ్రత కొనసాగింది. దేశంలో అత్యధికంగా అనంతపురంలో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో ఉత్తరకోస్తాలో పలుచోట్ల ఉరుములతో వర్షాలు కురుస్తాయని, దక్షిణ కోస్తా, రాయలసీమలో పొడి వాతావరణం నెలకొంటుందని, రాయలసీమలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

విరాళాలకు, ఈడీ దాడులకు

సంబంధమే లేదు

న్యూఢిల్లీ, మార్చి 15: అధికార పార్టీకి అందే ఎన్నికల విరాళాలకు, కేంద్ర దర్యాప్తు సంస్థలు చేసే దాడులకూ ఎలాంటి సంబంధం ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఇలాంటి ఆరోపణలు కేవలం ఊహాగానాలేనని చెప్పారు. "ఈడీ వెళ్లి కంపెనీలపై దాడులు చేస్తే, ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయనుకోవడం పూర్తిగా ఊహాగానమే. ఎన్నికల బాండ్లు కొన్న తర్వాత కూడా ఈడీ దాడులు జరిగిన సందర్భాలు ఉన్నాయి కదా! మరి దాన్నేమంటారు?" అని ఆమె ప్రశ్నించారు. ఇక ఎలక్టోరల్ బాండ్లన్నీ అధికార బీజేపీకే వచ్చాయని చాలా మంది ప్రచారం చేస్తున్నారని.. అది కూడా తప్పని చెప్పారు. కంపెనీలు ప్రాంతీయ పార్టీలకు కూడా విరాళాలు ఇస్తాయని గుర్తుచేశారు. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడ్డారు. గతంలో కంటే ఇది మెరుగైన విధానమేనని పేర్కొన్నారు. గత వ్యవస్థలోనూ లోపాలు ఉన్నాయి కదా? అని నిర్మల ప్రశ్నించారు. గతంలో కంటే మెరుగైనదిగా భావించే మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు.

ఎలక్టోరల్ బాండ్లతో

బీజేపీ 'క్విడ్ ప్రోకో'

- బీజేపీ అవినీతి వ్యూహాలు బహిర్గతం: కాంగ్రెస్

న్యూఢిల్లీ/బెంగళూరు, మార్చి 15: కేంద్ర ఎన్నికల సంఘానికి ఎస్బీఐ సమర్పించిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలు రాజకీయ దుమారం సృష్టించాయి. ఎలక్టోరల్ బాండ్ల వివరాలు.. బీజేపీ అనుసరిస్తున్న అవినీతి వ్యూహాలను బహిర్గతం చేస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. స్వతంత్ర భారతదేశంలోనే ఇది అతిపెద్ద కుంభకోణమని, దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. అప్పటివరకు బీజేపీ బ్యాంకు ఖాతాలను నిలిపివేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దీనిపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఎస్బీఐ 'జాబితా' వెనుక కేంద్ర పెద్దలు : నారాయణ

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్‌బాండ్ల ద్వారా ఒక్కో పార్టీకి కార్పొరేట్ కంపెనీలు ఇచ్చిన వివరాలను సవివరంగా వెల్లడించాల్సిందేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. ఎస్బీఐ వెలువరించిన జాబితా వెనుక కేంద్ర పెద్దలున్నారని ఆరోపించారు. దొంగలను కాపాడేందుకే ఎస్బీఐ వివరాలు సరిగా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాలుగేళ్ల పోరాట ఫలితమే

గ్రేడ్- 2 వీఆర్వోల ప్రొబేషన్

- ఏపీ వీఆర్వో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయకుమార్, అనుపమ

విజయవాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ వీఆర్వో అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) నాలుగేళ్ల పోరాటం ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 935 మంది గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో)కు ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు వెలువడ్డాయని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోన ఆంజనేయకుమార్, అనుపమ పేర్కొన్నారు. విజయవాడలోని ఏపీ రెవెన్యూభవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటివరకు 935 మంది గ్రేడ్-2 వీఆర్వోలు కన్సాలిడేషన్ పే కింద రూ.15 వేల జీతం తీసుకుంటూ ఇబ్బంది పడుతున్నారని, తాజా ఆదేశాలతో సాధారణ పేస్కేల్ నుంచి జీతం పొందటానికి అవకాశం ఏర్పడిందని తెలిపారు. తమ విజ్ఞప్తి మేరకు ప్రత్యేక కేసుగా తీసుకుని ప్రొబేషన్ డిక్లరేషన్ చేస్తూ రెవెన్యూ శాఖ మెమో జారీ చేసిందన్నారు. 935 గ్రేడ్-2 వీఆర్వోలకు ఏడాది కాలంలో రెండుసార్లు సర్వే పరీక్ష జరపాలని ఆదేశించారని తెలిపారు. ఉత్తీర్ణత సాధించటంలో విఫలమైన వారికి జిల్లా హెడ్ క్వార్టర్‌లో సర్వే శాఖ అధికారులు అవగాహనా తరగతులు, మాక్ పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. సర్వే పరీక్షను తెలుగు భాషలోనే నిర్వహించాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఉత్తర్వులు రావటానికి కృషి చేసిన ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుకు, సీఎస్ జవహర్‌రెడ్డి, సీసీఎల్ఏ జిసాయి ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



ఎనిమిదేళ్లలో.. మాట్లాడుతున్న అజయ్‌కుమార్, డాక్టర్ల బృందం

సెంటినీలో 10వేల యూరాలజీ సర్జరీలు

భవానీపురం, మార్చి 15: విజయవాడ సెంటిని హాస్పిటల్‌లో ఎనిమిదేళ్లుగా యూరాలజీ విభాగంలో 10వేల సర్జరీలు చేసి అరుదైన మైలురాయిని అధిగమించామని యూరాలజీ విభాగం చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. హాస్పిటల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015 సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు 10వేల సర్జరీలు యూరాలజీ టీమ్ ఆధ్వర్యంలో చేశామని ఘనంగా ప్రకటించారు. సెంటినీలో జనరల్ యూరాలజీ సర్జరీలే కాకుండా పీడియాట్రిక్ యూరాలజీ, అడ్వాన్స్‌డ్ లాపరోస్కోపీ, మినిమల్లీ ఇన్వేసివ్ లేజర్ ఎండో యూరాలజీ, రీకన్‌స్ట్రక్టివ్ యూరాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ సర్జరీలు డాక్టర్లు రాధామాధవి, ప్రసాద్, అనిత, దీప్తిల సహకారంతోనే చేశామన్నారు. సీఈవో సీఎల్ఎస్ రెడ్డి, యాజమాన్యం డాక్టర్ పద్మ మొవ్వ, ఆనంద్ మొవ్వ, డైరెక్టర్ విష్ణు ప్రోత్సాహం మరువలేనిదన్నారు.

క్రీడా సంఘాలకు ప్రభుత్వ సహకారం కరువు

- ఏపీవోఏ అధ్యక్షుడు పురుషోత్తం

విజయవాడ స్పోర్ట్సు, మార్చి 15: క్రీడా సంఘాలకు ప్రభుత్వం నుంచి సహకారం లేదని, జాతీయ క్రీడలు నిర్వహిస్తే తప్ప రాష్ట్రంలో క్రీడా మౌలికసదుపాయాలు మెరుగుపడవని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం (ఏపీవోఏ)అధ్యక్షుడు ఆర్కే పురుషోత్తం పేర్కొన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో ఏపీవోఏ సమావేశంలో ఆయన మాట్లాడారు. గుజరాత్ జాతీయ క్రీడలకు నిధులిస్తామని మంత్రి రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు నెరవేరలేదన్నారు. శాప్ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు శాప్ ఎండీకి తప్పుడు నివేదికలు ఇచ్చి భ్రష్టు పట్టించారని ఆరోపించారు. ఏపీవోఏ ఉపాధ్యక్షుడు నాదెళ్ల బ్రహ్మాజీరావు, బడేటి వెంకట్రామయ్య, సీఈవో సీహెచ్ గోవింద రాజులు పాల్గొన్నారు.

పశ్చిమ టీడీపీకి కంచుకోట



టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని చిన్ని

వన్‌టౌన్, మార్చి 15: విజయవాడ పశ్చిమ నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. శుక్రవారం వన్‌టౌన్‌లోని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ టీడీపీ డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో చిన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గం టీడీపీలో గ్రూపులు లేవని, కేవలం చంద్రబాబు గ్రూపే ఉందని చిన్ని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసేన-బీజేపీలతో టీడీపీ ప్రయాణం చేస్తోందన్నారు. టీడీపీ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచిన కేశినేని నాని వైసీపీలోకి వెళ్లిపోయారని చిన్నతనం నుంచి అతని వ్యక్తిత్వం తనకు తెలుసని అన్నారు. 2019లో నాని గెలిచాక విర్రవీగాడని టీడీపీ అధినేత కంటే తానే గొప్పవాడిలా భావించుకున్నాడని విమర్శించారు. ఇప్పుడు వైసీపీలో అతనికి టికెట్టు వస్తుందో లేదోనని అన్నారు. ఈనెల 17న చిలకలూరిపేటలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈనెల 18న టీడీపీ-జనసేన-బీజేపీ విస్తృత సమావేశం జరుగుతుందన్నారు. ఆ సమావేశంలో దిశానిర్దేశం చేసుకుని పశ్చిమ నియోజకవర్గంలో మిత్రపక్షాల గెలుపు కోసం పని చేద్దామని పిలుపునిచ్చారు. బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలు చేసిన నానీని జీవితంలో వదలిపెట్టబోమని బుద్దా వెంకన్న, నాగూల్ మీరా హెచ్చరించారు. నాని పశ్చిమ నియోజకవర్గం వచ్చినప్పుడు ప్రతి డివిజన్ నాయకులు ప్రశ్నించాలని వారు సూచించారు. టీడీపీ నాయకులు కామాదేవరాజ్, ఎస్.శ్రీను, బీజేపీ పశ్చిమ కన్వీనర్ పి.శ్రీహరి, బీజేపీ ఆర్యవైశ్య విభాగం జిల్లా కన్వీనర్ జి.జయబాబు పాల్గొన్నారు.

బీజేపీలోకి కాకాని తరుణ్



విజయవాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అమరావతి బోటింగ్ క్లబ్ అధ్యక్షుడు తరుణ్ కాకాని బీజేపీ తీర్థం తీసుకోబోతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో కాషాయ కండువాను వేసుకోబోతున్నారు. తరుణ్ జిల్లా వినియోగదారుల పరిరక్షణ మండలి సభ్యుడిగా, స్కల్లింగ్ అండ్ రోయింగ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. ప్రత్యేకహోదా, విభజన హామీల కోసం జై ఆంధ్రా డెమాక్రటిక్ ఫోరంను ఏర్పాటు చేశారు. ఆయన బెంజ్ సర్కిల్‌లోని స్వాతంత్ర్య సమర యోధుడు, తన తాతయ్య కాకాని వెంకట రత్నం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీగా బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం పురందేశ్వరి సమక్షంలో పార్టీలో చేరతారు.

పాలడుగుకు సత్కారం



పాలడుగు లక్ష్మణరావును సత్కరిస్తున్న ఆంజనేయులు

భవానీపురం, మార్చి 15: వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదాను కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ప్రకటించిన సందర్భంగా సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావుకు మొగల్రాజపురంలో కృష్ణా విఎల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో శుక్రవారం సత్కరించారు. దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందిస్తూ నగరానికి వన్నె తెచ్చిన సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు ఈ ఘనత దక్కడం సంతోషకరమని చలసాని అన్నారు.

ఆసరా నగదు ఇప్పించండి

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 15: తమ డ్వాక్రా గ్రూపులో పడాల్సిన ఆసరా నగదు వేరొక గ్రూపులో జమ అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారని, విచారణ జరిపి తమ డబ్బులు తమకు ఇప్పించాలని న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన ఓ పొదుపు సంఘం సభ్యులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన పలువురు మహిళలు బిస్మిల్లా పొదుపు సంఘం పేరుతో డ్వాక్రా గ్రూపును నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది పడాల్సిన ఆసరా నగదు ఆ గ్రూపు ఖాతాలో జమ కావడం లేదు. దీంతో గ్రూపు సభ్యులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా సమస్య పరిష్కరించకపోవడంతో రెండు నెలల క్రితం స్పందనలో కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగకపోవడంతో ఆ గ్రూపు సభ్యులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసును ఆశ్రయించారు. తమ గ్రూపునకు ఏడాదికి రూ.80 వేలు ఆసరా నగదు జమ కావల్సి ఉందని, మూడేళ్లుగా ఆ నగదు తమకు అందలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బిస్మిల్లా పేరుతోనే 29వ డివిజన్ మధురానగర్‌లో మరో పొదుపు సంఘం ఉందని అందులో తమ డబ్బు జమ అవుతున్నట్టుగా అధికారులు చెబుతున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

టీడీపీ జెండా దిమ్మె ధ్వంసానికి యత్నం



రాణిగారితోట, మార్చి 15: టీడీపీ జెండా దిమ్మెను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన రాణిగారితోటలో జరిగింది. నాలుగురోడ్ల సెంటర్‌లో 1998లో నిర్మించిన టీడీపీ జెండా దిమ్మె ఉంది. రాణిగారితోటలోని 17,18 డివిజన్ల పార్టీ ప్రధాన కార్యక్రమాలు దాదాపు ఈ జెండా దిమ్మె వద్ద జరుగుతుంటాయి. గురువారం రాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ జెండా దిమ్మెను ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. జెండా పోల్‌ను తొలగించేందుకు ప్రయత్నించగా పోల్ పటిష్టంగా ఉండడంతో దానిని తొలగించేందుకు సాధ్యం కాకపోవడంతో కొంతవరకు వంచారు. శుక్రవారం ఉదయం గమనించిన టీడీపీ నాయకులు అక్కడే ఉన్న సీసీ కెమెరాలో పరిశీలించగా 8మంది దిమ్మెను ధ్వంసం చేస్తున్నట్లు ఉండడంతో వారు కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

వేదపాఠశాల విద్యార్థులకు

మెరుగైన వసతులు కల్పించాలి

వన్‌టౌన్, మార్చి 15: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో పోరంకిలో నిర్వహిస్తున్న వేదపాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని దేవస్థాన ఈవో కేఎస్ రామారావు సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోరంకిలోని దుర్గగుడి వేదపాఠశాలను ఈవో సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వేద విద్య, వసతులపై ఆరా తీశారు.

రేపు రెల్లి ఆత్మగౌరవ సభ

ధర్నాచౌక్, మార్చి 15: రెల్లి సామాజికవర్గాన్ని రాజకీయ పార్టీలు సరిగా గుర్తించడం లేదని రెల్లి సంఘం అధ్యక్షుడు నిమ్మకాయల రమణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రెల్లి సామాజికవర్గ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు, పిల్లల భవిష్యత్, జాతీ భవిష్యత్‌పై చర్చించేందుకు ఈనెల 17న విజయవాడలో ఆత్మీయ సమ్మేళన ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పార్టీలకతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు

ఐపీ బ్రేక్‌కు సిఫారసు లేఖలు రద్దు: టీటీడీ

తిరుమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనానికి సిఫారసు లేఖల స్వీకరణను టీటీడీ శనివారం నుంచి రద్దు చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ శనివారం వెలువడే అవకాశమున్న నేపథ్యంలో ఆదివారం నుంచి వీఐపీ బ్రేక్ దర్శనాలు కేవలం స్వయంగా వచ్చే ప్రొటోకాల్ పరిధిలోని వీఐపీలకు మాత్రమే వర్తించనున్నాయి. దీనికి సంబంధించిన సమాచారాన్ని శుక్రవారం రాత్రి ప్రజాప్రతినిధులకు, బోర్డు సభ్యులకు టీటీడీ అందజేసింది.



పాతశివాలయంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకొంటున్న ఆలయ ధర్మకర్త శాంతి, పాల్గొన్న చైర్మన్, పలువురు సభ్యులు

పాతశివాలయంలో ధర్మకర్త పుట్టినరోజు వేడుకలు

వన్‌టౌన్, మార్చి 15: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో ఆలయ ధర్మకర్త వి.శాంతి పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయాల్లో పుట్టినరోజు వేడుకలు జరుపుకోకూడదు. అందుకు విరుద్ధంగా ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బి.మధు, పలువురు ధర్మకర్తల సమక్షంలో ధర్మకర్త వి.శాంతి ఈనెల 5న పుట్టినరోజు వేడుకలు ఆలయంలో జరుపుకొని, కేక్‌కట్ చేశారు. ఈ ఘటనపై ఆలయ అర్చకస్వాములు, పలువురు భక్తులు ఆలయబోర్డు చైర్మన్, ధర్మకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ఇన్‌ఛార్జ్ ఈవో లోకేశ్వరిని దీనిపై వివరణ అడుగగా ధర్మకర్త శాంతి పుట్టినరోజు సందర్భంగా కేక్‌కట్ చేసిన మాట వాస్తవమేనని తెలిపారు.

22, 23, 24 తేదీల్లో జీఐ మహోత్సవం

వన్‌టౌన్, మార్చి 15: ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్(ఏపీ ఛాంబర్స్), కేఎల్ విశ్వవిద్యాలయం సహకారంతో ఈనెల 22, 23, 24 తేదీల్లో నగరంలోని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రాంగణంలో భారత్ జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం బందర్‌రోడ్డులోని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మహోత్సవ పోస్టర్‌ను నిర్వాహకులు ఆవిష్కరించారు. పలు రాష్ట్రాల నుంచి వందమంది జీఐ ట్యాగ్ ఉన్న ఉత్పత్తి తయారీ దారులు తమ ఉత్పతులను ప్రదర్శిస్తారని, మరిన్ని వివరాల కోసం 9553579000 నెంబర్‌ను సంప్రదించాలని కేఎల్ యూనివర్సిటీకి చెందిన ప్రతినిధి డాక్టర్ రాఘవరావుకోరారు. ఏపీ చాంబర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు ఏపీ ఛాంబర్స్ జనరల్ సెక్రటరీ బి.రాజశేఖర్, పునరావస వృత్తి నిపుణురాలు బిఅనితజ్యోతి, ఫోరంఫర్ ఆర్టిస్ట్ శ్రీనివాస్, ఫ్యాషన్ డిజైనర్ అనీసా బేగం, ఇన్నర్ విల్ మిడ్‌టౌన్ ప్రెసిడెంట్ హరితాచౌదరి పాల్గొన్నారు.

జ్యోతిష్యం అబద్ధం..బూటకం

- రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లొస్తాయో జ్యోతిష్యులు చెబితే సత్కరిస్తాం: ఏపీ హేతువాద సంఘం

భవానీపురం, మార్చి 15: "జ్యోతిష్యం అబద్ధం..బూటకం. రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో నియోజకవర్గాల వారీగా ముందుగా కచ్చితంగా చెబితే ఆ జ్యోతిష్కుడికి సన్మానం చేస్తాం." అని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య సవాల్ విసిరారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. "రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్నిసీట్లు వస్తాయో, 175 నియోజకవర్గాల్లో ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తాడో ఎన్నికలకు 10 రోజుల ముందుగా సీల్డ్ కవర్లో రిజిస్టర్ పోస్టు ద్వారా నార్నె వెంకటసబ్బయ్య, అధ్యక్షుడు ఏపీ హేతువాద సంఘం, సమతానగర్, ఒంగోలు-523002 అడ్రస్‌కు పంపండి. ఎన్నికలు ఫలితాలు ప్రకటించిన మరుసటి రోజు ప్రెస్‌క్లబ్‌లో సీల్డ్ కవర్ పెద్దల సమక్షంలో తెరిచి కచ్చితంగా చెప్పిన జ్యోతిష్కుడిని సన్మానిస్తాం." అని నార్నె పేర్కొన్నారు.

పేపర్ క్విల్లింగ్ ఆర్టిస్ట్ మేడా రజినికి ప్రశంస

కృష్ణలంక, మార్చి 15: నగరానికి చెందిన పేపర్ క్విల్లింగ్ ఆర్టిస్ట్ మేడా రజిని కళానైపుణ్యాన్ని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ప్రశంసించారు. పనికి రావనుకున్న పేపర్ ముక్కలతో రమణీయమైన కళాకృతులను చేయడం ఆమెకే చెల్లిందన్నారు. గత సంవత్సరం మహానంది జాతీయ పురస్కారం, ఇటీవల మహిళా దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ మిడ్‌టౌన్ వారి నుంచి ప్రత్యేక సన్మాన సత్కారాలను పొంది మహిళలకు రజిని మార్గదర్శకంగా నిలుస్తున్నారని అన్నారు.

ముస్లింలకు ద్రోహం చేసింది జగనే

- వాళ్ల పథకాలన్నీ రద్దు చేశాడు
- బీజేపీతో పొత్తుపై తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలి
- రాష్ట్ర భవిష్యత్ కోసమే మూడు పార్టీల మైత్రి
- చరిత్రలో నిలిచేలా 'పేట' సభ: చంద్రబాబు
- టీడీపీ నేతలతో టెలి కాన్ఫరెన్స్

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ముస్లింలకు ద్రోహం చేసింది సీఎం జగనేనని.. వారి పథకాలన్నీ రద్దు చేశాడని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. వారికి ఏమీ చేయకుండా మళ్లీ మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని.. బీజేపీతో టీడీపీ పొత్తుపై వైసీపీ తప్పుడు ప్రచారానికి దిగుతోందని విమర్శించారు. దీనిని పూర్తిస్థాయిలో తిప్పికొట్టాలని టీడీపీ నేతలకు పిలుపిచ్చారు. ఆయన శుక్రవారం వారితో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముస్లింలకు ఉన్న 4 శాతం రిజర్వేషన్లు కాపాడింది టీడీపీయేనని.. పార్టీ తరఫున ఆనాడు న్యాయస్థానంలో వాదించేందుకు న్యాయవాదులను నియమించామని గుర్తుచేశారు. మత సామరస్యాన్ని కాపాడామని, ఉర్దూ యూనివర్సిటీ, హజ్‌హౌస్‌ల నిర్మాణంతో పాటు ఉర్దూను రెండో అధికార భాషగా చేశామన్నారు. పండుగ సమయంలో రంజాన్ కానుకతో పాటు దుల్హన్ పథకంతో ముస్లింలను ఆదుకున్నామని.. టీడీపీ ముస్లింల కోసం తీసుకొచ్చిన 10 పథకాలను జగన్ రద్దు చేశాడని అన్నారు. వలంటీర్లను ఇంటింటికీ పంపి తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని, దానిని ఎండగట్టాలని నేతలను కోరారు. చిలకలూరిపేట సభను చరిత్రాత్మకంగా నిర్వహించబోతున్నామని, పొత్తు ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. 'ప్రజలు గెలవాలి, రాష్ట్రం నిలవాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నాం. ఎవరికి ఎన్ని సీట్లు అనేది ముఖ్యం కాదు. పొత్తులో భాగంగా ఇచ్చి పుచ్చుకునే ధోరణితో ఉండాలి. ఎవరూ తక్కువ కాదు.. ఎవరూ ఎక్కువా కాదు. రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడుకోవడం అందరి బాధ్యత. మూడు పార్టీల నేతలు ఏకతాటిపైకి రావాలి. జగన్ అరాచకాలతో రాష్ట్రం ధ్వంసమైంది. కేంద్ర సాయం ఉంటే రాష్ట్రాభివృద్ధికి నిధులు వస్తాయి. ప్రచారంలో ఎవరు ముందుంటారో వారిదే యుద్ధంలో పై చేయి అవుతుంది. జాతీయ మీడియా సర్వేలతో మనమే గెలుస్తామని తేలిపోయింది. 20 పార్లమెంట్ సీట్లు గెలుస్తామని చెబుతున్నారు. మరింత కృషి చేస్తే 25 సీట్లు గెలుస్తాం. దొంగ ఓట్లకు అవకాశమే ఉండకూడదు. జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత మన పైనే ఉంది' అని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఐదేళ్లుగా ప్రాణాలకు తెగించి పోరాడారని, సీట్లు త్యాగం చేసిన వారికి ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లుగా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

నకిలీ లేఖపై సీఐడీ చీఫ్‌కు వర్మ లేఖ

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పిఠాపురం పార్టీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ఎన్ వర్మ మధ్య విభేదాల సృష్టికి అచ్చెన్నాయుడి పేరుతో నకిలీ లేఖ తయారుచేసి ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఐడీ చీఫ్‌కు ఆయన లేఖ రాశారు. పిఠాపురం టీడీపీ ఇన్‌చార్జి వర్మ సస్పెన్షన్ అంటూ ఫేక్ లేఖ వైరల్ చేశారని.. ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించినందుకు చంద్రబాబును, లోకేశ్‌ను వర్మ విమర్శించారని.. దాంతో ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ఆ నకిలీలో లేఖలో ఉంది.




బహిరంగ సభ, వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

రేపే ఎన్డీయే 'ప్రజాగళం'

- బొప్పూడిలో బహిరంగ సభ
- సభ విజయవంతానికి కూటమి పిలుపు

చిలకలూరిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి తొలి బహిరంగ సభకు పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. సభకు 'ప్రజాగళం' అని నామకరణం చేశారు. బహిరంగ సభకు టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనేతల సారథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేసుండగా, శుక్రవారంనాటికి తుది దశకు చేరుకున్నాయి. ఈ సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరు కానున్న నేపథ్యంలో అసాధారణ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్‌పీజీ నిఘాలో పనులు జరుగుతున్నాయి. వేదిక ప్రాంతమంతా బాంబ్ స్క్వాడ్‌లు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ప్రధాని మోదీ కోసం మూడు హెలిప్యాడ్‌లను బీటీతో నిర్మిస్తున్నారు. 300 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. వేదికను 8 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్నారు. సభ ముగిసే సరికి రాత్రి కానుండటంతో భారీగా విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. వేదిక వరకే షెడ్ నిర్మించారు. ప్రజలు కుర్చోని నేతల ప్రసంగాలు వినేందుకు వీలుగా కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. లక్షలాదిగా తరలివచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో సకల ఏర్పాట్లు జరుగుతున్నాయి. జాతీయ రహదారి పక్కనే సభ జరుగుతున్నందున వేదిక ఎదురుగా రహదారి పక్కనే వాహనాల పార్కింగ్ వసతి కల్పిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, ప్రజలు లక్షల సంఖ్యలో తరలివస్తారని అంచనాతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం కల్లా అన్ని ఏర్పాట్లు పూర్తి కానున్నాయి.

ఆర్టీసీ.. ఇతర వాహనాలు

బస్సులు ఇచ్చేందుకు ఆర్టీసీ అంగీకరించింది. ఆదివారం కావడంతో విద్యా సంస్థల బస్సులను వినియోగించుకునేలా ఆయా పార్టీల నేతలు ప్రణాళిక రూపొందించారు. జన సమీకరణ కోసం అవసరమైన కార్లు, ఇతర వాహనాలను కూడా భారీగానే సమకూరుస్తున్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో ఒక్కో నియోజకవర్గం నుంచి 5 వేల నుంచి 10 వేల మంది బైక్‌లపై రావాలని చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కల్యాణ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, మూడు పార్టీలకు చెందిన ముఖ్య నేతలు హాజరుకానున్నారు. కాగా, సభ ఏర్పాట్లను మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు టీడీ జనార్దన్, నన్నపనేని రాజకుమారి, కొమ్మారెడ్డి పట్టాభిరాం, జనసేన నాయకులు కళ్యాణం శివశ్రీనివాస్, ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీ మాగుంట బాబు తదతర నేతలు పరిశీలించారు.

సువర్ణాక్షరాలతో లిఖించేలా ప్రజాగళం: అచ్చెన్న

సభా ప్రాంగణంలో పనులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం శుక్రవారం రాత్రి పరిశీలించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్ర భవిష్యత్తు కోసం కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులు పెట్టుకున్నాయి. మోదీ హాజరయ్యే బొప్పూడి ప్రజాగళం సభ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది. కుల, మతాలకు అతీతంగా ప్రజలు పొత్తును ఆశీర్వదించాలి. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే వారంతా ప్రజాగళం సభలో పాల్గొని విజయవంతం చేయాలి. జగన్ పాలనలో ప్రజలు 5 కోట్ల మంది ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రజల హక్కులను కాలరాశారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల షెడ్యూల్ వెలువడనుంది. దీంతో జగన్ పీడ రాష్ట్రానికి విరగడ కాబోతోంది' అని అన్నారు. కాగా, సభకు వచ్చే ప్రజలకు రవాణా, భోజన తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు: మనోహర్

జనసేన పీఏసీ సభ్యుడు నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ (రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుంది. బొప్పూడి సభలో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలి. జాతీయస్థాయిలో నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు. సభా ఏర్పాట్లకు పోలీసు డిపార్ట్ మెంట్ కూడా సహకరించాలి' అని కోరారు.

సింగిల్ సింహం కథ తేలబోతోంది: పాతూరి నాగభూషణం

బీజేపీ మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం మాట్లాడుతూ.. 'సింహం సింగిల్‌గా వస్తుందని వైసీపీ నేతలు చెబుతున్నారు. సభ తర్వాత ఏం జరుగుతుందో మీరే చూస్తారు. ప్రజాగళం సభ వైసీపీకి విషగళంగా మారుతుంది. రాష్ట్రాభివృద్ధి కోసం సభను ప్రజలంతా విజయవంతం చేయాలి' అని కోరారు.

అవినీతి, అరాచకాన్ని ఆపేందుకే కూటమి: థావడే

అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ థావడే అన్నారు. ఆదివారం చిలకలూరిపేట ఉమ్మడి సభకు ఢిల్లీ నుంచి పార్టీ తరఫున పర్యవేక్షకుడిగా ఆయన వచ్చారు. ఈ సందర్భంగా విజయవాడలో మాట్లాడుతూ, అధ్వాన్నంగా తయారైన ఆంధ్రప్రదేశ్‌ను వికసిత్ ఏపీగా తీర్చిదిద్దడమే కూటమి లక్ష్యమన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో ఏపీ పూర్తిగా నాశనమైందన్నారు.

ప్రధాని మోదీ టూర్ ఇలా..

ప్రధాని మోదీ ఆదివారం సాయంత్రం 4.10 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ గన్నవరం వస్తారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బొప్పూడి వస్తారు. 5 నుంచి 6 గంటల వరకు సభలో ప్రసంగిస్తారు. 6.10 గంటలకు తిరిగి బయలుదేరుతారు. 6.55 గంటలకు గన్నవరం చేరుకుని, రాత్రి 7 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి హైదరాబాద్ వెళతారు.

సభకు తరలిరండి: బాబు

బొప్పూడిలో జరిగే సభకు ముఖ్య అతిథులుగా ప్రధాని నరేంద్రమోదీ, పవన్‌కల్యాణ్, తనతో పాటు ముఖ్య నేతలు పాల్గొంటున్నారని చంద్రబాబు తెలిపారు. ఈ భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని ప్రజలను చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు.

18 సార్లు ప్రధానిని కలిశావ్.. ఏం చేశావ్!?

- జగన్ మన ఆస్తులు, భూములు కూడా అమ్మేస్తాడు: అయ్యన్న

రాజమహేంద్రవరంసిటీ, మార్చి 15: "కేంద్రం మెడలు వంచేస్తా.. 25 మంది ఎంపీలను ఇవ్వండి.. అని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి జగన్.. మీ ఎంపీలను వెంటపెట్టుకుని నువ్వు 18 సార్లు ప్రధాని మోదీని కలిశావ్. మరి ఏం పీకావ్?" అని రాష్ట్ర మాజీ మంత్రి, టీడీపీ నేత చింతకాయల అయన్నపాత్రుడు సీఎం జగన్‌ను ప్రశ్నించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన 'జయహో బీసీ' సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రిపై నిప్పులు చెరిగారు.

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కవిత అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

అంతా అనుకున్నారు. ఈడీ బృందం సోదాలు నిర్వహించి కవిత వాంగ్మూలాన్ని నమోదు చేసుకుని వెళ్తుందని భావించారు. అయితే ఈడీ అధికారులు ఆమె ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే కవితతోపాటు ఇంట్లో సిబ్బంది ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈడీ అధికారులు విచారణ జరిపి వెనుదిరుగుతారని అంతా అనుకున్నా... ఊహించని విధంగా పక్కా ప్లాన్ ప్రకారం వారు ఆమెను అరెస్టుచేసి తీసుకెళ్లారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో సౌత్ లాబీయింగ్‌లో కవిత కీలకంగా వ్యవహరించినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఇప్పటికే సీబీఐ, ఈడీ ఆమెను విచారించాయి. గతంలో కవితను సాక్షిగా విచారించిన దర్యాప్తు సంస్థలు ఆమెను నిందితురాలిగా చేర్చిన తర్వాత మొదటిసారి గత నెలలో సీబీఐ నోటీసులు జారీ చేసింది. అయితే తాను విచారణకు హాజరుకాలేనని ఈ-మెయిల్‌లో కవిత సమాచారం అందించారు. అంతకు సరిగ్గా నెల రోజుల క్రితం ఈడీ కవితకు నోటీసులు జారీ చేసినా ఆమె విచారణకు హాజరుకాలేదు. విషయం సుప్రీం కోర్టులో విచారణలో ఉండగా... అనూహ్యంగా శుక్రవారం ఉదయం ఢిల్లీ నుంచి ఈడీ డిప్యూటీ డైరెక్టర్ భానుప్రియ మీనా నేతృత్వంలో 12 మంది అధికారుల ప్రత్యేక బృందం కవిత ఇంటికి చేరుకుంది. సుమారు నాలుగు గంటల పాటు విచారణ, తనిఖీల అనంతరం సాయంత్రం 5.20కి ఆమెను అరెస్టు చేసినట్లు ఈడీ అధికారులు ప్రకటించారు. లిక్కర్ కేసులో మనీలాండరింగ్ కోణంలో నమోదు చేసిన పీఎంఎల్ఏ చట్టం ప్రకారం అరెస్టు చేస్తున్న విషయాన్ని 14 పేజీల నోటీసు ద్వారా తెలియజేశారు. ఆమె ఎమ్మెల్సీ కావడంతో అరెస్టు సమాచారాన్ని శాసన మండలి అధికారులకు చేరవేసినట్లు తెలిసింది. రాత్రి 7.10 గంటలకు కవితను ఆమె నివాసం నుంచి శంషాబాద్ విమానాశ్రయం తీసుకెళ్లారు. రాత్రి 9 గంటలకు విమానంలో ఢిల్లీకి తరలించారు.

నేడే ఎన్నికల భేరి

(మొదటి పేజీ తరువాయి)

తేదీలను వెల్లడిస్తుంది. ఆంధ్ర, తెలంగాణల్లో ఏప్రిల్ నెలాఖరులో పోలింగ్ జరగొచ్చని తెలుస్తోంది. దేశవ్యాప్తంగా సుమారు 97 కోట్ల మంది అర్హులైన ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వారికోసం 12లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4-5 దశల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగే అవకాశముంది. ఆంధ్ర, అరుణాచల్, సిక్కిం అసెంబ్లీలకు ఒకే దశలో ఎన్నికలు జరుగుతాయంటున్నారు. నక్సల్స్ ప్రభావం కారణంగా ఒడిసాలో నాలుగు దశల్లో జరిగే వీలుంది. ఈ దఫా లోక్‌సభ ఎన్నికలు విపక్ష ఇండియా కూటమికి జీవన్మరణ సమస్యగా మారాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వివిధ సర్వేలు ఎన్డీయే హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని, బీజేపీ సొంతంగా 350 స్థానాలు కైవసం చేసుకుంటుందని అంచనా వేయడంతో అధికార కూటమి సమరోత్సాహంతో ఉంది. కాగా, బీజేపీ ఇప్పటికే 267 మంది అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్ కూడా 82 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. టీఎంసీ బెంగాల్, అసోంలలో పోటీచేసే 47 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆప్, ఎస్పీ కూడా పలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి.

కమిషనర్ల నియామకాలపై స్టేకు నో

సీజేఐని సెలెక్ట్ ప్యానెల్ నుంచి తప్పించి అందులో ఒక కేంద్ర మంత్రిని నియమించేలా 2023లో చేసిన చట్టం ఆధారంగా జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూలను కొత్త ఎన్నికల కమిషనర్లుగా నియమించడంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సాధారణంగా మధ్యంతర ఉత్తర్వుల ద్వారా ఏ చట్టాన్నీ కోర్టు నిలిపివేయదని వ్యాఖ్యానించింది. కొత్త కమిషనర్ల నియామకచట్టాన్ని, జ్ఞానేశ్, సంధూల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై ధర్మాసనం విచారణ జరిపింది. కొత్త కమిషనర్ల నియామకం కోసం సెలెక్ట్ కమిటీ సమావేశాన్ని ముందుకు జరిపారని పిటిషనర్లలో ఒకరైన జయాఠాకూర్ తరఫు సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ ప్రస్తావించారు. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

నేడు తెలంగాణ సీఎం రేవంత్ విశాఖ రాక

- 'సేవ్ విశాఖ-సేవ్ స్టీల్‌ప్లాంట్' నినాదంతో కాంగ్రెస్ బహిరంగ సభ

అమరావతి, విశాఖపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడమే ధ్యేయంగా 'సేవ్ విశాఖ- సేవ్ స్టీల్ ప్లాంట్' నినాదంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం విశాఖపట్నంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. స్టీల్‌ప్లాంట్‌లోని తృష్ణా మైదానంలో జరిగే ఈ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అధ్యక్షతన జరిగే ఈ సభకు రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు మాణిక్యం ఠాగూర్, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి, మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావుతోపాటు పలువురు నాయకులు హాజరు కానున్నారు. సుమారు 70 వేల మందితో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. కాగా, రాష్ట్ర విభజన హామీలలో అత్యంత ప్రధానమైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడ్డ జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం, రామాయపట్నం ఓడరేవు నిర్మాణం వంటి అంశాలపై కాంగ్రెస్ పోరాటం చేస్తామని ప్రకటించింది. ప్రత్యేక హోదాను ప్రత్యేకంగా ఎన్నికల అజెండాలో చేర్చింది. అదేవిధంగా నవరత్నాలలో ఒక్కటైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని, ప్రైవేటీకరణ చర్యలు ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి ఏఐసీసీ ముఖ్యనేత రాహుల్ గాంధీ మద్దతు కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో శనివారం విశాఖలో జరిగే బహిరంగ సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని కాంగ్రెస్ పార్టీ విధానాన్ని వెల్లడిస్తారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సంబంధించి పార్టీ తరఫున డిక్లరేషన్‌ను ప్రకటిస్తామని, మేనిఫెస్టోను కూడా విడుదల చేసే అవకాశముందని నేతలు పేర్కొన్నారు.

వామపక్షాలతో సీట్ల చర్చకు కాంగ్రెస్ రెడీ

- కె.రాజు, గిడుగు రుద్రరాజును నియమించిన ఏఐసీసీ

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమిలో భాగస్వాములైన సీపీఐ, సీపీఎంలతో సీట్ల సర్దుబాటుపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమయ్యింది. వామపక్షాలతో ఇప్పటికే ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి చర్చలు జరిపారు. సీట్ల సర్దుబాటుకు సంబంధించి ప్రతిపాదనలు ఇస్తే.. వాటిపై మరో దఫా చర్చలు జరిపి తుది నిర్ణయం తీసుకుందామని సీపీఎం, సీపీఐ నేతలకు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటుపై వామపక్షాలతో చర్చించేందుకు సీడబ్ల్యుసీ సభ్యులు కె.రాజు, గిడుగు రుద్రరాజులను ఏఐసీసీ నియమించింది.

కోడ్‌కూసే ముందు డీఏ డ్రామా!

(మొదటి పేజీ తరువాయి)

నేతలు మొత్తుకున్నా ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరించింది. అయితే ఎన్నికల కోడ్ వచ్చే ముందు జగన్ సర్కారుకు హఠాత్తుగా ఉద్యోగులపై ప్రేమ పుట్టుకు రావడం విశేషం. మరోవైపు 2024 జనవరిలో ఇవ్వాల్సిన డీఏకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ఇప్పటికీ ఒక డీఏ పెండింగ్‌లోనే ఉన్నట్లు లెక్క. ఇదిలాఉండగా, జ్యుడీషియల్ విభాగం అధికారులు, సిబ్బందికి 2023 జూలై నెలకు సంబంధించిన డీఏను, విశ్రాంత ఉద్యోగులకు డీఆర్‌ను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అసంతుష్టులకు బుజ్జగింపులు

- అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యమిస్తా
- పార్టీ నిర్ణయాన్ని గౌరవించండి.. ఎన్నికల్లో సహకరించండి
- సీట్లు దక్కని నేతలకు బాబు వినతి

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పొత్తులు, ఇతర కారణాలతో ఈసారి ఎన్నికల్లో సీట్లు దక్కని పలువురు నేతలతో టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారమిక్కడ ఉండవల్లిలోని తన నివాసంలో భేటీ అయ్యారు. టికెట్లు ఇవ్వలేకపోవడానికి దారి తీసిన పరిస్థితులను వారికి వివరించారు. విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నిర్ణయాన్ని గౌరవించి ఎన్నికల్లో సహకరించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి ప్రాధాన్యం ఇస్తామని, తగిన రీతిలో గౌరవిస్తామని హామీ ఇచ్చారు. ఆయన్ను కలిసి మాట్లాడిన వారిలో మాజీ మంత్రులు కిమిడి కళావెంకట్రావు, కేఎస్ జవహర్, మాజీ ఎమ్మెల్యేలు కొమ్మాలపాటి శ్రీధర్, బోడె ప్రసాద్, వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), బూరగడ్డ వేదవ్యాస్, బొరగం శ్రీనివాస్, పోలంరెడ్డి శ్రీనివాసరెడ్డి, బూరుగుపల్లి శేషారావు, వంతల రాజేశ్వరి, నియోజకవర్గ ఇన్‌చార్జులు వలవల బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, విశ్వనాథనాయుడు తదితరులు ఉన్నారు. చంద్రబాబును కలిసి బయటకు వచ్చాక కళావెంకట్రావు మీడియాతో మాట్లాడారు. అధినేతతో చర్చలు సంతృప్తికరంగా జరిగాయని, (ఎచ్చెర్ల) నియోజకవర్గానికి వెళ్తున్నానని చెప్పారు. చంద్రబాబు చెప్పిన విషయాలు తనకు నిరాశ కలిగించాయని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసే విషయం ఆలోచిస్తున్నానని బోడె ప్రసాద్ అన్నారు.



రంపచోడవరం సీటు తమకే ఇవ్వాలంటూ చంద్రబాబు నివాసం వద్ద ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, ఆమె మద్దతుదారులు

టీడీపీలో చేరిన బైరెడ్డి శబరి

మాజీఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కుమార్తె బైరెడ్డి శబరి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ అధినేత ఆమెకు పసుపుకండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

రాజేశ్వరిని సముదాయించిన బాబు

రంపచోడవం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి తమకు న్యాయం చేయాలని కోరేందుకు చంద్రబాబుని కలవాలని ప్రయత్నం చేశారు. అది కుదరకపోవడంతో ఇంటివద్ద బైఠాయించి నినాదాలు చేశారు. చంద్రబాబు ఆమెను పిలిచి మాట్లాడారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు.

టీడీపీలోకి వైసీపీ నేతలు

యర్రగొండపాలెంకు చెందిన వైసీపీ నేతలు పలువురు లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. శుక్రవారం యర్రగొండపాలెం వైసీపీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు ఉండవల్లి నివాసం వద్దకు రాగా లోకేశ్ వారికి పచ్చకండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. యర్రగొండపాలెంలో ఎరిక్సన్ బాబును భారీ మెజారిటీతో గెలిపించి తీసుకురావాలని ఈ సందర్భంగా లోకేశ్ వారికి సూచించారు.



టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె శబరికి పార్టీ కండువా కప్పుతున్న చంద్రబాబు

జనసేనలో అసమ్మతి స్వరాలు

- తిరుపతి నేతలతో నాయకత్వం చర్చలు
- పార్టీ నిర్ణయానికి కట్టుబడాలని సూచన

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పొత్తులో సీట్లు కోల్పోయిన నేతలను బుజ్జగించేందుకు జనసేన రాష్ట్ర కార్యాలయం రంగంలోకి దిగింది. అసంతృప్తితో ఉన్న నాయకులతో సీనియర్లు సంప్రదింపులు జరుపుతున్నారు. తిరుపతి అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులును ప్రకటించిన వెంటనే స్థానిక శ్రేణులు ఆందోళనకు దిగాయి. తిరుపతిలో ఆయనకు వ్యతిరేకంగా హోర్డింగ్‌లు కూడా ఏర్పాటు చేశారు. వెంటనే స్పందించిన పార్టీ కార్యాలయం.. స్థానిక నాయకులతో సంప్రదింపులు జరిపింది. పార్టీ నిర్ణయానికి కట్టుబడి పని చేయాలని సూచించింది. నిరసనలను అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా పరిగణిస్తున్నారని, అధికారిక అభ్యర్థికి మద్దతివ్వాలని స్పష్టం చేసింది. దీంతో చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్.. ఆరణితో కలిసి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. భీమవరంలో కూడా కొంత ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది. పవన్ అక్కడ పోటీ చేయాలని స్థానిక నాయకులు గట్టిగా పట్టుబట్టారు. కానీ ఆయన టీడీపీ నుంచి వచ్చిన పులపర్తి రామాంజనేయులును అభ్యర్థిగా ప్రకటించారు. దీనిని వారు వ్యతిరేకించారు. పవన్ నేరుగా రంగంలోకి దిగి వారికి నచ్చజెప్పడంతో అధినేత నిర్ణయానికి కట్టుబడి ఉండేందుకు వారు సమ్మతించారు. విజయవాడ పశ్చిమలో జనసేన నేత పోతిన మహేశ్‌కు టికెట్ ఇస్తానని పవన్ గతంలో పలుసార్లు చెప్పారు. అయితే ఆ నియోజకవర్గం పొత్తులో బీజేపీకి వెళ్లింది. దీనిపై మహేశ్ అసంతృప్తి వ్యక్తంచేస్తూ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ కార్యాలయం స్పందించి.. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని సూచించింది. ఆయన తన నిర్ణయాన్ని ఇంకా ప్రకటించలేదు. ధర్మవరం సీటును పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తొలినుంచీ ఆశిస్తున్నారు. ఇప్పుడు దానిని బీజేపీకి కేటాయించడంతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 18న భావికార్యాచరణ ఖరారు చేసుకోనున్నారు. వీటితో పాటు మరికొన్ని నియోజకవర్గాల్లో అంతర్గతంగా అసంతృప్తి రేగుతోంది. పవన్ స్వయంగా జోక్యం చేసుకుని వీరికి నచ్చజెప్పాలని నేతలు కోరుతున్నారు.

టార్గెట్ దక్షిణాది

- ఐదు రాష్ట్రాల్లో మోదీ సుడిగాలి పర్యటన

న్యూఢిల్లీ, మార్చి 15: దక్షిణాది రాష్ట్రాల్లో మరింత బలం పుంజుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ప్రధాని మోదీ ఈ లక్ష్య సాధనకు నడుం బిగించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో ఆయన సుడిగాలి పర్యటనలకు శ్రీకారం చుట్టారు. వీటిలో ఒక్క శుక్రవారమే మూడు రాష్ట్రాల్లో ఆయన పర్యటనలు సాగాయి. దక్షిణాది రాష్ట్రాల్లోని లోక్‌సభ సీట్లలో బీజేపీ పుంజుకుని, మరిన్ని ఎక్కువ సీట్లను కమలం ఖాతాలో వేసుకోవాలని నిర్ణయించారు. ఈ నెల 19 వరకు ఆయన దక్షిణాది రాష్ట్రాల్లోనే పర్యటించనున్నారు. 17న ఏపీలో పర్యటించనున్న ఆయన టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడిగా నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. శనివారం తెలంగాణలోని నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం కర్ణాటకలోని గుల్బర్గాలో పర్యటిస్తారు. 18న జగిత్యాలలో నిర్వహించే రోడ్ షో సహా బహిరంగ సభల్లోనూ పాల్గొంటారు. అనంతరం మళ్లీ కర్ణాటకకు వెళ్లి శివమొగ్గలో నిర్వహించే కార్యక్రమాల్లో మోదీ పాల్గొంటారు. అక్కడ నుంచి తమిళనాడుకు వెళ్తారు. కోయంబత్తూరులో నిర్వహించే రోడ్ షోలో ప్రధాని పాల్గొననున్నారు. 19న కేరళకు వెళ్లి అక్కడి పాలక్కాడ్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. తిరిగి తమిళనాడుకు చేరుకుని సేలంలో నిర్వహించే రోడ్ షోలో పాల్గొంటారు. కాగా, శుక్రవారం తమిళనాడు, కేరళ, తెలంగాణలలో జరిగిన కార్యక్రమాల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. కాగా, దక్షిణ కేరళలోని పతనంతిట్టలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. 'గత ఎన్నికల్లో కేరళ ప్రజలు మమ్మల్ని రెండంకెల ఓట్ల శాతం కలిగిన పార్టీని చేశారు. ఇక్కడ మేం రెండంకెల సీట్ల లక్ష్యాన్ని సాధించే రోజు ఎంతో దూరంలో లేదు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో కమలం వికసించడం ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు.

శ్రీకాకుళం బీజేపీకి ఇవ్వొద్దు

- రామ్మోహన్ ఇంటిముందు టీడీపీ ధర్నా

శ్రీకాకుళం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం అసెంబ్లీ సీటును బీజేపీకి ఇవ్వొద్దని ఆ నియోజకవర్గ టీడీపీ శ్రేణులు ధర్నాకు దిగాయి. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇంటి ముందర శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండ లక్ష్మీదేవి అనుచరులు, మద్దతుదారులు ధర్నా చేపట్టారు. అక్కడ గుండ లక్ష్మీదేవికే టిక్కెట్ కేటాయించాలన్నారు. అధిష్ఠానం వెంటనే దీనిపై నిర్ణయం తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. అనంతరం లక్ష్మీదేవి ఇంటికి చేరుకుని సమావేశమయ్యాయి. ఈ సమయంలో గుండ లక్ష్మీదేవి కన్నీటిపర్యంతమయ్యారు.



సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన కాపు నేత ముద్రగడ పద్మనాభం

వైసీపీలో చేరిన ముద్రగడ

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఉభయగోదావరి జిల్లాల వైసీపీ సమన్వయకర్త, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరుల సమక్షంలో కుమారుడు గిరితో కలసి వైసీపీలో ముద్రగడ చేరారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ విజయానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌తో ముద్రగడ చెప్పారు. కాగా, చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు.

వైసీపీ తుది జాబితా నేడే!

- నేడు ఇడుపులపాయలో అభ్యర్థులను ప్రకటించనున్న జగన్!!

పులివెందుల రూరల్, మార్చి 15: సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే వైసీపీ అభ్యర్థుల తుది జాబితాను సీఎం జగన్ శనివారం ప్రకటించే వీలుంది. ఆయన శనివారం మధ్యాహ్నం 12.05 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్లో బయల్దేరి 12.30కు ఇడుపులపాయ హెలిప్యాడ్‌లో దిగుతారు. రోడ్డు మార్గాన 12.40 గంటలకు వైఎస్సార్ ఘాట్ చేరుకుంటారు. తండ్రి రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. ఆ సందర్భంగా అసెంబ్లీ, లోక్‌సభ అభ్యర్థుల తుది జాబితాను విడుదలచేసే వీలుందని వైసీపీ వర్గాలు వెల్లడించాయి. 1.25 గంటలకు గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 1.45 గంటలకు కడప విమానాశ్రయానికి బయల్దేరతారు. 2.15 గంటలకు విమానంలో గన్నవరం వెళ్తారు.

రక్తంలో మునిగిన వైసీపీ పునాదులు

(మొదటి పేజీ తరువాయి)

అనేక ఆరోపణలు చేస్తున్నారు. నేను, నా కుటుంబం ఏదో చేశామని ఫిర్యాదులు చేస్తున్నారు. మీరు (జగన్‌ను ఉద్దేశించి) ప్రభుత్వంలో ఉన్నారు. మీరు దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తున్నారా? లేక ప్రజలకు ఫిర్యాదు చేస్తున్నారా? ప్రభుత్వంలో ఉన్న మీకు ఇది తప్పు అనిపించడం లేదా? సీబీఐ వాళ్లు న్యూస్‌పేపర్‌లో ఒక యాడ్ వేశారు. ఎవరికైనా వివేకా హత్య గురించి సమాచారం తెలిసి, తమకు అందిస్తే రూ.5లక్షల రివార్డు ఇస్తామని ప్రకటించారు. మా కుటుంబమే హత్య చేసిందని మీరు అంటున్నారు కదా! మేమే చంపినాం అని సీబీఐ వాళ్లకు చెబితే రూ.5లక్షల రివార్డు మీకు వస్తుంది. మీ బాధ్యత మీరు చేయకుండా ఎప్పుడూ మా మీద నిందలు మోపడం ఎందుకు? మీ పని మీరు చేయకుండా ఉండడానికి సిగ్గుగా లేదా?" అని సునీత ప్రశ్నించారు. ఇంకా ఆమె ఏమన్నారంటే..

అన్నం పెట్టిన చేతినే నరుకుతారా?

"పదేపదే సునీత, సునీత కుటుంబం వివేకాను హత్య చేసింది అంటున్నారు.. జూన్ 2019 నుంచి మార్చి 2020 వరకు మీ ప్రభుత్వమే దర్యాప్తు చేసింది కదా? ఆ సమయంలో మమ్మల్ని ఎందుకు అరెస్టు చేయలేదు? 'సాక్షి'లో రకరకాల కథనాలు వేస్తున్నారు. 'సాక్షి' ఛైర్మన్ భారతికి నాదో విన్నపం.. మీ దగ్గర ఆధారాలుంటే, వాటిని దయచేసి దర్యాప్తు సంస్థకు అప్పగించండి. సమాచారం ఉండి అది పోలీసులకు ఇవ్వకుంటే నేరం. సమాచారం తీసుకొని సీబీఐకి ఇవ్వండి. వారి మీద నమ్మకం లేకుంటే కోర్టుకు వెళ్లండి. ఆ రోజు రాత్రి చనిపోయే వరకు, అంటే రాత్రి 11గంటల వరకు వైసీపీ కోసమే వివేకా ప్రచారం చేశారని మీరే అన్నారు కదా! మరి మీకోసం అంత కష్టపడిన వ్యక్తి హత్యకు గురైతే.. ఆ హత్య వెనుక కుట్రకోణాలు బయటపెట్టాల్సిన బాధ్యత మీకు లేదా? మీకోసం ఆయన పదవిని కూడా త్యాగం చేశారు కదా! మరి ఆ మహానుభావుడిని మరచిపోయారా? ఆయన చనిపోయి ఇన్నాళ్లయినా ఒక్కసారి అయిన ఆయన జయంతికి గానీ ఆయన వర్ధంతికి గానీ ఆయన సమాధి వద్దకు ఒక్కసారి అయినా వచ్చారా? 2019లో ఎన్నికలు అయిపోయిన తర్వాత ఆయన మీకు చేసిన మేలును ఒక్కసారి అయినా మాట్లాడారా? గుర్తుచేసుకున్నారా? అన్నం పెట్టిన చేతిని నరకడమే కాకుండా ఆయన కుటుంబాన్ని అడుగడుగునా వేధించడం వారి వ్యక్తిగతం జీవితంపై బురదజల్లడం ఏమిటి?

వైసీపీ నుంచి బయటకు రండి!

"పదవులు త్యాగం చేసిన చిన్నాన్నకు, అన్న కోసం పగలనక రాత్రనక తిరిగిన చెల్లికి వారు ఇచ్చిన కానుకలు చూశాం. వైసీపీ ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, నాయకులకు ఒక సలహా ఇస్తున్నా! మీ భవిష్యత్తు కోసం ఈ ప్రభుత్వం నుంచి బయటకు రండి. లేకపోతే ఈ పాపం మీకు కూడా చుట్టుకుంటుంది. ఆయనతో పాటు మిమ్మల్ని కూడా ఊబిలోకి తీసుకెళ్తాడు"



వైఎస్ వివేకానందరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సునీత

నేను కోరేది ఒక్కటే...

"నేను కోరేది ఒకటే. వివేకాకు జరిగింది మరెవరికీ జరగకూడదు. అలా జరగాలంటే ఎవరైతే ఈ హత్యకు పాల్పడ్డారో వారందరికీ తప్పకుండా శిక్ష పడాలి. శిక్ష పడితే ఇంకొకరు ఇలాంటి పనులు చేయడానికి భయపడతారు. ఇప్పటికి ఐదేళ్లు పూర్తయింది. ఇంతవరకు పూర్తి సమాచారం రాలేదు. ట్రైల్స్ కూడా మొదలు పెట్టలేదు. ఈ కేసు ఇంకా పది సంవత్సరాలు జరగవచ్చేమో! అలా జరగకుండా ఉండాలంటే శాంతిభద్రతలను మన రాష్ట్రంలో సక్రమంగా కొనసాగాలంటే.. అత్యాచారాలు ఆగాలంటే, తప్పు చేసిన వారికి శిక్ష పడాలి. ఓటు మనకు ఆయుధం. దయచేసి మా అన్న పార్టీకి ఓటు వేయవద్దు.. ఈ ప్రభుత్వం దిగితే ప్రజా కోర్టులో న్యాయం జరుగుతుంది. అదిచూసి న్యాయస్థానంలో త్వరగా తీర్పురావచ్చు. హంతకులకు ఓటు వేయవద్దు. పార్టీ ముఖ్యం కాదు, నేను నిల్చున్నా నిల్చుకోకపోయినా మన చేతిలోని అస్త్రం ఓటు.. దానిని అందరూ వినియోగించుకోవాలి"

దేనికోసం పోరాడుతున్నానో.. అదే నేరం మోపుతారా?

"2019 మే 30వ తేదీన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. 'రాష్ట్ర ముఖ్యమంత్రిగా నా పరిశీలనకు వచ్చిన, లేదా నాకు తెలియవచ్చిన ఏ విషయాన్నీ, నా కర్తవ్యాలను సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన మేరకు తప్ప, ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ, ఏ వ్యక్తికీ లేదా వ్యక్తులకూ తెలియపరచనని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నా'నంటూ ప్రమాణం చేశారు. ఈ ప్రమాణాన్ని చూసి భవిష్యత్తు పట్ల చాలా భరోసా వచ్చిందని సంతోషపడ్డాం. మీ చిన్నాన్నను చంపిన వారికి, చంపించినవారికి శిక్షపడేలా చూసే బాధ్యత ముఖ్యమంత్రిగా మీకు ఉంది. ఇప్పటి వరకు ఆ దిశగా ఎందుకు పనిచేయలేదు. దర్యాప్తు సంస్థను తన పనిని తాను చేసుకోనివ్వకుండా, మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుపడుతోంది. నేరస్థులకు శిక్ష పడేందుకు పోరాటం చేస్తున్న నా మీద, నా కుటుంబం మీద అదే నేరం మోపుతున్నారు" అని సునీత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి తులసిరెడ్డి, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, నాగోతు రమేశ్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, కేవీపీ రామచంద్రరావు, వరదరాజులరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఉదయం పులివెందులలోని వివేకా సమాధి వద్ద ఆయన భార్య సౌభాగ్యమ్మ, డాక్టర్ సునీత, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ షర్మిల తదితరులు నివాళులు అర్పించారు.

"గూగుల్ మ్యాప్‌లు అయితేనేమి, కాల్ రికార్డులు అయితేనేమి, వాంగ్మూలాలు అయితేనేమి...అవన్నీ హత్య చేసింది వీళ్లేనని వేలెత్తి చూపుతున్నా, ఈరోజు వరకు కూడా హత్య చేసినవాళ్లకు, హత్య చేయించిన వాళ్లకు శిక్షలు పడలేదు. కేసు కొలిక్కి రాలేదు. కేసు అసలు ముందడుగు వేయలేదు. ఎందుకని? ఎందుకంటే అన్నా అని పిలిపించుకున్నవాడే ఈరోజు హంతకులకు రక్షణ కల్పిస్తున్నాడు"

- వైఎస్ షర్మిల

వైఎస్ వివేకానందరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న షర్మిల →



అన్నా అని పిలిపించుకున్నవాడే..
హంతకులను రక్షిస్తున్నాడు

- అందువల్లే చిన్నాన్నను చంపిందెవరో, చంపించిందెవరో తెలిసినా శిక్షలు పడటం లేదు
- పైగా బాధితురాలు సునీతపైనే అభాండాలు
- 'సాక్షి'లో వివేకా వ్యక్తిత్వ హననానికి ప్రయత్నం
- మీరు మనుషులేనా? మనస్సాక్షి లేదా మీకు?
- అద్దం ఎదుట నిలబడి మిమ్మల్ని ప్రశ్నించుకోండి
- అన్న జగన్‌ను ఉద్దేశించి షర్మిల తీవ్ర స్వరం
- న్యాయం, నిజం పక్కన రాష్ట్ర ప్రజలు నిలబడాలి
- సునీత పోరాటంలో నేను ఆయుధం అవుతా

కడప, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): "ఒకసారి అద్దం ముందు నిల్చొని హత్య చేసింది సునీత కుటుంబమా అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. అద్దం ఏం సమాధానం చెబుతుందో, మీ మనస్సాక్షి ఏం సమాధానం చెబుతుందో ఒక్కసారి మీ మనసు పెట్టి వినండి" అని సీఎం జగన్‌ను ఉద్దేశించి ఆయన సోదరి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా కడపలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో షర్మిల పాల్గొన్నారు. "హత్య జరిగిన రోజు.. హత్య ఫలానా వాళ్లు చేశారనిగానీ, ఫలానా వాళ్లు చేయించారనేదిగానీ తెలిసే పరిస్థితి లేదు. కానీ ఈరోజున హత్య చేసింది ఎవరో కాదు బంధువులే అని అన్ని సాక్ష్యాలు వేలెత్తి చూపుతున్నాయి" అని తెలిపారు. అయినా.. ఈరోజు వరకు కూడా చిన్నాన్న విషయంలో న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. "చిన్నమ్మ సౌభాగ్యమ్మ, బిడ్డ సునీత... చిన్నాన్న చావుతో అందరికంటే ఎక్కువగా నష్టపోయారు. సౌభాగ్యమ్మ, సునీత బాధితులు. వారి పట్ల సానుభూతి లేకపోగా బాధితులకు భరోసా అనే ఆలోచన లేకపోగా, సునీత కుటుంబం హత్య చేసిందని ఆరోపిస్తున్నారు. ఇది మీ మనస్సాక్షి అయినా ఎలా ఒప్పుకొంటుంది?" అంటూ సోదరుడు జగన్‌ను ఉద్దేశించి తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. ఇంకా షర్మిల ఏమన్నారంటే..

మీరు మనుషులేనా?

"ఆఖరుకు ఇంతగా దిగజారతారని ఎవరూ ఊహించలేదు. 'సాక్షి'లో పైన రాజశేఖర్‌రెడ్డి ఫొటో.. కింద రాజశేఖరరెడ్డి నమ్మిన, ఆయన కోసం పనిచేసిన తమ్ముడి వ్యక్తిత్వ హననం. ఇది న్యాయమేనా? మీ కోసం పనిచేసినపుడు కనిపించలేదా వివేకానందరెడ్డి కేరెక్టర్? ఆఖరి నిమిషం వరకు, చనిపోయే రోజు రాత్రి వరకు వైసీపీ కోసమే చిన్నాన్న క్యాంపెయిన్ చేశారు కదా! వైసీపీ నిలబెట్టిన అభ్యర్థులను ఆయన అంగీకరించకపోయినా జగన్మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని నమ్మి అదే వైసీపీ కోసం క్యాంపెయిన్ చేశారు. అలాంటి వ్యక్తి హననానికి 'సాక్షి'లో పూనుకొంటారా? మీరు మనుషులేనా? అంతటిదో ఆగారా! సోషల్ మీడియాలో ఎన్ని రకాలుగా బెదిరించారు, బూతులు తిట్టారు, తోడబుట్టిన చెల్లెలు అని చూడకుండా సునీతను అవమానించారు. అన్నిటిని తట్టుకుని, ఈరోజు నిలబడింది సునీత"

అప్పుడే ఎందుకు అరెస్టు చేయలేదు?

"ఇన్ని సంవత్సరాలలో న్యాయం జరగాలని, నిజానిజాలు తేలాలని, హంతకులకు శిక్షలు పడాలని సునీత తిరగని చోటు లేదు, తట్టని తలుపు లేదు. నిజంగా సునీత కుటుంబం ఈ హత్య చేసి ఉంటే ఈ కేసును ఇంతగా పట్టించుకోవాల్సిన అవసరం వారికి ఏమిటి? 2019లో మీరు అధికారంలోకి వచ్చారు కదా! కేసు మీ చేతుల్లోనే ఉంది కదా! అప్పుడు సునీతను ఎందుకు అరెస్టు చేయించలేదు? సునీత కుటుంబాన్ని ఎందుకు ప్రశ్నించలేదు? ఎందుకంటే దోషులు ఎవరో నిర్దోషులు ఎవరో మీకు తెలుసు కాబట్టి. మీ మనస్సాక్షికి అంతా తెలుసు."

సునీత పోరాటానికి బలమవుతా.. ఆయుధమవుతా...

"సునీత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తమ్ముడి బిడ్డ. రాజశేఖర్‌రెడ్డి తోబుట్టువులను ఎలా చూసుకున్నారో మీకు తెలియదా? మరి మీరు రాజశేఖర్‌రెడ్డి వారసులే కదా. మరి జగనన్నా! మీరు ఏం చేస్తున్నారు? సునీతకు మాటిస్తున్నా...చిన్నమ్మకు మాటిస్తున్నా.. ఎవరు నిలబడినా నిలబడకపోయినా రాజశేఖర్‌రెడ్డి బిడ్డ మీకు అండగా ఉంటుంది.. సునీత చేస్తున్న పోరాటంలో బలమవుతా... హత్య చేసినవారికి శిక్ష పడాలని సునీత చేస్తున్న న్యాయ, ధర్మ పోరాటంలో నేను ఒక ఆయుధం అవుతా. ఇది రాజకీయాల కోసమో, అధికారం కోసమో, వారసత్వం కోసమో చేస్తున్నది కాదు.. ఆస్తి కోసం చేస్తున్నది అంతకంటే కాదు.. ఈ సమరం చేస్తున్నది న్యాయం కోసం.. చిన్నాన్న ఆత్మశాంతి కోసం చేస్తున్నా. ఒక్క పులివెందుల ప్రజలే కాదు, జిల్లా ప్రజలే కాదు...యావత్ ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరు ఒక నిర్ణయం తీసుకోవాలి. న్యాయం పక్షాన నిలబడాలి, నిజం పక్కన నిలబడాలి. హంతకులను కాపాడుతున్న వారికి గుణపాఠం చెప్పాలి" అని షర్మిల పిలుపునిచ్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

స్పోటిఫై నుంచి మ్యూజిక్ వీడియోలు





స్పోటిఫై మ్యూజిక్ వీడియోలను అధికారికంగా సపోర్ట్ చేస్తోంది. ఇప్పటికిది బేటా ఫీచర్‌గా స్పోటిఫై పేర్కొంది. ప్రస్తుతానికి 11 దేశాల్లో మాత్రమే లభ్యమవుతుంది. ఇందులో ఇండియా లేదు. ఈడీ షీరన్, ఐస్ స్పైస్, అలూనా, అసోకే కు ప్రస్తుతానికి మద్దతు ఇస్తోంది. రాబోయే రోజుల్లో వేలకొద్దీ పాటలను కలుపుకోనుంది. ఈ సదుపాయం లభించాలంటే సాంగ్ టైటిల్‌పై 'స్విచ్ టు వీడియో ఐకాన్' కనిపించాలి. దాన్ని టాపింగ్ చేస్తే సాంగ్ రీస్టార్ట్ అవుతుంది. మ్యూజిక్ వీడియో ఫుల్‌స్క్రీన్ కోసం ఐఓఎస్, ఆండ్రాయిడ్ డివైజ్‌లపై రొటేట్ చేయవచ్చు. మళ్లీ మామూలుగా కావడానికి కూడా స్విచ్ టు ఆడియో పైనే టాప్ చేయాలి. డెస్క్‌టాప్, టీవీ డివైజుల్లోనూ అందుబాటులో ఉంటుంది. అయితే డివైజ్ ఏదైనా సరే, ప్రీమియమ్ చందాదారులకు మాత్రమే వీక్షించగలరు.

వాట్సాప్‌లో చాట్ ఫిల్టర్స్

వాట్సాప్ - చాట్ ఫిల్టర్స్‌పై పనిచేస్తోందని సమాచారం. దీనిపై గత ఏడాది వేసవి తిరిగి సెప్టెంబర్‌లో పని చేసినప్పటికీ పురోగతి లేదు. ప్రస్తుతం మళ్లీ దీనిపై వాట్సాప్ దృష్టిసారించిందని 'డబ్ల్యుబేటాఇన్ఫో' తెలిపింది.



బేటా టెస్టర్లకు ప్రస్తుతం దీన్ని విడుదల చేస్తున్నట్టు కూడా పేర్కొంది. అలాగే ఆ నివేదికలో బైటపెట్టిన స్క్రీన్‌షాట్ ప్రకారం వాట్సాప్‌లో కాన్వర్సేషన్ లిస్టులో టాప్‌లో చాట్ ఫిల్టర్స్ ఉన్నాయి. చదవని సంభాషణల కోసం ఒకటి, గ్రూప్ చాట్స్ లిస్టింగ్స్ కోసం మరొకటి చాట్ ఫిల్టర్లు ఉండనున్నాయి. ఇంతకుమునుపు పర్సనల్, బిజినెస్ చాట్స్ కోసం ఫిల్టర్లను పెట్టి ఒక ప్రయోగం చేసింది. ప్రస్తుతం వాటిని పక్కన పెట్టేసింది. సంభాషణల నిర్వహణ, చాంతాడు జాబితా నుంచి ప్రత్యేకించిన చాట్స్‌ను కనుగొనడం వంటి పనులకు ఈ ఫిల్టర్లు ఉపయోగపడతాయి. మేనేజింగ్ కమ్యూనికేషన్స్ విషయానికి వస్తే వాట్సాప్ ప్రత్యేకంగా చాట్స్ పిన్ చేయడం, ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ కాన్వర్సేషన్స్ ఇండికేట్ చేయడానికి మరొకటి ఫీచర్లపై కూడా వాట్సాప్ పనిచేస్తోంది.

స్లాక్ నుంచి జీఐఎఫ్ ఫైండర్



వ్యాపారాలు, టీమ్స్ కోసం ఉద్దేశించి కమ్యూనికేషన్ టూల్స్‌గా స్లాక్ ప్రసిద్ధి. టీమ్ పరిధిలో ఈమెయిల్, ఫోన్ కాల్స్‌కు స్వస్తిపలికేలా చేసింది. ఇప్పుడు ఇదే కమ్యూనికేషన్ టూల్ తాజాగా జీఐఎఫ్ ఫీచర్‌ను కలిపింది. టీమ్ సభ్యుల మధ్య ఫన్ కోసం దీన్ని క్రియేట్ చేసింది. రోజువారీ మెసేజింగ్‌లో జీఐఎఫ్‌కు ఉన్న ప్రాధాన్యం తెలిసిందే. జీఐఎఫ్‌ని ఇంటిగ్రేట్ చేసినట్టు స్లాక్ ప్రత్యేకించి ఎక్స్‌లో పోస్టు చేసింది. దీంతో పర్ఫెక్ట్ జీఐఎఫ్‌ను యూజర్లు సెలెక్ట్ చేసుకోగలుగుతారు. కొత్త ఫీచర్ కాస్తా ఇప్పుడు గూగుల్‌కు చెందిన జీఐఎఫ్ సెర్చ్ ఇంజిన్‌గా మారింది. ఈ ఫీచర్ సహాయంతో వేలాది జీఐఎఫ్‌లు యూజర్లకు అందుబాటులోకి వచ్చాయి. స్లాక్‌పై జీఐఎఫ్‌ల కోసం అవసరమైన చాట్‌ను ఓపెన్ చేయాలి. తదుపరి ఎమోజీ ఐకాన్‌పై క్లిక్ చేయాలి. అక్కడ జీఐఎఫ్ ట్యాబ్ కనిపిస్తుంది. పాపప్ అయిన వాటి నుంచి ఎంచుకుని జతచేసుకోవాలి. అపై షేర్ చేసుకోవాలి.

వచ్చే నెలలో మైక్రోసాప్ట్ కోపైలెట్ సెక్యూరిటీ



మైక్రోసాఫ్ట్ కోపైలెట్ సెక్యూరిటీ మొత్తానికి వచ్చే నెలలో విడుదల కానుంది. ఈ విషయాన్ని మైక్రోసాఫ్ట్ ఒక బ్లాగ్ పోస్టులో వెల్లడించింది. ఏఐ సైబర్ సెక్యూరిటీ సెంట్రిక్ చాట్‌బోట్ ఇది. గత ఏడాది మార్చిలోనే దీనిని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. సరిగ్గా ఏడాది తరవాత వాస్తవరూపం దరిస్తోంది. భద్రతకు సంబంధించి సందేహాల నివృత్తికి తోడు బెదిరింపులపై దర్యాప్తు, విశ్లేషణలను కూడా ఇది చేపడుతుంది. పాతిక వరకు భాషలను సపోర్ట్ చేస్తుంది. థ్రెట్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి డేటా పెద్ద ఎత్తున దీని వద్ద పోగుపడి ఉంది. 78 ట్రిలియన్ల మేర సెక్యూరిటీ సిగ్నల్స్‌ను ప్రతి రోజూ ప్రాసెస్ చేస్తోంది. దీనికి తోడు లాంగ్వేజ్ మోడల్స్‌ను కూడా అవసరానికి తగ్గట్టు రూపొందిచగలుగుతోంది. ఈ చాట్‌బోట్ రెండు వెర్షన్స్‌లో లభ్యమవుతుంది. అందులో మొదటిది వివిధ సంస్థల్లో అమలులో ఉన్న సెక్యూరిటీ సిస్టమ్‌కు అనుగుణ్యమైనది. మరొకటి అక్కడి వ్యక్తులకు సహాయపడేది కాగా ఈ సర్వీసును గంటకు నాలుగు డాలర్లు చొప్పున నెలవారి బిల్లింగ్‌కు మాట్లాడుకోవాల్సి ఉంటుంది.

ఆండ్రాయిడ్ యూజర్లకు కాల్ టు వీడియో ఫీచర్



ఆండ్రాయిడ్ యూజర్లు ఇకపై రెగ్యులర్ వాయిస్ కాల్స్‌ను వీడియో కాల్స్‌గా మార్చుకునే సౌలభ్యాన్ని పొందనున్నారు. ప్రస్తుతం ఇదే పనిపై గూగుల్ ఉందని, సదరు ఫీచర్ టెస్టింగ్‌లో ఉందని తెలిసింది. ఇందుకోసం ప్రత్యేకించి బటన్ సహాయంతో పెద్దగా ఇబ్బంది పడకుండానే వాయిస్ నుంచి వీడియో కాల్‌కు మారవచ్చు. ఐఫోన్‌లో ఫేస్‌టైమ్ అనుభవం మాదిరిగా ఉంటుంది. ఆండ్రాయిడ్ 14పై రన్ అవుతున్న కొన్ని పిక్సెల్ ఫోన్లకు ఈ ఫీచర్‌ను మొదట అందుబాటులోకి తేనున్నారు. తదుపరి క్రమక్రమంగా దీన్ని విస్తరించనున్నారు. ఈ ఫీచర్‌తోనే ఆండ్రాయిడ్ యూజర్లు ఏకంగా ఐఫోన్ యూజర్లతో వీడియోకాల్స్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే గూగుల్ మీట్ యాప్ ఆండ్రాయిడ్ డివైజ్‌లో ఉండాలి. నేటివ్ యాప్ పరిధిలో మీట్ యాప్‌తో ఇంటిగ్రేట్ అయి సులువుగా పని అవుతుంది. మీట్ యాప్ లేకుంటే దానిని డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రాంప్ట్ అందుతుంది. ఐఫోన్ మాదిరిగా కాకుండా ఆండ్రాయిడ్ డివైజుల్లో ఫ్లెక్సిబిలిటీ ఉంటుంది. మూడో పార్టీ యాప్‌లను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది.

గమ్మా యాప్ : ఏఐ టూల్స్



గమ్మా యాప్ - ప్రజంటేషన్స్ నుంచి వెబ్ పేజీల క్రియేషన్ వరకు రూపకల్పనకుగాను ఏఐ టూల్స్‌ను జతచేసింది. ముఖ్యంగా పనిచేసే చోట ప్రజంటేషన్స్, డాక్యుమెంట్స్ రూపకల్పన సర్వసాధారణం. వీటి కోసం ఉద్యోగులు చాలా పెద్ద ఎత్తున శ్రమపడాల్సి ఉంటుంది కూడా. అయితే గమ్మా యాప్ తాజాగా కలిపిన ఏఐ టూల్స్ సహకారంతో చాలా వేగంగా ఈ పనులను చక్కబెట్టవచ్చు. ఈ టూల్స్ సహాయంతో డాక్యుమెంట్స్ తదితరాల రూపకల్పన చిటికెలో పూర్తవుతుంది. పేరు సూచిస్తే చాలు, పనిని సదరు టూల్స్ పూర్తి చేస్తాయి.




కంటెంట్ రైటింగ్‌తో మొదలుపెట్టి రిఫైనింగ్ వరకు పనులన్నీ చకచకా జరుగుతాయి. ఇందుకోసం...

- గమ్మాకు చెందిన ఏఐ జనరేటర్ - లేఔట్స్ డిజైన్, డిజైన్స్, యూజర్ ప్రాంప్టర్, డాక్యుమెంట్స్, వెబ్ పేజీల తయారీలో సహాయపడుతుంది.
- ఫార్మేటింగ్, స్టయిలింగ్, పొజిషనింగ్ తదితర విషయాల్లో యూజర్ ఆందోళన చెందాల్సిన పని ఉండదు. సింగిల్ క్లిక్‌తో ప్రొఫెషనల్ లుక్‌తో ప్రజంటేషన్‌ను రూపొందిస్తుంది.
- లైవ్ ప్రజంట్ మోడ్‌లో గమ్మా వస్తుంది. యూజర్లు ఈ ప్రజంటేషన్లను షేర్ చేసుకోవచ్చు.
- టెక్స్ సమ్మరైజింగ్, రీరైటింగ్, ఎస్ఈఓ, ఏఐ ఇమేజ్ సెర్చ్ సహా పలు పనులను గమ్మా నిర్వర్తిస్తుంది.
- జీఐఎఫ్‌లు, వీడియోలు, వెబ్‌సైట్స్, చార్టులు కూడా ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

ఉచితంగా కొన్నిఫీచర్లు మాత్రమే యూజర్లకు అందుబాటులో ఉంటాయి. నెలకు పది డాలర్లు చెల్లిస్తే ఈ యాప్‌నకు చెందిన అడ్వాన్స్‌డ్ ఫీచర్లను ఉపయోగించుకోవచ్చు.




గూగుల్ మెసేజెస్‌కు ఆర్‌సీఎస్ కస్టమైజేషన్



గూగుల్ మెసేజెస్ - కొత్త రంగులు, థీమ్స్‌తో ఆర్‌సీఎస్ కస్టమైజేషన్‌ను తీసుకువచ్చింది. రిచ్ కమ్యూనికేషన్ సర్వీసెస్‌గా దీన్ని పలువురు ఉపయోగిస్తుండటం తెలిసిందే. ప్రస్తుత ఫీచర్ జోడింపుతో యూజర్లకు ఇక పర్సనలైజేషన్‌కు అవకాశం ఉంటుంది. ఈ అనుభవం ఆండ్రాయిడ్‌లో లభిస్తుంది. గత నవంబర్ నుంచి దీనిపై పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇది బేటా టెస్టర్లకు అందుబాటులోకి వస్తోంది. '9టుఐగూగుల్' ప్రకారం యూజర్లు తమ ఆర్‌సీఎస్ చాట్‌లో కస్టమ్ బబుల్స్ రంగులో నేపథ్యం పొందవచ్చు. చేంజ్ కలర్స్ ఆప్షన్స్ ఉంటుంది. చాట్ ఇంటర్‌ఫేస్‌కు థీమ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. బ్లూ, గ్రీన్ సహా తొమ్మిది థీమ్ ఆప్షన్స్ ఉన్నాయి. ఈ మార్పుతో ఆర్‌సీఎస్ చాట్ యావత్తు కొత్తగా కనిపిస్తుంది. దీని కోసం మూడుచుక్కలపై టాప్ చేయాలి. చేంజ్ కలర్స్ దగ్గరకు వెళ్లి తొమ్మిది డిఫరెంట్ కలర్ ఆప్షన్స్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. ఇలా ఒకసారి ఆర్‌సీఎస్ చాట్ రంగు మార్చుకుంటే, ఆ మార్పు చాట్ ఇంటర్‌ఫేస్‌లోనూ కనిపిస్తుంది. 'యూ చేంజ్డ్ ద థీమ్' అని మెసేజ్ వస్తుంది. థీమ్‌ను వేరే రంగులోకి మార్చాలని అనుకుంటే ఇంటర్‌ఫేస్ ఒక లింక్‌ను కూడా చూపుతుంది. అలా ఈ ఫీచర్ ప్రస్తుతానికి టెస్టింగ్ దశలో ఉందని సమాచారం.

3డీ వీడియో గేమ్స్‌కు 'సైమా'



Goat Simulator 3: Drive the car
Goat Simulator 3: Jump the fence
Satisfactory: Pick up iron ore
Satisfactory: Open the HUB terminal

గూగుల్ డీప్‌మైండ్ ప్రత్యేకించి 3డీ వీడియో గేమ్స్ కోసం విలక్షణ ఏఐ మోడల్‌ను పరిచయం చేసింది. స్కేలబుల్ ఇన్‌స్ట్రక్టబుల్ మల్టీవరల్డ్ ఏజెంట్(ఎస్ఐఎంఏ - సైమా)అని ఈ ఏఐ మోడల్‌ని అంటారు. వేర్వేరు గేమింగ్ వాతావరణాల్లో టాస్కులను నెరవేర్చే పనిని తెలుసుకుంటోంది. ఇంకా పరిశోధన స్థాయిలోనే ఉంది. ఒకసారి ఇది పక్కాగా రూపొందితే ఆన్‌లైన్ నుంచి రియల్ వరల్డ్ వరకు ఉపయోగించుకోవచ్చని గూగుల్ పేర్కొనడం విశేషం. లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్‌ను క్రియేట్ చేసేందుకు ఎయిట్ గేమ్ స్టూడియోతో గూగుల్ డీప్‌మైండ్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. సైమాని తొమ్మిది వేర్వేరు గేమ్స్ కోసం శిక్షణ ఇప్పించింది. హెలోగేమ్స్, టియర్‌డౌన్, గోట్ సిమ్యులేటర్ 3 వంటివి ఈ గేమ్స్‌లో ఉన్నాయి. ఇందులో ప్రతి గేమ్ వేర్వేరు ఆబ్జెక్టులు, మెనూతో ఇంటరాక్ట్ కావాల్సి ఉంటుంది. అలాగే నాలుగు వేర్వేరు రీసెర్చ్ పరిస్థితులను కూడా కంపెనీ కల్పించింది. తద్వారా కన్‌స్ట్రక్షన్ ల్యాబ్‌ను నిర్మించింది. ఇందులోనే స్కల్పచర్స్ నుంచి అన్నీ రూపొందుతాయి. సైమా ఇప్పటికి 600 వరకు బేసిక్ స్కిల్స్‌ను నేర్చుకుంది. మొత్తమ్మీద మనుషుల ఆదేశాల మేరకు 3డీ వీడియో గేమింగ్‌కు సాధ్యమయ్యేందుకు చురుకుగా వ్యవహారాలు సాగుతున్నాయి.

టెంపరేచర్‌పై పేటెంట్!



యాపిల్ - టెంపరేచర్ మెజర్‌మెంట్‌పై పేటెంట్‌కు దరఖాస్తు చేసినట్టు సమాచారం. యాపిల్ వాచీలో ప్రధానంగా డివైజ్ అలాగే పరిసరాల్లోని ఉష్ణోగ్రతలో ఉండే హెచ్చుతగ్గులను సమన్వయం చేయడం ఇందులోని ఉద్దేశం. దీనికి పేటెంట్ లభిస్తే మామ్మూలు థర్మామీటర్లకు మూడినట్లేనని నిపుణులు చెబుతున్నారు. ఐఫోన్ ఉత్పత్తిదారులు బ్లడ్ ఆక్సిజన్ మానిటరింగ్ ఫీచర్‌ని తమ స్మార్ట్ వాచీల్లో తీసేసిన నేపథ్యంలో ఈ పెటెంట్ చర్చనీయాంశమైంది. యాపిల్ లేటెస్ట్ వాచీల్లో ఇప్పటికే బాడీ టెంపరేచర్ సెన్సర్ ఉన్న విషయం తెలిసిందే. ఈ నెల 7న తాజా పేటెంట్ కోసం యాపిల్ దరఖాస్తు చేసినట్టు తెలిసింది. బాడీ టెంపరేచర్ లెక్కింపులో ఇది నాన్ ఇన్వేజివ్ మెథడ్‌ను ఉపయోగిస్తుంది. ప్రస్తుతం ఉన్న వాచీలు శరీర ఉష్ణోగ్రతలను మాత్రమే తీసుకుంటున్నాయి. నిజానికి హెచ్చుతగ్గులు డివైజ్ అదే విధంగా పరిసరాలను బట్టి ఉంటాయి. పేటెంట్ తీసుకోనున్న విధానంలో డివైజ్‌లోని రెండు లొకేషన్స్‌కు ఉన్న తేడాని కూడా లెక్కిస్తారు. ఇక్కడ హీట్ ఫ్లక్స్ అంటే ఒక యూనిట్ ఏరియాలో - ఒక యూనిట్ టైమ్ లేదా సర్ఫేస్ నుంచి బదిలీ అయ్యే హీట్ అర్థం. మనిషి చర్మంలోని హీట్ ఫ్లక్స్ ఆధారంగా కరెక్షన్ ఫ్యాక్టర్‌ని లెక్కిస్తుంది. ఉపరితల వేడిని లెక్కించేందుకు ఒకటి లేదా అంతకుమించి అల్గోరిథమ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటుంది. సర్ఫేస్ టెంపరేచరని ఉపయోగిస్తామని పేటెంట్‌లో పేర్కొన్నారు. అలాగే పెటెంట్ అయిన వాచీలో మందంగా ఉండే థెర్మోపైల్ ఫిల్మ్ రెండు జంక్షన్లను కలిపి ఉంచుతుంది. మొత్తమ్మీద యావత్తు ప్రక్రియ ఇంకా కాన్సెప్ట్ దశలోనే ఉంది. అన్నీ పూర్తి చేసుకుని ఉనికిలోకి వస్తుందా లేదా అన్నది ప్రశ్నార్థకం. పేటెంట్‌కు దరఖాస్తు చేసినంతమాత్రాన అది ఆమోదం పొంది, మార్కెట్లోకి వస్తుందని చెప్పలేమని కూడా అంటున్నారు.



గూగుల్ పిక్సెల్ 9 సిరీస్‌లో 'అడాప్టివ్ టచ్'



గూగుల్ తన పిక్సెల్ 9 సిరీస్‌లో 'అడాప్టివ్ టచ్' ఫీచర్‌ను విడుదల చేసే పనిలో ఉన్నట్టు 'ఆండ్రాయిడ్ అథారిటీ' పేర్కొంది. ఈ ఫీచర్‌తో ఫోన్ స్క్రీన్‌ను ఆటోమేటిక్‌గా మోడిఫై చేసుకోవచ్చు. దీని కోసం సెట్టింగ్స్‌లోకి వెళ్లి డిస్‌ప్లేని టాప్ చేయాలి. టచ్ సెన్సిటివిటీని ఎంచుకోవాలి. ఇప్పటివరకు పర్యావరణ శక్తుల ప్రభావంతో ఆటోమేటిక్‌గా అడాప్టివ్ టచ్ కలుగుతుందన్న విషయాన్ని గుర్తించలేదు. వన్‌ప్లస్ 12కి చెందిన అక్వా టచ్ మాదిరిగా ఈ ఫీచర్ ఉంటుందని భావిస్తున్నారు. ఫోన్ వేడెక్కినప్పుడు ఈ ఆక్వా టచ్ ఫీచర్ దాని టచ్ సెన్సిటివిటీని అడ్జస్ట్ చేస్తుంది. ఈ ఫీచర్ పిక్సెల్ 9 సిరీస్‌కే పరిమితమా, మిగిలిన పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లకు వస్తుందా అన్నది మాత్రం తెలియరాలేదు. మూడు నెలలకు ఒకసారి పిక్సెల్ ఫీచర్ డ్రాప్ అప్‌గ్రేడ్ ఉంటుంది. అయితే కావాలనే పాత పిక్సెల్స్‌ను గూగుల్ విడిచిపెడుతోంది.

SONY

పీఎస్5 సిస్టమ్‌కు సాఫ్ట్‌వేర్ అప్డేట్



సోనీ - ప్లేస్టేషన్(పీఎస్)5కి అప్డేట్‌తో ఆడియోపరంగా డ్యూయల్‌సెన్స్ కంట్రోలర్‌ను మెరుగుపర్చింది. దాంతో మరికొన్నింటిని కూడా జతచేసింది. కాన్సోల్‌పై టర్న్ అయినప్పుడు యూజర్లకు ఈ అప్డేట్‌కు సంబంధించిన నోటిఫికేషన్ కనిపిస్తుంది. ఈ అప్డేట్‌తో డ్యూయల్‌సెన్స్‌పై స్పీకర్లు, డ్యూయల్‌సెన్స్ ఎడ్జ్ బిగ్గరగా మారుతాయి. వాయిస్ చాట్ ఆడియో, గేమ్ శబ్దాల్లో స్పష్టత ఉంటుంది. తెరవెనుక శబ్దాలను తొక్కిపెడుతుంది. కంట్రోలర్ ఇండికేటర్లలో బ్రైట్‌నెస్ అడ్జస్ట్‌మెంట్‌కు కూడా వీలుంటుంది. సరిగ్గా అదే ఫీచర్‌ని పవర్ ఇండికేటర్‌కు కూడా వస్తుంది. కన్సోల్‌పై రెండు వెర్టికల్ ఇండికేటర్స్ ఉంటాయి. ఇవి పీఎస్5 పరిస్థితిని తెలియజేస్తాయి. పార్టీస్, షేర్‌స్క్రీన్, ఎమోజీ రియాక్షన్లకు కూడా సరికొత్త ఫీచర్లు రాబోతున్నాయి. ఇప్పుడు వచ్చిన అప్డేట్ 15.1 ఎమోజీ సపోర్ట్, సిస్టమ్ సాఫ్ట్‌వేర్ పర్ఫార్మెన్స్ స్టెబిలిటీని సైతం తీసుకొచ్చింది.

ఎంజేపీఏపీబీసీఆర్జేసీ సెట్ నోటిఫికేషన్

విజయవాడలోని మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్)- బీసీ ఆర్జేసీ సెట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 18 ఇంగ్లీష్ మీడియం కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. బాలురకు, బాలికలకు విడివిడిగా కాలేజీలు ఉన్నాయి. మొత్తం 2600 సీట్లు ఉండగా వీటిలో 1300 సీట్లను బాలికలకు ప్రత్యేకించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లు ఎంచుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ అభ్యర్థులకు ఐఐటీ జేఈఈ/నీట్ పరీక్షలకు సంబంధించి కోచింగ్ సౌకర్యం కల్పిస్తారు. 75 శాతం సీట్లను బీసీ గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు, బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉన్నవారికి కేటాయించారు. మిగిలిన 25 శాతం సీట్లను సాంఘిక సంక్షేమ/గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదివినవారికి, సంబంధిత హాస్టళ్లలో ఉన్నవారికి, జడ్పీ స్కూళ్లు/ప్రైవేట్ పాఠశాలల్లో చదివినవారికి నిర్దేశించారు.

బాలుర కళాశాలలు-సీట్లు: సింహాచలం(విశాఖపట్నం), మోపిదేవి(కృష్ణా), నిజాంపట్నం(గుంటూరు), కోట(ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు), దొరవారిసత్రం(ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు), లేపాక్షి(అనంతపురం), గుండుమల(అనంతపురం) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంపీసీ 60, బైపీసీ 40, సీఈసీ 40 సీట్లు ఉన్నాయి. కోట(ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు), దొరవారిసత్రం(ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు), లేపాక్షి(అనంతపురం), గుండుమల(అనంతపురం) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంఈసీ 40 సీట్లు ఉన్నాయి. సోడమ్ (చిత్తూరు), బేతంచర్ల (కర్నూలు) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఉన్నాయి.

బాలికల కళాశాలలు-సీట్లు: నెల్లిమర్ల(విజయనగరం), తానాం(విశాఖపట్నం), నందలూరు(వైఎస్సార్ కడప), అరెకల్(కర్నూలు), నెరవాడ(కర్నూలు), గుడిబండ (అనంతపురం), టేకులోడు(అనంతపురం) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంపీసీ 60, బైపీసీ 40, సీఈసీ 40 సీట్లు ఉన్నాయి. నెల్లిమర్ల(విజయనగరం), తానాం(విశాఖపట్నం), అరెకల్(కర్నూలు), టేకులోడు(అనంతపురం) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంఈసీ 40 సీట్లు ఉన్నాయి. ఆముదాలవలస(శ్రీకాకుళం), డోన్(కర్నూలు) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంపీసీ 40 సీట్లు, బైపీసీ 40 సీట్లు ఉన్నాయి.



ఎంజేపీ ఏపీ బీసీ ఆర్జేసీ సెట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన పదోతరగతి సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. ఎంపీసీ/బైపీసీ గ్రూప్‌లో చేరేవారికి జనరల్ ఇంగ్లీష్ నుంచి 20, మేథమెటిక్స్/బయాలజీ నుంచి 50, ఫిజికల్ సైన్స్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. ఎంఈసీ/సీఈసీ గ్రూప్‌లో చేరేవారికి జనరల్ ఇంగ్లీష్ నుంచి 20, మేథమెటిక్స్ నుంచి 30, సోషల్ స్టడీస్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. విద్యార్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పెన్సిల్ ఉపయోగించకూడదు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

ఐఐటీ/నీట్ కోచింగ్ సెంటర్లు

- **బాలురకు:** సింహాచలం కోచింగ్ సెంటర్‌లో ఐఐటీ 60, నీట్ 40 సీట్లు; దొరవారి సత్రంలో ఐఐటీ 60 సీట్లు ఉన్నాయి.
- **బాలికలకు:** నెల్లిమర్ల కోచింగ్ సెంటర్‌లో ఐఐటీ 60, నీట్ 40 సీట్లు; నందలూరు సెంటర్‌లో ఐఐటీ 60 సీట్లు; టేకులోడు సెంటర్‌లో నీట్ 40 సీట్లు; తానాం సెంటర్‌లో ఐఐటీ 60, నీట్ 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు మీడియంలో చదివినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదు. కుటుంబ వార్షికాదాయం రూ.1,00,000లోపు ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ఎంజేపీ ఏపీ బీసీ ఆర్జేసీ సెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 13
- **వెబ్‌సైట్:** mjpapbcwreis.apcfss.in/

లక్ష్మీపత్ యూనివర్సిటీలో డిజైన్ ప్రోగ్రామ్‌లు

జైపూర్‌లోని జేకే లక్ష్మీపత్ యూనివర్సిటీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్-బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి రెండో రౌండ్ దరఖాస్తులు కోరుతోంది. డిజైన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీ డిజైన్)

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్, ఇంటర్ డిసిప్లినరీ డిజైన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో పదోతరగతి, ఇంటర్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మాస్టర్ ఆఫ్ డిజైన్(ఎం డిజైన్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ప్రొడక్ట్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఏదేని బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి ఏడాది పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

జేకే డిజైన్ ఎంట్రెన్స్ టెస్ట్

- ఇందులో లాజికల్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, విజువల్ సెన్సిబిలిటీస్ అంశాలనుంచి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత సాధించినవారిని మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసి పోర్ట్ ఫోలియో రౌండ్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. సంస్థ నిర్ణయం మేరకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **డిజైన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 4
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, అనంతపురం
- **ఫలితాలు విడుదల:** ఏప్రిల్ 8
- **పోర్ట్‌ఫోలియో రౌండ్:** ఏప్రిల్ 15
- **అభ్యర్థుల సెలెక్షన్స్:** ఏప్రిల్ 17
- **రిజిస్ట్రేషన్స్:** జూలై 8
- **తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.jklu.edu.in/

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంబీఏ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 1
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 6 నుంచి
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** మే 12
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 16న
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 26
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 29
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూన్ 20
- **తరగతులు ప్రారంభం:** జూలై మొదటి వారంలో
- **వెబ్‌సైట్:** acad.uohyd.ac.in

ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరోతరగతి ప్రవేశాలు

అమరావతిలోని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయం- ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 164 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రవేశ పరీక్ష అయిదోతరగతి స్థాయిలో ఉంటుంది. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో పరీక్ష రాయవచ్చు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ విద్యార్థులకు 35 మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు రావాలి. ఈ స్కూళ్లలో బోధన ఉచితం. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తారు.

అర్హత: ప్రభుత్వ/గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగు, అయిదు తరగతులు చదివి ఉండాలి. జనరల్, బీసీ విద్యార్థులు 2012 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2010 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.150; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.75
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ప్రవేశ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 21
- **విద్యార్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 27
- **ఎంపికైన విద్యార్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 29
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కౌన్సెలింగ్:** ఏప్రిల్ 30
- **తరగతులు ప్రారంభం:** జూన్ 12 నుంచి
- **వెబ్‌సైట్:** https://apms.apcfss.in

లిటిల్స్



ఎవరు రాజు?

ఒక అడవిలో సింహం ఉండేది. తనే రాజుగా ప్రకటించుకుంది. ప్రతి రోజూ తన దగ్గరకే జింకలు, తోడేళ్లు, పందులు.. ఇలా రోజూ ఒకటి ఆహారంకోసం రావాలని ఆజ్ఞాపించింది. దీంతో జంతువులన్నీ నిరసించాయి. అయినా రాజుగారు ఆజ్ఞ కాబట్టి తప్పలేదు. కుందేలు లాంటి జంతువులు వెళ్లినపుడు సింహం కోప్పడేది. అడవిలోకి వేటకు వెళ్లి జంతువులను భయభ్రాంతులకు గురిచేసేది. దీంతో సింహంతో ఏదోటి మాట్లాడాలని అనుకున్నాయి జంతువులు.

ఆ రోజే ఆ అడవిలోకి మదపుటేనుగు వచ్చింది. ఈ అడవికి నేనే రాజును అన్నది. మిగతా జంతువులన్నీ ఆశ్చర్యపోయాయి. అసలే సింహం బాధకు చస్తోంటే.. ఇదో తలనొప్పి అనుకున్నాయి. విషయం ఏనుగుకు



నక్క చెప్పింది. 'అయినా ఈ అడవిలో ఆ సింహాన్ని కొట్టే పరాక్రమం ఎవరికి ఉంది. ఊరికే పొడవు, ఎత్తు, బలం ఉంటే ఏం లాభం? బుర్ర ఉండొద్దా' అని ఉడికించింది ఏనుగును. దీంతో ఏనుగు ఇలా అంది.. 'ఈ అడవికి నేనే రాజును. ఎవరు వస్తారో చూస్తా' అన్నది. దీంతో జంతువులన్నీ ఏకమయ్యాయి. సింహం దగ్గరకు వెళ్లాయి. నేనే రాజు అంటూ రెండు ప్రగల్భాలు పలికాయి.


ఈ గొడవ కాస్త సద్దుమనగలేదు, దీంతో జంతువలకు ఇబ్బంది కలిగింది. నేనంటే నేను గొప్ప అనుకున్నాయి. ఇంతలో నక్క వచ్చి.. 'మీరు గొప్పవారు అని అనుకోవటం కాదు. అడవికి రాజు ఒకరే ఉండాలి' అన్నది. ఏనుగుతో 'నువ్వు జింకను పట్టుకుని రా' అన్నది. సింహంతో 'నువ్వు పెద్ద బండరాయిని తీసుకురా' అన్నది. అది కూడా సాయంత్రంలోపు చేయాలి అన్నది. రెండూ వేగంగా వెళ్లాయి. రెండూ వాటికి చెప్పిన పనులు చేయలేక వెనక్కి వచ్చాయి. నక్క వారితో ఇలా అన్నది.. 'మీరు ఎవరూ మీకు అప్పగించిన పనిని చేయలేకపోయారు. అంటే ఇద్దరూ కొట్లాడుకుని ఉపయోగం లేదు. జంతువులను సమానంగా చూడటం నేర్చుకోండి' అన్నది. ఆ తర్వాత ఏనుగు 'నేనే రాజు' అనలేదు. సింహం అలా రాజుగా ఉండిపోయింది.

శునకాలు ఎన్ని?





దారి కనుక్కోండి



10 తేడాలను గుర్తించండి

డైలీ సుడోకు - 256

	2		7	3				
3	4	7			2		6	
								7
4		8		5		2	3	
	6	5		1		7		8
1								
	7		4			5	1	9
				9	3		7	

సుడోకు - 255 సమాధానం

1	8	4	3	6	7	9	5	2
7	5	6	1	9	2	3	8	4
2	3	9	5	4	8	7	6	1
5	9	3	2	1	4	6	7	8
4	6	7	8	5	9	1	2	3
8	2	1	6	7	3	5	4	9
9	7	2	4	3	6	8	1	5
6	1	8	9	2	5	4	3	7
3	4	5	7	8	1	2	9	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్

1. దేశంలో తొలి అండర్ వాటర్ మెట్రో టన్నెల్‌ను 2024 మార్చి 6న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ టన్నెల్‌ని ఏ నది దిగువన నిర్మించారు?
1) హుగ్లీ 2) తపతి 3) గంగా 4) గోదావరి

2. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాముల పేర్లను ప్రధాని మోదీ 2024 ఫిబ్రవరి 27న ప్రకటించారు. అయితే దిగువ పేర్కొన్నవారిలో గగన్‌యాన్ వ్యోమగాములు ఎవరు?
1. పి.బాలకృష్ణన్ నాయర్ 2. అజిత్ కృష్ణన్
3. అంగద్ ప్రతాప్ 4. శుభాంశు శుక్లా
1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
3) 2, 3, 4 మాత్రమే 4) 1, 2, 3, 4 మాత్రమే

3. కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి
1. రాజస్థాన్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భజన్ లాల్ శర్మ ప్రమాణం చేశారు.
2. భజన్‌లాల్ శర్మ రాజస్థాన్‌లోని సంగనేర్ నియోజక వర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు.
3. రాజస్థాన్‌లోని మొత్తం 230 అసెంబ్లీ స్థానాలకుగాను భారతీయ జనతా పార్టీ(బీజేపీ) 105 అసెంబ్లీ స్థానాలను గెలుచుకొని విజయాన్ని సాధించింది.
4. రాజస్థాన్ రాష్ట్ర గవర్నర్‌గా ప్రస్తుతం మంగుభాయ్ సీ పటేల్ వ్యవహరిస్తున్నారు.
1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
3) 1, 4 మాత్రమే 4) 1, 2, 3, 4

4. కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి
1. సూర్యుని గుట్టు విప్పేందుకు భారత్ తొలిసారి 'పీఎస్ఎల్‌వీ-సీ57' రాకెట్ ద్వారా ప్రయోగించిన వ్యోమనౌక ఆదిత్యా-ఎల్ 1 ఇటీవల లగ్రాంజ్ పాయింట్ (ఎల్ 1)కు చేరుకుంది.
2. గ్రహణాల సందర్భంలో ఎలాంటి అడ్డులేకుండా నిరంతరంగా సూర్యుడిని చూసేలా అనువైన ఎల్ 1 పాయింట్‌లో ఉంటూ ఆదిత్య - ఎల్ 1 అధ్యయనం చేయనుంది.
3. భూమికి సూర్యునికి మధ్య దూరం 15 కోట్ల కిలోమీటర్లు కాగా అందులో ఒక శాతం అంటే 15 లక్షల కిలోమీటర్ల దూరాన్ని లగ్రాంజ్ పాయింట్ (ఎల్ 1) గా గణిస్తున్నారు.
4. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ మంత్రిగా ప్రస్తుతం భూపేందర్ సింగ్ యాదవ్ వ్యవహరిస్తున్నారు.
5. ఈ మిషన్‌కు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వీర ముత్తువేల్ వ్యవహరించారు.
1) 1, 2, 3 మాత్రమే 2) 1, 2, 4 మాత్రమే
3) 1, 2, 5 మాత్రమే 4) 1, 2, 3, 4, 5

5. కింది వారిలో పార్లమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికిచ్చే సంసద్ రత్న అవార్డులను 2024కి గాను ఎవరికి ప్రకటించారు?
ఎ. సుకాంత మజుందార్ బి. సుధీర గుప్తా
సి. శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే డి. కుల్దీప్ రాయ్
ఇ. అమోల్ రామ్ సింగ్ కొల్హే
1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి, ఇ
3) ఎ, సి, డి, ఇ 4) ఎ, బి, సి, డి, ఇ

ఏపీ డీఎస్సీ ఎస్‌జీటీ మోడల్ ప్రశ్నలు

6. కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి
1. రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్ దేశానికి రక్షణ పరికరాలను అందిస్తామని నాటో కూటమిలోని జీ-7 దేశాలు ప్రకటించాయి.
2. ఈ కూటమిని 1999లో ఏర్పాటు చేశారు
3. జీ-7 కూటమిలోని సభ్య దేశాలు-యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, అమెరికా
4.జీ-7 కూటమిలో భారతదేశానికి సభ్యత్వం ఉంది
5. 49వ జీ-7 కూటమి సదస్సు 2023 మేలో జపాన్‌లోని హిరోషిమాలో జరిగింది.
6. 50వ జీ-7 కూటమి సదస్సు 2024లో ఇటలీలోని పూగిలలో జరుగనుంది.
1) 1, 2, 3 మాత్రమే 2) 1, 2, 3, 4 మాత్రమే
3) 1, 3, 5, 6 మాత్రమే 4) 1, 2, 3, 4, 5, 6

7. కింది వాటిలో సరైనవాటిని గుర్తించండి



1. భారత సంతతి రచయిత్రి నందినీ దాస్‌ను 2023 బ్రిటిష్ అకాడమీ బుక్ ప్రైజ్ వరించింది
2. నందినీ దాస్ రచించిన కోర్టింగ్ ఇండియా: ఇంగ్లండ్, మొఘల్ ఇండియా అండ్ ద ఆరిజన్స్ ఆఫ్ ఎంపైర్ అనే పుస్తకం దీనికి ఎంపికైంది.
3. ప్రపంచంలో సాంస్కృతిక అవగాహన పెంపొందిస్తున్నందుకు నందిని దాస్‌కు ఈ పురస్కారం కింద రూ.50 లక్షల నగదు బహుమతిని అందజేస్తారు.
1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
3) 1, 3 మాత్రమే 4) పైవన్నీ

8. కింది వాటిలో సరైన జతను గుర్తించండి
1. బహ్రెయిన్ గ్రాండ్ ప్రిక్స్-2023 విజేత-మాక్స్ వెర్ స్టాపెన్
2. సౌదీ అరేబియా గ్రాండ్ ప్రిక్స్-2023 విజేత-మాక్స్ వెర్ స్టాపెన్
3. మియామీ గ్రాండ్ ప్రిక్స్-2023 విజేత -సెర్గియో పెరేజ్. 4. మొనాకో గ్రాండ్ ప్రిక్స్-2023 విజేత-మాక్స్ వెర్ స్టాపెన్
1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
3) 3, 4 మాత్రమే 4) 1, 4 మాత్రమే

9. కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి
1. 'ఇండియన్ కోస్ట్ గార్డ్(ఐసీజీ)' దళానికి 25వ డైరెక్టర్ జనరల్‌గా 'రాకేష్ పాల్' నియమితులయ్యారు. 2. ఇండియన్ కోస్ట్ గార్డ్(ఐసీజీ) దళాన్ని 1975లో స్థాపించారు
3. ఇండియన్ కోస్ట్ గార్డ్(ఐసీజీ) దళం కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో విధులను నిర్వర్తిస్తుంది
4. ఇండియన్ కోస్ట్ గార్డ్(ఐసీజీ) దళం ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంది
5. భారత నావికాదళ ప్రస్తుత అధిపతి- అడ్మిరల్ ఆర్.హరికుమార్
1) 1, 2, 3 మాత్రమే 2) 2, 3, 4 మాత్రమే
3) 1, 4, 5 మాత్రమే 4) 1, 2, 3, 4, 5

10. కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి
1. భారతదేశం వెలుపల తొలిసారి టాంజానియా దేశంలోని జాంజి బార్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) సంస్థ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నారు.
2. దీనిపై ఐఐటీ మద్రాస్, టాంజానియా విద్యా ఒకేషనల్ ట్రైనింగ్ మంత్రిత్వశాఖ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.
3. భారతదేశంలో ఏర్పాటు చేసిన తొలి ఐఐటీ- 'ఐఐటీ బాంబే'
4. టాంజానియా దేశ ప్రస్తుత అధ్యక్షుడు- సమియా సులుహు హసన్
1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
3) 1, 2, 3 మాత్రమే 4) 1, 2, 4 మాత్రమే

11. కింది వాటిలో సరైనవాటిని గుర్తించండి
1. 2023 అక్టోబరులో జరిగిన వన్డే ప్రపంచకప్‌కు భారత్ ఆతిథ్యం ఇచ్చింది
2. 2023 అక్టోబరు 5 నుంచి నవంబరు 19 వరకు 48 మ్యాచ్‌లు జరిగాయి
3. భారత్ ఇప్పటి వరకు రెండు(1983, 2011) ప్రపంచ కప్‌లు గెలుచుకుంది
4. 2023లో విజేతగా ఆస్ట్రేలియా జట్టు నిలిచింది
1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
3) 3, 4 మాత్రమే 4) 1, 2, 3, 4 మాత్రమే

12. కింది వాటిలో సరైనవాటిని గుర్తించండి
1. ఇటీవల వార్తల్లో నిలిచిన 'ముస్తఫా మద్ బౌలి' ఈజిప్టు దేశానికి ప్రధానమంత్రిగా వ్యవహరిస్తున్నారు. 2. ఈజిప్టు దేశ ప్రస్తుత అధ్యక్షుడు- అబ్దుల్ ఫతా ఎల్-సీసీ
3. భారత్‌లో ఉన్న దావూది బోహ్రా తెగ ముస్లింలు ఈజిప్టుకు చెందినవారే.
4. గత 26 ఏళ్ల తరవాత భారత ప్రధాని తొలిసారి ఇటీవల ఈజిప్టును పర్యటించారు
1) 1, 2 మాత్రమే 2) 2, 3 మాత్రమే
3) 3, 4 మాత్రమే 4) 1, 2, 3, 4

13. కింది వాటిలో సరైనవాటిని గుర్తించండి
1. సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులయ్యారు.
2. జాతీయ న్యాయ సేవలు ప్రాధికార సంస్థ(నల్సా)కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఇటీవల జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ నియమితులయ్యారు
3. సుప్రీంకోర్టు 50వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రస్తుతం డీ.వై చంద్రచూడ్ వ్యవహరిస్తున్నారు.
4. కేంద్ర న్యాయశాఖమంత్రిగా ప్రస్తుతం అర్జున్ రామ్ మెఘ్వాల్ వ్యవహరిస్తున్నారు.
5. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రస్తుతం జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ వ్యవహరిస్తున్నారు.
1) 1, 2, 3 మాత్రమే 2) 1, 2, 4 మాత్రమే
3) 3, 4, 5 మాత్రమే 4) 1, 2, 3, 4, 5

14. చెస్ క్రీడలో ఉండే గదుల సంఖ్య?
1) 36 2) 64 3) 100 4) 49

15. జ్ఞానపీఠ్ అవార్డ్ పొందిన తొలి తెలుగు రచయిత?
1) విశ్వనాథ సత్యనారాయణ
2) పీ.వీ.నరసింహారావు 3) గురజాడ అప్పారావు
4) సీ. నారాయణ రెడ్డి

16. కింది వాటిలో తప్పుగా ఉన్న జతను గుర్తించండి.
1) షెహనాయ్ - బిస్మిల్లాఖాన్
2) వేణువు - హరిప్రసాద్ చౌరాసియా
3) మృదంగం - షేక్ చినమౌలానా
4) సితార - రవిశంకర్

విద్యా దృక్పథాలు

17. 'గృహస్థాశ్రమం' పదానికి సరైన అర్థాన్ని సూచించేది?
1) భగవంతుని పూజించడం
2) గురుకులాల్లో విద్యాభ్యాసం
3) జీవిత సౌఖ్యాలకు దూరంగా ఉండడం
4) వైవాహిక జీవితాన్ని గడపడం

18. 'త్రిపీఠకాలు' వీరి బోధనలు
1) వర్థమానుడు 2) బుద్ధుడు
3) ఆదిశంకరాచార్యుడు 4) రామానుజుడు

19. పాఠశాలల్లో రోజువారీ జరిగే నగదు లావాదేవీలకు చెందిన వివరాలు ఈ రికార్డులో నమోదు చేస్తారు
1) క్యాష్ పుస్తకం 2) లెడ్జర్
3) ఆకస్మిక ఖర్చుల పుస్తకం(కంటిజెన్సీ రికార్డ్)
4) జమ వివరాల పుస్తకం(రెమిటెన్సీ రికార్డ్)

20. పాఠశాల క్యాలండర్‌లో చేర్చదగని అంశం
1) అన్ని రకాల సెలవులు
2) ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి సంబంధించిన సెలవులు, ప్రమోషన్లు, పదవీ విరమణ వివరాలు
3) పబ్లిక్, పాఠశాల పరీక్షల తేదీలు
4) స్కూల్, కమిటీలు, టీచర్ అసోసియేషన్‌లు, స్థానిక విహార యాత్రలు, పాఠశాల పోటీల సమావేశాల తేదీలు.

సమాధానాలు
1) 1 2) 4 3) 1 4) 1 5) 4
6) 3 7) 1 8) 4 9) 3
10) 4 11) 4 12) 4 13) 3
14) 2 15) 1 16) 3 17) 4
18) 2 19) 1 20) 2



ఆకిశెట్టి వెంకటస్వామి,
సీనియర్ ఫ్యాకల్టీ